# తీరొక్క కథలు

## డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినుల కథా సంకలనం

సలహాదారులు

డా॥ ఎ. రమాదేవి
చైర్ పర్సన్

జె.ఎస్. సుధాకరుడు
కరస్పాండెంట్ & సెక్రటరి

డా. కె. ఝాన్సీరాణి
అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ప్రిన్సిపాల్ I/C

సంపాదకులు
అలివేణి మబ్బు
అధ్యక్షులు, తెలుగు శాఖ


**తెలుగు శాఖ**
**ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ & సైన్స్ మహిళా కళాశాల**
**ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, హైదరాబాద్**

**THEEROKKA KATHALU**

*A collection of stories by degree 2nd year students*

Editor : **Aliveni Mabbu**

*Published by:*

**Self-Published**

*Publisher's Address :*

**Aliveni Mabbu**
**Head Department of Telugu**
**Andhra Mahila Sabha Arts & Science college for Women**
Osmania University Campus, Hyderabad.
Cell : 8919733400
Email : maamsdc@gmail.com

Layout & *Cover Design :*

**Akshara Grafix**
Nallakunta, Hyderabad - 44.
Cell : 9010444395

*Printing :*

**Sai Thirumala Printers**
Chikkadapally, Hyderabad - 20.
Ph : 040-66637672

ISBN : 978-93-5777-608-0

First Edition : 2023

Copies : 500

Price : Rs. 100/-

© **Aliveni Mabbu**

# కథల వరుస


- సహాయకులు – **డా. సిహెచ్ భిక్షపతి,** 6
  *అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ పొలిటికల్ సైన్స్*
  *శేర్లింగంపల్లి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, హైదరాబాద్*
- ఆశీస్సులు – **డా॥ కె. ఝాన్సీ రాణి,** *అసోసియేట్ ప్రొఫెసర్* 7
  *ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ప్రిన్సిపాల్ I/C*
  *ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల,*
  *ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, హైదరాబాద్*
- తీరొక్క కథల సమాహారం – **ఆచార్య సూర్య ధనంజయ్,**
  *తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం* 8
- కథాగత సందేశం – **డా. పి. లలిత వాణి,** 10
  *ఎం.ఎ., పిహెచ్.డి. తెలుగు, ప్రిన్సిపల్ (రి).*
  *ప్రభుత్వ డిగ్రీకళాశాల, చేవెళ్ళ, రంగారెడ్డి జిల్లా*
- అందమైన కథలు – **డా॥ కె.కరుణాదేవి,** 12
  *అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్*
  *అకాడమిక్ కోఆర్డినేటర్, ఆంధ్ర మహిళాసభ ఆర్ట్స్*
  *అండ్ సైన్స్ మహిళా కళాశాల.*
- కథల బుట్ట – **డా॥ జె.సరిత,** 14
  *అసోసియేట్ ప్రొఫెసర్ హెడ్ అండ్ డీన్ డిపార్ట్మెంట్*
  *ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్*
  *ఆంధ్ర మహిళాసభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల*
- మట్టి పరిమళాలు – **ఎం.అలివేణి,** *తెలుగుశాఖ అధ్యక్షులు* 15
  *ఆంధ్ర మహిళాసభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల*
- కృతజ్ఞతలు – **ఎం.అలివేణి,** *తెలుగుశాఖ అధ్యక్షులు* 18
  *ఆంధ్ర మహిళాసభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల*

◆ కథలు

| | | |
|---|---|---|
| 1. | రాజు–7 చేపలు | 20 |
| 2. | వానపాము | 21 |
| 3. | అంబలి తెచ్చిన తిప్పలు | 23 |
| 4. | మోసం | 24 |
| 5. | రాజు గారి కోతి | 27 |
| 6. | ఇద్దరు అక్కచెల్లెలు | 28 |
| 7. | పిసినారి | 31 |
| 8. | కాకి– పాము | 33 |
| 9. | సూర్య మండలం | 35 |
| 10. | ఆశపోతు నక్క | 36 |
| 11. | పంచుకుందాం | 38 |
| 12. | పెద్దపులి ఆకలి | 40 |
| 13. | నక్కతెలివి | 42 |
| 14. | రుద్రమ్మ దేవి | 44 |
| 15. | మూడు ప్రశ్నలు | 49 |
| 16. | నరుడు ఆయుష్షు | 52 |
| 17. | అత్యాశ – దురాశ | 55 |
| 18. | సీతారాముల వారికి సంబంధించిన ఒక చిన్న కథ | 57 |
| 19. | గాడిద గుర్రం | 60 |
| 20. | దేవుడే కాపాడుతాడు | 61 |
| 21. | కొమురవెల్లి మల్లన్న కళ్యాణం | 63 |
| 22. | ఎద్దు గర్వం | 64 |
| 23. | నక్క దురాశ | 66 |
| 24. | పల్లె ఎలుక –పట్నం ఎలుక | 68 |
| 25. | కొంగ, జిత్తుల మారి నక్క | 69 |
| 26. | బ్రాహ్మడి మేక | 71 |
| 27. | నిజాయితీ | 72 |
| 28. | ఏనుగు కుందేలు | 74 |
| 29. | నెయ్యి – గులకరాళ్ళు | 76 |

30. ఆవు - పులి 78
31. రామయ్య ఆవు 79
32. ఆలస్యం అమృతం విషం 80
33. పులి చేతిలో గాజు 81
34. వ్యాపారి 82
35. చాణుక్యుని జ్ఞానోదయం 83
36. తండ్రి - కొడుకు 84
37. తెలివి తక్కువ తనం 85
38. హరిచంద్ర మహారాజు 86
39. చులకన 88
40. ఎత్తుకు పై ఎత్తు 91
41. కోతి- డప్పు 93
42. రాజులు మారెనో, గుర్రాలు ఎగిరెనో 96
43. పేదరాజు కుటుంబం 98
44. కలిసి వచ్చిన అదృష్టం 100
45. నల్లి - పేను 102
46. అమ్మ మాట 105
47. పాపం- పుణ్యం 106
48. అన్నదమ్ములు 108
49. అమరలింగడు 109
50. రాజు-జుట్టులేని ఐదుగురు భార్యలు 111
51. స్నేహమే బహుమతి 114
52. మేడారం జాతర ఆవిర్భావం - చరిత్ర 116
53. అన్నా చెల్లెలు 119
54. గుణపాఠమే సరైన బహుమతి! 123
55. ఇద్దరు యువరాజులు 126
56. అలవాటు ! ... 127
57. కోతి-ముల్లు 128

* * *



**డా. సిహెచ్ భిక్షపతి**
*అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ పొలిటికల్ సైన్స్*
*శేర్లింగంపల్లి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, హైదరాబాద్.*

# సహాయకులు

జీవితాన్ని ఒక ఉన్నత స్థానంలో ఉంచేది విద్య. సమాజంలో విలువలను, జ్ఞానాన్ని, గౌరవాన్ని చేకూర్చేది విద్య.. అందుకే,

"అక్షరం ఓ ఆయుధం
అక్షరం ఓ చైతన్యం
అక్షరం ఓ అద్భుతం".

చదువు జీవితంలో ఎంతో ప్రధాన పాత్రను పోషిస్తుందని, ఉన్నత శిఖరాలను చేరే విజ్ఞానాన్ని అందిస్తుందని, విద్య ఎంతో విలువైనదని, భావించే నా భర్త నన్ను ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిస్తున్నాడు. విద్యార్థులు రాసిన ఈ కథా సంకలనం ముద్రించడంలో నైతికమద్దతును అందించి ఆర్థిక సహాయం చేసిన నా భర్త డా॥ సిహెచ్. భిక్షపతి (అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, షేర్ లింగంపల్లి, హైదరాబాద్) గారికి కృతజ్ఞతలు.

**– అలివేణి మబ్బు**
అధ్యక్షులు తెలుగు శాఖ
ఆంధ్ర మహిళ సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల



**డా॥ కె. ఝాన్సీ రాణి**
*అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ప్రిన్సిపాల్ I/C*
*ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల, ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, హైదరాబాద్*

# ఆశీస్సులు

భారత స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి, న్యాయవాది సామాజిక కార్యకర్త, పద్మ విభూషణ్ డా. దుర్గాబాయి దేశముఖ్ గారు స్త్రీల కోసం, స్త్రీల అభ్యున్నతి కోసం, స్థాపించిన "ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల"లో చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థినులను అసైన్‌మెంట్‌లో భాగంగా (2022లో) వాళ్ల నాయనమ్మ, అమ్మమ్మల, తాతయ్యల దగ్గర నుండి కథలను సేకరించి రాసిన విద్యార్థినులను, విద్యార్థినిలచే ఇంత చక్కటి ప్రాజెక్టు వర్క్ చేయించి ఈ కథలను ఒక పుష్పగుచ్ఛంలా చేర్చి "తీరొక్క కథలు" అనే కథాసంకలనంగా తీసుకొస్తున్న తెలుగు శాఖ అధ్యక్షురాలు శ్రీమతి అలివేణిని మనస్ఫూర్తిగా ప్రశంసిస్తున్నాను.

నేటి కాలంలో విద్యార్థులు ఫోన్లకు, టీవీలకు, ఇంటర్నెట్లకు, అంకితమయ్యే సమయాన్ని కాస్త పక్కకు పెట్టి, వాళ్ళ నాయనమ్మలు, అమ్మమ్మలు, తాతయ్యలతో సమయాన్ని గడిపి, వారికి పాత రోజులను నెమరువేయించి, కథలు చెప్పించుకొని, "తీరొక్క కథలు" అనే కథా సంకలనాన్ని రాసి అందిస్తున్న విద్యార్థినిలను అభినందిస్తున్నాను.

ఈ కథా సంకలనంలోని కథలు అన్ని చాలా అద్భుతంగా ఉన్నాయి. ఇలాంటి కథలు కనుమరుగైపోకుండా మౌఖిక రూపంలో ఉన్న కథలను, అక్షర రూపంలో తెస్తున్నందుకు ఈ కళాశాల ప్రిన్సిపల్‌గా విద్యార్థులను, మరోసారి హృదయపూర్వకంగా అభినందిస్తూ ఆశీర్వదిస్తున్నాను.

**డా॥ కె. ఝాన్సీ రాణి**
అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్
అండ్ ప్రిన్సిపాల్ I/C



**ఆచార్య సూర్య ధనంజయ్**
*తెలుగుశాఖ,*
*ఉస్మానియా విశ్వవిద్యాలయం*

# తీరొక్క కథల సమాహారం

కథలు జీవన వ్యతల్నే కాదు తాత్త్విక సంపదను పట్టిస్తాయి. మొదటి నుండి కథల్లోనే మనిషి తన జీవితాన్ని చూసుకుంటూ చక్కటి భవిష్యత్ మార్గాన్ని నిర్మించుకుంటున్నాడు. అటువంటి కథల్ని నేటి ఆధునిక కాలంలో రాయడం, సేకరించడం అనేది ఒక చక్కని సృజనాత్మక నైపుణ్యం. డిగ్రీ విద్యార్థినుల్లో అంతర్లీనంగా దాగున్న కథారచన, సేకరణ వంటి పరిశోధనా నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఆంధ్ర మహిళా సభ తెలుగు శాఖ అధ్యక్షులు ఎం. అలివేణి చేసిన ప్రయత్నం ఎంతో ప్రశంసనీయమైనది.

కథలను చెప్పేవారు కానీ, వినేవారు కానీ లేని ఈ రోజుల్లో ఇన్ని కథలను ప్రాజెక్టులో భాగంగా సేకరించి గ్రంథంగా తీసుకురావడం అభినందించదగ్గ విషయం.

జానపద కథలు పిల్లలకు, పెద్దలకు వయోభేదం లేకుండా మనోరంజకాన్ని కలిగిస్తాయి. నీతిని బోధిస్తాయి, అంతేకాదు జానపద కథలు జాతి యొక్క సంస్కృతిని, ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను, ప్రాంతీయ చరిత్రలను ఒక తరం నుండి మరో తరానికి అందిస్తాయి. నీతిని, ధర్మాన్ని ఉపదేశిస్తాయి. అటువంటి జానపద కథలను తీరొక్క పువ్వుల్లా కనిపించే 56 మందికి పైగా డిగ్రీ విద్యార్థినిలు సేకరించి "తీరొక్కకథలు" అనే చక్కని శీర్షికతో వెలుగులోకి తెస్తున్నందుకు ముందుగా అభినందనలు. ఈ తీరొక్క జానపద కథల సమాహార సంకలనం అరుదైనదని చెప్పవచ్చు. కథలను చదివితే చిన్నప్పుడు నాయనమ్మ ఒడిలో పడుకొని, తాతయ్య మంచం పక్కన కూర్చొని ఆసక్తిగా విన్న కథలు మన కళ్ళ ముందు మెదులుతాయి. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేయిస్తాయి.

చిన్న నాడు ఇంటి పరిసరాల్లో తిరిగే చిన్ని ప్రాణులతో అనుబంధం పెంచుకొని వాటి చుట్టూ పసిమనుసులు అల్లుకునే కథనాలను కథలుగా అల్లడం, తిండి గింజలు సేకరించుకున్న పేద ప్రజలు వాటిని పిండి చేసుకుని అంబలికాచుకునే నిమిత్తం వాటిని ఆరబోసినప్పటినుండి గిన్నెలో అంబలిగా మారేంతవరకు ఎన్నో పక్షులు, జంతువులు వాటిని తమవంతుగా ఆరగించే విధం, వాటి పట్ల సానుభూతిని ప్రదర్శించే పల్లె ప్రజల ఔదార్యం ఈ కథల్లో దర్శించవచ్చు.

జంతువులే పాత్రలుగా జనజీవనానికి ప్రతీకలుగా కనబడే కథలు బాల్యంలో చదివిన పంచతంత్ర కథలను స్ఫురణకు తెస్తాయి. జీవితానికి కావలసిన నీతిని పరమార్థ జ్ఞానాన్ని ఈ కథలో చదువరి అందుకుంటాడు. అక్బర్ బీర్బల్ కథల్లోని నైతిక విలువలు, సృజనాత్మక ఆలోచనలు విద్యార్థి లోకానికి అందించిన తీరును, సింహాసన ద్వాత్రంశికలో బోధించిన మానవీయ బోధలను ఈ సంకలనం పట్టుకున్నట్టుగా కనిపిస్తుంది. ఆబాల గోపాలం ఆనందంగా, ఉల్లాసంగా చదివి చిరు జ్ఞాపికగా, దాచుకోదగ్గ గ్రంథంగా ఈ కథల సంకలనం ఉన్నది. తారా తోరణంలా కనిపించే ఈ కథలు పాఠకుడిని ఒకదాని తర్వాత ఒకటి చదువుతూ పోవాలనిపించేలా చేస్తాయనడంలో సందేహం లేదు.

డిగ్రీ విద్యార్థినులే అయినా విశ్వవిద్యాలయ పరిశోధకుల వలె జానపద కథలను సేకరించడం, వాటిని తమదైన వ్యక్తీకరణతో కథనం చేయడం అమోఘం. ఈ విషయంలో ఆంధ్ర మహిళా సభ విద్యార్థినులను మనసారా అభినందిస్తున్నాను.

బాల సాహిత్యానికి దగ్గరగా సాగిన ఈ కథల సంకలనం ప్రతి పాఠశాల, కళాశాల గ్రంథాలయంలో ఉండదగ్గది. ఇంత మంచి కథలను ఒక పూలహారంగా కూర్చి వెలుగులోకి తెస్తున్న ఆంధ్ర మహిళా కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు అలివేణి కృషి, ప్రోత్సాహం ఆనందించదగ్గది. వీరి ఈ ప్రయత్నం ఎన్నో కళాశాలలకు ప్రేరణగా నిలబడుతుందని నా భావన. ఇలాంటి సంకలనాలు మరిన్ని రావాలని మనసారా ఆకాంక్షిస్తూ... విద్యార్థినులందరికీ శుభాశీస్సులు మరియు శ్రీమతి అలివేణి గారికి శుభాకాంక్షలు.

**ఆచార్య సూర్య ధనంజయ్**

తెలుగుశాఖ,

ఉస్మానియా విశ్వవిద్యాలయం

*తేది: 21-12-2022.*



**డా. పి. లలిత వాణి**
*ఎం.ఎ., పిహెచ్.డి. తెలుగు,*
*ప్రిన్సిపల్ (రి).*
*ప్రభుత్వ డిగ్రీకళాశాల, చేవెళ్ళ, రంగారెడ్డి జిల్లా*

# కథాగత సందేశం

"తీరొక్కకథలు" చక్కని తీరైన కథలే ఒక ప్రత్యేకమైన యాసలో చెప్పబడిన ఈ కథలు ఆచరణీయాలు, ఆదరణీయాలు.

నాయనమ్మ, అమ్మమ్మ, తాతయ్యల నుండి ఏనాటి నుండో ప్రచారంలో ఉన్న కథలను సేకరించి, ఇలా ఒక్క చోట గుదిగుచ్చడం ఎంతో ముచ్చటగా ఉంది. నేటి యువత ఎవ్వరు ఓపికగా పెద్దల దగ్గర కూర్చొని కథలు వినడం లేదు, అందుకే ఆంధ్ర మహిళా సభ తెలుగు శాఖాధిపతి శ్రీమతి అలివేణి గారు చాలా మంచి ప్రాజెక్టును ప్రవేశపెట్టి, విద్యార్థినుల చేత అసైన్మెంట్ రూపంలో, మారుమూల ప్రాంతాలలో మాత్రమే ఉన్న ఈ కథలను వెలికి తీయించి, ఇలా ముద్రించడం ఆమెలోని పనితనానికి, పని చేయించే తీరుకి, ఉత్కంఠతకు, ఆయా కథలు నేటి యువతకు తప్పక తెలియాలన్నా ఆలోచనకు, తపనకు తార్కాణంగా నిలిచింది. ఇది ఒక గొప్పప్రయత్నం. ఈ ప్రయత్నం విజయవంతం కావడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది.

ఈ కథా సంకలనంలో ఒక్కొక్క కథ ఒక్కొక్క మణిపూస. మొట్టమొదటి కథ ఎంతో నీతియుతమైనది. సందేశంతో ప్రారంభించడం శుభ సూచకం. దాదాపు కథలన్నీ నీతితో కూడినవే, విశేషించి సామెతలను చేర్చడం హారంలో రత్నాలు పొదిగినట్లే.

"ఆశపోతునక్క కథ","అత్యాశ అనర్థదాయకం" అన్న గొప్ప విషయాన్ని వివరించింది."పంచుకుందాం" అన్న కథ ప్రేమ, జ్ఞానసంపదతో పాటు అన్నిటిని

నలుగురితో పంచుకోవాలని చెప్తోంది. ఈ కథలలో చమత్కారాన్ని చొప్పించడం చాలా ఆహ్లాదంగా ఉంది."మూడు ప్రశ్నలు" కథ నవ్విస్తూ, కథకు వన్నెతెచ్చి పెట్టింది ."దైవం మానుషరూపేనా" అన్న లోకోక్తిని నిజం చేస్తూ చూపించిన కథ"దేవుడే కాపాడుతాడు". దేవున్ని నమ్ముకుంటే తప్పక ఆ దేవుడే కరుణిస్తాడని చాటిచెప్తోందీకథ. ఈ తరానికి నిజంగా తెలియవలసింది పని విలువ. "ఎద్దుగర్వం" కథలో పని విలువను స్పష్టంగా అర్థమయ్యే రీతిలో చక్కగా చెప్పారు. పనియొక్క విలువతో పాటు ఎప్పటి పని అప్పుడే చేయ్యాలని, లేకపోతే ఆ పని భగ్నమైపోతుందనీ "ఆలస్య అమృతం విషం" కథలో బోధించడం సమంజసంగా ఉంది. కల్ కా కామ్‌ఆజ్ కరో, ఆజ్ కా కామ్ అభీకరో అన్న గొప్ప సిద్ధాంతానికి ఈ కథ ఒక ఉదాహరణగా నిలుస్తుంది. నిరంతరం నిర్లక్ష్యంతో మసలే నేటి యువతకి ఒక కనువిప్పు "అమ్మమాట కథ". పెద్దల మాట– వింటే ఆపదలురావు– అన్న సత్యాన్ని ఈ కథ నిరూపిస్తుంది. జీవిత విలువలతో పాటు చారిత్రక ఆశయాలను మనకందించిన "రుద్రమదేవి కథ" ఇక్కడ చేరడం సముచితం."కోతి డప్పు కథ" నన్నెక్కడికో తీసుకుపోయింది. ఆ పాట అమ్మమ్మల, అమ్మల చిన్నతనం నుండి మన చిన్నతనం దాకా అలరించింది.

ముల్లు పోయి కత్తి వచ్చే డాం డాం డాం
కత్తి పోయి డాలు వచ్చే డాం డాం డాం
పిల్లి పోయి ఎలుక వచ్చే డాం డాం డాం
కాయ పోయి పండు వచ్చే డాం డాం డాం

అంటూ పాడుకొని కాసేపు మురిసిపోయాను. నా చిన్నతనంలోనికి మళ్లీ తొంగి చూసే అవకాశమిచ్చిన ఈ కథాసంకలనం– నలుగురికి ఉపయోగపడుతూ, నేటి యువతరాన్ని, మేల్కొల్పుతోందని ఆశిస్తున్నాను. ఇలాంటి కథలు ఈనాడు చాలా అవసరం. ఇంత చక్కని ఆలోచనాత్మకమైన బృహత్కార్యాన్ని చేపట్టి విజయ సాధనలో మరో అడుగు ముందుకు వేసిన శ్రీమతి అలివేణి గారిని బహుధా ప్రశంసిస్తూ...

*మీ విద్వద్విదేయురాలు*

**డా. పి.లలిత వాణి**

రి (ప్రిన్సిపల్)

చేవెళ్ల గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్.



**డా॥ కె.కరుణాదేవి**
*అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్*
*అకాడమిక్ కోఆర్డినేటర్*
*ఆంధ్ర మహిళాసభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల.*

# అందమైన కథలు

చిన్న చిన్న కథలు ఆకర్షణీయమైన పాత్రలతో పునరావృతం అవుతూ ఎంతో అద్భుతంగా ఉంటాయి. మనసుకు మనోరంజకాన్ని కలిగిస్తాయి. ఏది తప్పు, ఏది సరైనదో అనే తేడాను తెలుపుతూ నైతిక విలువలతో ఆకట్టుకుంటాయి. "తీరొక్క కథలు" అనే పుస్తకం విద్యార్థినుల తాతలు, నానమ్మలు, అమ్మమ్మలు, తల్లిదండ్రులు వివరించిన అందమైన కథల సంకలనం.

ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల విద్యార్థినులు రాసిన ఈ కథలను ప్రతి ఒక్కరు సులభంగా చదివి ఆనందించేలా చేస్తుంది. విద్యార్థినులకు ఈ కథలు చెప్పిన తాతలు, అమ్మమ్మలు తల్లిదండ్రులు కథలు చెప్పమన్నప్పుడు వాళ్లకు వాళ్ల వాళ్ల తాతలు, తల్లిదండ్రులు చెప్పిన కథలను, ఆ రోజులను, ఆ సంతోష సమయాన్ని గుర్తుచేసుకొని ఈ కథలు చెప్పి ఉంటారు. ఇలాంటి ఈ కథల సేకరణ హృదయానికి ఎంతో ఆనందదాయకం. నేను కూడా ఈ కథలను చదివినప్పుడు, నేను చిన్నప్పుడు మా గ్రాండ్ పేరెంట్స్‌తో ఆడుకుంటూ వారితో గడిపే సమయంలో నాకు వారు చెప్పిన కథలను, ఆ అనుభూతిని గుర్తు చేసుకున్నాను. నాకు మా గ్రాండ్ పేరెంట్స్ నైతిక విలువలు, సమానత్వంతో కూడినటువంటి గౌతమ బుద్ధుని కథలు, అంబేద్కర్, జ్యోతిరావు పూలే మరియు సావిత్రిబాయి పూలే పోరాటం, విజయం మరియు సంకల్పం గురించిన కథలు ఎన్నో చెప్పారు. ఇంకా జంతువుల కథలు, పాముల, పక్షుల కథలు, తెలివైన, సాహసోపేతమైన రాజుల కథలు, యోధుల కథలు మొదలైనవి.

ఇలాంటి ఈ కథల సంపుటిని తెలుగు శాఖ ఒక ప్రాజెక్టు వర్క్ గా చేపట్టింది. శ్రీమతి అలివేణి తెలుగు HOD విభాగం .ఇది మార్గదర్శకత్వం. ఇది వినూత్నమైన ఆలోచన, విద్యార్థునులు కూడా ఈ ప్రాజెక్టులో ఆనందంతో పాల్గొన్నారు. పిల్లల మధ్య, వారి గ్రాండ్ పేరెంట్స్ మధ్య ఇంకా బంధం ఏర్పడిందని నేను అనుకుంటున్నాను. అంతే కాదు ఇది గ్రాండ్ పేరెంట్స్ మరియు విద్యార్థునులు సామాజిక, రాజకీయ, ఆర్థిక, భౌగోళిక సమస్యలను అర్థం చేసుకోవడంలో సహాయపడుతుందని నిర్వచిస్తుంది అని నేను భావిస్తున్నాను. ఇలాంటి కార్యకలాపాలు విద్యార్థులకు జీవిత నైతిక విలువలను తెలుసుకోవడానికి సహాయపడతాయి. వారు దేశానికి మంచి పౌరులుగా ఎదగడానికి కావలసిన స్వేచ్ఛ, సమానత్వం, నైతికత వంటి అనేక విషయాలను నేర్చుకుంటారు.

ఒక తరం కోసం గతాన్ని ఆవిష్కరించాలనే శ్రీమతి అలివేణి ఆలోచనను నేను నిజంగా అభినందిస్తున్నాను. తరగతి గదిలో ఈ రకమైన కార్యకలాపాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా చేస్తాయి. భాగస్వామ్యం మరియు సంరక్షణ అనే భావన వారిలో అభివృద్ధి చెందుతుంది. శ్రీమతి అలివేణి ది ఇది రెండో ప్రయత్నం మొదట లాక్ డౌన్ టైంలో విద్యార్థినులను కవిత్వం రాసేలా చేయడం, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను, ప్రతిభను బయటకు తీసుకురావడం. ఇది గొప్ప విజయం శ్రీమతి అలివేణిని మరియు విద్యార్థినుల బృందాన్ని నేను మరోసారి అభినందిస్తున్నాను. ఈ కథల సంకలనాన్ని బయటకు తీసుకొస్తున్నందుకు పాఠకులందరిని కూడా సంతోషపరుస్తుందని అనుకుంటున్నాను.

**డా॥ కె.కరుణాదేవి**
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్
అకాడమిక్ కోఆర్డినేటర్
ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల.



**డా॥ సరిత**
*అసోసియేట్ ప్రొఫెసర్*
*హెడ్ అండ్ డీన్*
*డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్ మెంట్*
*ఆంధ్ర మహిళాసభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల.*

# కథల బుట్ట

"కథలు" అనేవి జీవితంలో ఎంతో ప్రముఖ పాత్ర వహిస్తాయి. కథలు వింటున్నప్పుడు మనసుకు ఎంతో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని, ఆసక్తిని కలిగిస్తాయి. నాడు కాలానుగుణంగా, పరిస్థితులను బట్టి అల్లిన చిన్న చిన్న కథలు మౌఖికంగా ఒక తరం నుండి ఇంకొక తరానికి సాగిపోతూ, జానపద సాహిత్యంలో ప్రధాన పాత్ర పోషించాయి. నానమ్మలు, అమ్మమ్మలు, తాతయ్యలు కథలు చెబుతున్నప్పుడు పక్కనే కూర్చొని ఊ కొడుతూ ఏకాగ్రతతో వింటుంటే ఎంత బాగుండేదో, ఆనాటి నా చిన్నప్పటి రోజులు గుర్తుకొస్తున్నాయి నేడు ఆంధ్ర మహిళసభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని మా ద్వితీయ సంవత్సర విద్యార్థినులు (2022) చేత తెలుగు శాఖ అధ్యక్షురాలు శ్రీమతి ఎం. అలివేణి కథలను సేకరించాలనే ఆలోచన చేసి, ఇప్పటికే ఎన్నో మౌఖిక కథలు అంతమైపోయాయని, ఇప్పటికైనా కొన్ని కథలనైనా సేకరిస్తే తర్వాతి తరం వారికి అందించిన వారమవుతామని, విద్యార్థులకు అసైన్మెంట్లో భాగంగా ప్రాజెక్టు వర్క్ చేయించాలని, పట్టుదలతో విద్యార్థినులకు చెప్పి సేకరించి రాసిన ఈ రకరకాల కథలను ఒక దగ్గర చేర్చి పూల బుట్టగా తెస్తున్న కథా సంకలనమే "తీరొక్క కథలు".

ఈ విధంగా ప్రాజెక్టు మొదలు పెట్టినప్పటి నుండి పని పూర్తి అయ్యేవరకు, ప్రతిరోజు తను ఎంతో సమయాన్ని విద్యార్థినులతో కేటాయించేది, మాతో కూడ ప్రతిరోజు చర్చిస్తూ ఉండేది, ఎంతో తపనతో కృషిచేసి కథలను ఒక పుస్తకంగా తీసుకొస్తున్నందుకు శ్రీమతి ఎం.అలివేణిని మరియు విద్యార్థులను మనస్ఫూర్తిగా అభినందిస్తూ ప్రశంసిస్తున్నాను.

**డా॥ సరిత**
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్
ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ & సైన్స్ మహిళా కళాశాల

**ఎం.అలివేణి**
తెలుగుశాఖ అధ్యక్షులు
ఆంధ్ర మహిళాసభ ఆర్ట్స్ అండ్ సైన్స్
మహిళా కళాశాల.



# మట్టి పరిమళాలు

జానపదుల జీవితాలు మట్టితో, మట్టి వాసనతో విడదీయరాని బంధం కలిగి ఉంటాయి. శ్రామికుల చెమట చుక్కల నుండి పుట్టినవే ఆటలు, పాటలు.

ప్రముఖసినీ గేయ రచయిత "సుద్దాల అశోక్ తేజ గారు రాసినపాట పనితో పుట్టిందని...

టప టప టప టప టప టప
చెమట బొట్టుగా గానాలై పడుతుంటే
కరిగి కండరాల నరాలే స్వరాలు కదుతుంటే
పాట పనితో పాటే పుట్టింది
పని పాటతోనే జత కట్టింది.

చ : ఆగడాల ఆ గడీల దినగండపు ఏలుబడిలో
మెడలు వంచి దొరమీన పదిలంగా మోయువేల
పద పద బిరబిర నడు నడు నడు
పద పద పద పదపదమంటూ
ఆపద మస్తకము శ్రమిస్తూ
ఒహ హోమ్ హోమ్ ఒహ హోయ్
ఒహ హోమ్ హోమ్ ఒహోమ్ హోయ్
ఒహ హోమ్ అనే ఆయాసమే అయినది రా జానపదం.

చ : కరణమింట్లో పెండ్లిపని తలా ఇంత పంచుకొని
పల్లె ఆడవాళ్లు ఒడ్ల దంపులకు దిగిపోతే
ఊపిరితిత్తుల ఒత్తిడి ఒత్తిన ఉష్ ఉష్ ఉష్
సువ్వి సువ్వి సువన్న లాల ఓ సువన్నలార
సువ్వి పాటగా మారి ఉవ్వెత్తున లేచెనచట".

ఇట్లా జానపదులు తమ ఆనందాలను, బాధలను, ఆటలు, పాటలు, కథల రూపంలో వ్యక్తపరుస్తారు. ప్రపంచవ్యాప్తంగా మౌఖిక ప్రచారంలో ఎన్నో పురాణాలు, ఇతిహాసాలు,కథలు, కవిత్వం సామెతలు, పొడుపు కథలు, జానపదుల జీవితాలలో ముఖ్య భూమికను పోషిస్తున్నాయి. ఇవి తరతరాలుగా సంక్రమిస్తూ, ఆచరణలో కొనసాగుతున్నాయి.

జానపదుల జీవితంలో భాగమైన వివిధ కకళారూపాలలో "కథలు" ఎంతో ముఖ్యమైనవి. వివిధ నాగరికతల జీవన పరిణామ క్రమంలో, "కథలు" మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇవి చిన్న చిన్న పదాలతో అందరికీ అర్థమయ్యే విధంగా మౌఖిక రూపంలో ఉంటూ, మనుషుల మధ్య అనుబంధాలను,పెంచుతూ, నైతిక విలువలను ఎత్తి పడుతూ, స్ఫూర్తిదాయకంగా ఉంటాయి."కథా సాహిత్యం" సాహిత్యంలోని వచన శాఖలో ఒక భాగం. ఈ "కథ సాహిత్యము", పిల్లలనుండి పెద్దల వరకు అందరిని అలరిస్తుంది. "కథ"లు మొదటి నుండి చివరి వరకుఆసక్తిని కలిగిస్తాయి. నైతిక విలువలను సందేశంగా అందించే ఈ చిన్న చిన్న మౌఖిక కథల్లో జంతువులు, మనుషులు, పక్షులు, పాత్రలుగాఉంటాయి.

తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో, మౌఖిక కథలను అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలు తల్లిదండ్రులు చిన్నపిల్లలు నిద్రపోవడానికి కథలు చెప్పడం అలవాటు. కాలక్షేపానికి, వ్యక్తుల మధ్య ఆనందాన్ని నెలకొల్పల్పడానికి, సామూహిక చైతన్యాన్ని కలిగించడానికి, ధైర్యాన్ని పెంచడానికి "కథ"లు ఉపయోగపడతాయి. కాబట్టి నాడు ప్రతి ఇంట్లో "కథ"లు చెప్పేవారు.

ఈ కథలు ముఖ్యంగా నీతి, ధర్మం, సాహసం, ఔదార్యం వంటి విషయాలు ప్రధాన వస్తువుగా నడుస్తాయి.

కథలు మానవుల ఆలోచన విధానాన్ని పెంచుతూ, సంతోషాన్ని, హాస్యాన్ని, ధైర్యాన్ని, నీతిని తెలుపుతూ మనసును చలింపచేస్తాయి. నేటి కంప్యూటర్ యుగంలో

“మౌఖిక కథల” ఉనికి తగ్గుతున్న క్రమంలో “ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల” తెలుగు శాఖ అధ్యక్షురాలు ఎం.అలివేణి అయిన నేను, డిగ్రీ ద్వితీయ సంవత్సర విద్యార్థినులచే 2022వ సంవత్సరం సెప్టెంబర్‌లో అసైన్మెంట్ వర్క్‌లో భాగంగా ప్రాజెక్టు వర్క్‌గా కథలు సేకరించమన్నాను. ఒకప్పుడు ఇంట్లో పెద్దవారైన అమ్మమ్మలు, నానమ్మలు కథలు చెప్పేవారు. ఇప్పుడు చెప్పడం లేదు, ఎవరు వినడం లేదు. ఎందుకంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చలనచిత్రాలు, టీవీలు, యూట్యూబ్‌లు, చాటింగ్‌లతో పిల్లలు, వారి తల్లిదండ్రులు, ఎవరికి వారు నిత్యం బిజీగా విడివిడిగా ఉంటూ యాంత్రిక జీవనం గడుపుతున్న నేటి కుటుంబాల తీరు ఇది. ఈ పరిణామాలతో ఇప్పటికే ఎన్నో కథలు కనుమరుగై పోయాయి. కాబట్టి ఇప్పటికైనా మనం మన అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలు దగ్గర నుండి కథలను సేకరించి, వాటిని ఫోన్లలో రికార్డుచేసి, రాసి సబ్మిట్ చేయాలని చెప్పి, ఆ కథలను పుస్తక రూపంలో తీసుకొస్తే వాటిని తర్వాతి తరం వారికి అందజేయవచ్చు అని, తీసుకొచ్చిన కథా సంకలనమే “తీరొక్కకథలు”.

ఈ విధంగా డిగ్రీ సెకండ్ ఇయర్ విద్యార్థినులు దాదాపు 60 కథల వరకు సేకరించి ఆడియో మరియు వీడియోలను నాకు అందించడం జరిగింది. ఇట్లా విద్యార్థినులు వారి వారి ఊర్లలో వాళ్ళ వాళ్ళ అమ్మమ్మలు, వాళ్ళ నాన్నమ్మల, తాతయ్యలు, ఇతర కుటుంబ పెద్దల దగ్గర, గ్రామవృద్ధుల దగ్గర మన తెలుగు జానపదుల మౌఖిక కథలను సేకరించారు. వీటిల్లో ఎన్నో తీరుల కథలు వచ్చాయి కాబట్టి దీనికి “తీరొక్క కథలు” అనే కథా సంకలనంగా తీసుకురావడం జరిగింది. పిల్లలు సేకరించి రాసిన కథలలో ఆర్. జాగృతి రాసిన ‘కోతి దప్పు’ కథ, జడ్.సుష్మా రాసిన ‘మూడు ప్రశ్నల’ కథ, ఎం.దీపిక. రాసిన చాణుక్యుని కథ, గౌతమి. రాసిన ‘ఎత్తుకు పై ఎత్తు’ కథ, పవిత్ర రాసిన నిజాయితీ కథ శ్రావణి. రాసిన ‘అమ్మమ్మ మాట’ కథ ఇలా విద్యార్థినిలు అందరూ సేకరించిన అన్ని కథలు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. ఇలా చెప్పగానే సేకరించి రాసి నాకు అందించిన మా డిగ్రీ ద్వితీయ సంవత్సర విద్యార్థులందరిని మనస్ఫూర్తిగా అభినందిస్తూ ఆశీర్వదిస్తున్నాను.

**ఎం.అలివేణి**

తెలుగుశాఖ అధ్యక్షులు

ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల

# కృతజ్ఞతలు

ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళ కళాశాల, డిగ్రీ ద్వితీయ సంవత్సర విద్యార్థినీల చేత రాయించి తీసుకొచ్చిన "తీరొక్క కథలు" కథాసంకలనానికి ఆర్థిక సహాయాన్ని అందించిన డా. సిహెచ్. భిక్షపతి అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ పొలిటికల్ సైన్స్ (GDC కాలేజ్ శేర్లింగంపల్లి) గారికి ధన్యవాదాలు.

"తీరొక్క కథలు"కథా సంకలనంలో ముందుమాట రాసిన ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య సూర్య ధనుంజయ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

అలాగే ఇంకా ముందుమాట రాసిన డా. పి.లలిత వాణి (రి. ప్రిన్సిపల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్ల) గారికి, ఆంధ్ర మహిళాసభ అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్ డా. కె.కరుణా దేవి గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

నన్ను ప్రోత్సహిస్తూ సలహాలు, సూచనలు అందిస్తున్న ఆంధ్రమహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల చైర్పర్సన్ ఆచార్య ఉషా మునిపల్లె గారికి, కళాశాల కరస్పాండెంట్ సెక్రెటరీ జె.సుధాకరుడు గారికి,

కళాశాల I/c ప్రిన్సిపల్, డా. కె.ఝాన్సీరాణి గారికి,

కళాశాల డైరెక్టర్ ఆచార్య ఏ. నకులా రెడ్డి గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు.

నన్ను ప్రోత్సహిస్తూ ఉండే గురుతుల్యులు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రాజ్యలక్ష్మి గారికి, నాకు తోడుగా నిలుస్తూ, ఇట్లా విద్యార్థులచే కథలు సేకరించి కథా సంకలనం తేవాలనుకుంటున్నాను మేడం అనగానే మంచి చిరునవ్వుతో చాలా మంచి పని చేస్తున్నావని చెప్పిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.కరుణాదేవి గారికి

ప్రత్యేక ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు పని మొదలుపెట్టినప్పటి నుండి నా ప్రతి మాటను ఎంతో ఓపికతో వింటూ, నన్ను ప్రోత్సహించే, అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ పొలిటికల్ సైన్స్. వసుంధర గారికి, అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ కామర్స్ డా.జె.సరిత గారికి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ ఎకనామిక్స్ జి.హిమబిందు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. పత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ఇతర శాఖ అధ్యాపక బృందానికి, మరియు బోధనేతర సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు.

పుస్తక ప్రచురణలో సలహాలు, సూచనలు అందించిన ఏ.వి కళాశాల తెలుగు శాఖ అధ్యాపకులు డా.బి. జ్యోతి గారికి, తెలుగు శాఖ అధ్యక్షులు డా.లక్ష్మీ విజయ గారికి, డా. వై.సత్యనారాయణ గారికి, డా. ఏ.చంద్రయ్య గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

పుస్తకానికి అక్షర దోషాలు చూసిన తమ్ముడు నాగరాజుకి, తమ్ముడు నరేష్‌కి, సోమకీర్తి చందన, భూమిక, కీర్తన, రవళిలకు ధన్యవాదాలు. అలాగే నన్ను ప్రోత్సహించే స్నేహితురాలు భాగ్యకు ధన్యవాదాలు.

పుస్తక ప్రచురణలో ఎంతో సహనంతో అక్షర దోషాలు లేకుండా డిటిపి చేసిన అక్షర గ్రాఫిక్స్ ఉపేందర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

నాకు ప్రతి పనిలో మొదటి నుండి పూర్తి అయ్యేవరకు సహకరించే నా కుమారులు సి.హెచ్. అభిజిత్, సి.హెచ్. సుజయ్‌లకు ఆశీస్సులు.

డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థినిలకు, పాత్రికేయులకు అందరికీ ధన్యవాదాలు.

సంపాదకులు

**ఎం.అలివేణి**

తెలుగు శాఖ అధ్యక్షులు

AMSASCW

*సేకరించిన వారు :* **చీమల భవాని**
క్రమ సంఖ్య :1058-22-467-019
గ్రూప్ : B.Sc (Mscs)

# 1. రాజు-7 చేపలు

అనగనగా ఒక రాజు. ఆ రాజుకి ఏడుగురు కొడుకులు. ఒక రోజు రాజ కుమారులు కోనేరుకి వెళ్ళారు. ఏడుగురు ఏడు చేపలు పట్టారు. ఏడు చేపలను ఎండకు ఎండపెట్టారు. కానీ ఆరుగురి చేపలు ఎండినవి. ఒక రాజకుమారుని చేప మాత్రం ఎండలేదు.

అప్పుడు ఆ రాజకుమారుడు చేప దగ్గరికి వెళ్ళి చేప చేప నువ్వు ఎందుకు ఎండలేదు అని అడుగుతాడు. వెంటనే చేప నాకూ గడ్డి మోపు అడ్డం వచ్చింది. అందుకే ఎండలేదు అని చెప్తుంది. వెంటనే గడ్డి, మోపు దగ్గరకు వెళ్ళి గడ్డి మోపు, గడ్డి మోపు నువ్వు చేపకు అడ్డం ఎందుకు వచ్చావు అని అడుగుతాడు. ఆ గడ్డి మోపు నన్ను ఆవు మేయలేదు అని అంటుంది.

ఆవు దగ్గరికి వెళ్ళి ఆవు ఆవు గడ్డి ఎందుకు మేయలేదు అని అంటాడు. వెంటనే ఆవు నన్ను జీతగాడు  మేపలేదు అని అంటుంది.

జీతగాడు దగ్గరికి వెళ్ళి నువ్వు ఆవుని ఎందుకు  మేపలేదు అని అడుగుతారు. వెంటనే జీతగాడు నాకూ అవ్వ బువ్వ పెట్టలేదు అందుకే మేపలేదు అని చెప్తాడు.

అవ్వ దగ్గరికి వెళ్ళి అవ్వ అవ్వ నువ్వు జీతగాడుకి బువ్వ ఎందుకు వేయలేదు అంటాడు.

అవ్వ పిల్లవాడు ఏడ్చుతున్నాడు అందుకే వేయలేదు అని చెబుతుంది.

పిల్లవాడు దగ్గరికీ వెళ్లి నువ్వు ఎందుకు ఏడ్చావు అని అడుగుతారు. ఆ పిల్లవాడు నన్ను చీమ కుట్టింది అని చెప్తాడు. చీమ దగ్గరికి వెళ్ళ చీమ చీమ నువ్వు పిల్లవాడిని ఎందుకు కుట్టినావు అని అడుగుతాడు. ఆ చీమ నా బంగారు పుట్టలో వేళ్ళు పెట్టితే కుట్టిన అని అన్నది. చీమ పుట్టలో వేలు పెట్టడం వల్ల ఇది అంత జరిగినది కదా!

**నీతి :** ఏ చిన్న జీవికైన హాని చేయకూడదు.

*కథ చెప్పినవారు : అండాలు*
*వయస్సు : 65 సం॥లు*
*చిన్న అంబర్‌పేట్ హైదరాబాద్*

*సేకరించిన వారు:*

**కె శిరీష**

*బిఎస్‌సి (ఎంఎస్‌సిఎస్)*

*ద్వితీయ సంవత్సరం 3rd సెమిస్టర్*

*క్రమ సంఖ్య: 1058-22-467-024*

# ౨. వానపాము

ఇద్దరు ఆలుమగలు ఉన్నారట. వాళ్ళకు ఒక కొడుకు ఒక బిడ్డనట. ఆలుమగలు ఇద్దరూ బాయి కాడికి వెళ్ళిరట. అప్పుడు వాన పడుతుంది, ఆ వానలో పిడుగుపడ్డదట ఆ పిడుగుకి ఆలు మొగలిద్దరూ చనిపోయిరట. అప్పటినుంచి అన్న చెల్లెల్ని చూసుకున్నాడట. వాళ్ళకు తినడానికి కూడా తిండి లేదంట. వాళ్ళ అన్న రోజు కాయ కష్టం చేసి చెల్లెల్ని చూసుకుంటున్నాడట. ఒకరోజు చెల్లెలికి దూప అయ్యింది, అప్పుడే వాన వస్తుందట గ్లాసుల వాన నీళ్ళు పట్టుకుందట. చెల్లెలి నీళ్ళలో పాము పిల్ల ఉందట. చెల్లెలు నీళ్ళు అట్లే తాగిందట. పాము పిల్ల చెల్లెలి కడుపులోకి పోయిందంట. పాము రోజు రోజుకి పెద్దగా అవుతుంది అంట. పాము పెద్దగ అయితున్న కొద్దీ, చెల్లెలి కడుపు కూడా పెద్దగా అవుతుంది. ఎందు గురించో మా చెల్లెలికి కడుపు పెద్దగా అవుతుంది అని ఆ అన్న ఆలోచిస్తుండట. అట్లే ఆలోచించుకుంటా అన్నా రెండు రోజులు నిద్ర పోలేదట. ఆ యింత ఒక రోజు రాత్రి, అన్న నీరు తాగనిక లేచిండట వాళ్ళ చెల్ల కడుపు చూడగానే చిన్నగా ఉందట అన్న ఆశ్చర్యపోయిండంట, అరే మా చెల్లెలు కడుపు ఏంది ఇంత చిన్నగా అయింది అని ఆలోచిస్తుండట. అంతలోనే ఆ పాము మళ్ళ బయట నుండి కడుపులోకి పోతుందట. అది వాళ్ళ అన్న చూసి నోరు ఎల్ల పెట్టిండట. మరుసటి రోజు రాత్రి కాగానే, దూలం పైకి ఎక్కి కూర్చున్నాడట. చెల్లెలి నోట్లో నుండి పాము బయటికి వచ్చిందట, బయటికి రాగానే కత్తితో అన్న మధ్యలకి పామును నరికిండట పాము సచ్చిందట. అప్పటినుండి అన్న చెల్లెలు ఇద్దరు సంతోషంగా ఉన్నారట.

**నీతి:**

ఈ కథలో అన్న లేకుంటే చెల్లెలు ఆగమయ్యేది. వాళ్ళ తల్లిదండ్రులు వాళ్ళ చిన్నప్పుడే చనిపోయారు. అన్నా చెల్లెల్ని కాయ కష్టం చేసి గాబురంగా పెంచాడు.

అన్నా చెల్లెల అనుబంధం కూడా మనం ఈ కథ నుండి నేర్చుకోవచ్చు. అందరూ ఇలాగే ఉండాలని ఈ కథలోని నీతి.

**ముగింపు:**

ఈ కథల సేకరణ వల్ల మనం అప్పట్లో ఉన్న కథలు అంతరించిపోకుండా వెతికి తీయడం చేస్తున్నాం. ఇప్పట్లో పిల్లలు అందరూ ఫోన్లకి అలవాటు పడినారు అమ్మమ్మ నాన్నమ్మ వాళ్ళ దగ్గర కథలు వినడం మర్చిపోతున్నారు. మా అమ్మమ్మని కథ చెప్పమని అడగగానే ఎంతో సంతోషంగా చెప్పింది.

*కథచెప్పిన వారి పేరు : సుగుణ*

*వయసు : 60 సం॥*

*సేకరించిన వారు :*

***హరిత***

బీఎస్సీ (ఎంఎస్‌సిఎస్)

# 3. అంబలి తెచ్చిన తిప్పలు

అమ్మమ్మ ఎండాకాలం వచ్చిందని అన్నం తినబుద్ధి కాక అంబలి కాసుకుందమని జొన్నలు ఎండవోసుకుంది. ఎండవోసుకొన్న తర్వాత ఆ జొన్నలు ఒళ్లారుతుంటే ఒక చెట్టు మీద ఊరవిస్కలు చూస్తున్నాయి ఇగ కిస్కిస్ మని అరుస్తున్నవి పిట్టలు జొన్నల చూసి జొన్నలు మీద వాలి జొన్నలన్ని బుక్కుతునే ఉన్నాయ్ ఆ పిట్టలే బుక్కుతున్నయ్ నేను కూడా బుక్కుతనని ఒక పిల్లల కోడి గూడ జొన్నలు బుక్కుతుంది తోడుకుంటూ పిల్లలు కోడి జొన్నలు బుక్కే వరకల్ల పిల్లల కోడిని గోడ మీద ఉన్న పిల్లి చూసింది. ఊరవిస్కలు, కోడిపిల్ల బుక్కుతున్నవి నేను చిన్న కోడి పిల్లను తింట అని, ఈ పిల్లి ఎంతో ఆశపడి చిన్న పిల్లల మీద దుంకింది. పిల్లలు అన్ని పిల్లి అరిచే సరికల్ల కోడి పిల్లల్ని కావుర్ కావుర్ మని మొత్తుకుంటున్నాయి. ఇగ ఒక మూలకు ఓ కుక్క పడుకున్నది. ఆకిట్ల పడుకున్న కుక్క నేను పిల్లిని పడ్త పిల్లిని పట్టకపోవడం ఎంది పిల్లిని పడ్తానని కుక్క ఉరికొచ్చింది కుక్క పిల్లని పడ్త అని అనుకుంది పిల్లి కుక్కకు భయ పడి చెట్టెక్కింది పిల్లి చెట్టు ఎక్కిన తర్వాత కుక్క చెట్టు చుట్టూ తిరుగుతుంది. ఇంకా పిల్లి ఎప్పుడు దిగుతది నేను ఎప్పుడూ పట్టాలే అనుకుంది. ఆ పిల్లి పాపం చెట్టెక్కి మ్యావ్ అంటుంది. ఇగ ఆకిలంత చిల్లం పల్లం అయ్యింది అప్పుడు పిల్లలన్ని కావుర్ కావూరుమని మొత్తుకుంటున్నాయి. చిన్న కోడి పిల్లలు ఆ కోడి పిల్లల సప్పుడుకు అమ్మమ్మా ఇంట్ల నీళ్లుతాగి వస్త అని పోయింది వచ్చే వరకు వాకిట్ల చిన్న కోడి పిల్లలు కావూరుకావూరు మని మొత్తుకుంటు ఉన్నాయి. ఇగ ఎందుకంత అకిలంత అంగడంగడి అయిపాయే ఇగ అమ్మమ్మ బాధ పడుకుంటూ అటు ఊ కలిపి ఊరవిస్కలను తిడుతుంది అవిట్లని తిట్టుకుంటూ బాధపడుకుంటూ మల్ల జొన్నలు అన్ని కుప్పజేసింది ఎత్తుకొని ఇంట్ల పోయిన తర్వాత ఊరవిస్కలేమో మల్ల దూరం ఎల్లిపోయింది ఇగ కుక్కేమో మళ్ళా దూర ఎళ్ళి పోయింది ఇగ పిల్లలు మల్ల ఇంటికి వచ్చి పడుకున్నవి.

*కథ చెప్పినవారు : పోచమ్మ (65 సం॥)*

*బోధన్, నిజామాబాద్ జిల్లా*

సేకరించిన వారు : **రవళి**
1058-22-445-028
బీఎస్సీ (Bzc) 2వ సంవత్సరం

# 4. మోసం

ఇద్దరు కుమ్మరోల్లు ఉండ్రి అంటా, తల్లి దండ్రులు, ఒక కొడుకు, ఒక బిడ్డ పుట్టగానే సచ్చిపోనరంట సచ్చిపోతే తమ్మల్లపెద్దమ్మకు పిల్లలు లేకుండా ఉండేనట. ఈ ఇద్దరు పిల్లలని మంచిగా సాదుకునేనంట, సాదుకున్న బిడ్డ కానని రాజ్యం ఇచ్చేనంట, ఇచ్చినంకా ఇగ ఈయప్ప పెండ్లాయనంట, ఎట్లజేతు తల్లి లేకపాయే తండ్రి లేకపాయే అని పిల్లను ఈ యప్పకు పెండ్లి జేసేనంట జెస్సినంక ఏమాయేనట. చెల్లెల్ని ఇచ్చిన నాడే అన్న మొఖం చూసిందంట చెల్లెలు. చెల్లెలు మొఖం అన్న చూసిండంట. అన్న దగ్గరకు చెల్లెలు రాకపాయేనంట చెల్లెలు దగ్గరకు అన్నరాకపాయేనంట ఇగ అట్లనే ఏడు మంది కొడుకులు అయిరంట ఆయమ్మకు ఇల్లు లేకపాయినంట ఇగ ఆరు మంది పెండ్లిల్లు చేసిందంట చేసినంకా ఒకనాడు ఆమే మొగడు ఏమనుకున్నరంటా ఓయీ మీ అన్న ఒక్కనాడన్న రాకపాయే, పొకపాయే మల్లా ఎట్లజేతం మల్ల మీ అన్నకు ఇల్లుగిట్ల ఉందన్నాడు.

నువ్వు పోయి రమ్మంటే నేను పోయి వస్త అనింది. మీ అన్నకు ఒక బిడ్డ ఉంటే సాలు మన కొడుకుకు జేసుకుంటుంటే రానికన్న పోనికన్న ఉంటది అన్నాడంట సరే అని ఆమె అన్న దగ్గరకు పోయిందంట. ఆ యప్పకు ఒకటే బిడ్డనంటా అది కూడా వరాన్నపుట్టేనంట. ఇగ ఏడు అంత్రలామలే మీద వెట్టేనంటా, ఇగ చెల్లెలు వచ్చేనంటా. అన్న అవుసుల పని చేస్తుండట, వదిన ఇల్లుడస్తుందంట. వదిన చెంబుల నీళ్ళు తెచ్చి ఇచ్చేనంటా కాల్లుకాడుకునేనంట ఏం చెల్లె నీకు కొడుకులు ఎంత మంది అని అడిగాడు. అంటే నాకు ఏడు మంది కొడుకులు ఇల్లు లేదు ఏం లేదు ఆరు మంది పెండ్లిల్లు జేసిన ఒక కొడుకు ఉన్నాడు. అనెనంటా అన్నంక ఇగ మా చెల్లెలు లేకలేక వచ్చింది తోడం శంగున లే పొద్దుగాల పోలెలు చేతువు అనేనటా శాంగులు జేసేనంటా రారా చెల్లె ఇద్దరం ఒకతాన కూసోని తిందం అనెనంట. నేను అడిగింది ఇస్తే తింట లేకుంటే నేను పోత అన్నది ఏమాడుగుతవ్ అడుగు మల్లా నివ్ ఒకదనవు ఉన్నావు నా బిడ్డ ఒకతి ఉంది నువ్వు ఏం అడిగితే అది ఇస్తా అన్నాడు అన్న ఏం లేదు నా కొడుకుకు నీ బిడ్డను ఇచ్చినట్లు ఐతే నేను తింటా లేకుంటే నేను పోతా అంది. అట్లెందుకు అంటావమ్మా ఇస్తా తిను అన్నాడు అన్న. ఇస్తగాని నా బిడ్డ ఏడు అంత్రాల మలే మీద ఊయలేసి నీ ఆరు మంది కోడళ్ళు ఊపాలే అట్లయితెనే ఇస్తా లేకుంటే ఇయ్యను అన్నాడు. అన్న సరే మంచిది అన్నది. అట్లే మల్ల మాట ఇచ్చినట్టే అప్పుడు లేసి అన్నొద్ద కుసొని తినేనంటా

మల్లా పొద్దుగాల లేసి పోలేలు జేసిండంటా, అన్న చెల్లెలు తిన్నరంటా, అన్న అన్న నన్ను కానని రాజ్యం ఇచ్చింద్రు, అన్న నాకు బట్టలు తెస్తే ఏసుకొని పోత అన్నదంటా. నీ ఇష్టం చెల్ల అన్నాడు అన్న. చీరలు తెచ్చేనంటా రవికలు తెచ్చెనంటా ఇగ సక్క ఏసేనంటా నెల లోపల పెండ్లి జేతం అన్న అన్నది అంటా నీ ఇష్టం చెల్ల ఎప్పుడొస్తే అప్పుడు జేసిస్త అన్నాడు అంటా అన్న సరే మంచిది అనిఒప్పుకొని పోయేనంటా కొడుకులు మొగనికి అంతా జెప్పినంటా, పిండి బియ్యము అన్ని తయారీ జేసుకొని ఇగ ఈడికే వచ్చిరంటా పిలగని తీసుకొని వచ్చి ఇగ ఇన్నే పెండ్లి చేసిరంటా, పోయిరంటా పోయినంక నా బిడ్డ పోతుందని తల్లి దండ్రి అక్కడికి పోయిరంట ఇచ్చింది ఒకటే గుర్తుందంటా ఆడికి పోయినంకా ఏడు అంత్రల మలే మీద ఉయ్యాల ఎసి ఆరు మంది కోడళ్ళు ఊపుతున్నరంటా ఇగ ఇట్లనే మూడునెల్లు, ఆరునెల్లు అయినంకా ఎవరు ఉకుంటరు యారండ్లంత మాట్లాడుకొని మల ఈ పొద్దు అన్న బిడ్డ అని ఊకే వచ్చింద ఆకు కర్చు లేకున్నా పొకకర్చు ఇయ్యలేదు. మనకు రూపాలు ఇచ్చిన గానీ ఆకు పోక ఐతే కర్చు అయ్యింది కద అట్లెట్ల అయ్తదు మన సరిత పని జేస్తే సరే లేకుంటే లేదు అని అత్తతో అనేసరికి మీరెందు అట్లంతరు అమ్మ సరె కాని అని మోకాళ్ళ కాడికి బట్టలు ఇచ్చెనంటా, కోడలు పిడకలు కొట్టాలె, తెల్లారేసరికి ఏడుకొట్టాల పెండ తీయాలే, ఏడునూర్ల ఏకులొడకాలే, నరుని కంట్ల పడరాదు అని చెప్పింది అత్త సరే మంచిది అని మరుదినం నాడు చెక్కలు చేస్తే ఆమె తినలేదంటా దేవుణ్ణి తలుచుకుంటూ తింటున్నది ఉంటున్నది. ఒకనాడు అత్త చూసిందంట, నెత్తి అట్లా కట్టిందంటా ఇంట్ల పోయి పడుకో అనొచ్చు కదా ఊరబాయికి పోయి పెయికడుకొని రా అన్నది అంటా మల్ల బట్టలు ఇచ్చి తిల్లిచ్చిందంటా ఆమె ఊరబాయిలకు పొయ్యి నెత్తి వీరబోసుకొని జాడిస్కుంటా జాడిస్కుంటా వచ్చిందంట, వచ్చేటప్పుడు ఒక పటెలు చూసిందంట ఆ ఎంటికలు జాడించగా ఒక ఎంటిక కింద పడిందంటా ఈ ఎంటికలే ఇంత సింగారంగా ఉంటే ఆమె ఇంకెంత బాగుంటది అనుకొని ఆ ఎంటికెలను తీసుకొని వేలుకు సుట్టుకునేనంట. ఇంటికి వచ్చే నంట డప్పు సాటిచ్చేనంటా ఈ ఎంటికెలంటి ఆమె ఎవరు తెస్తే వాళ్లకు సగం భూమి ఇస్తానని అన్నాడు. ఐతె ఒకామె రాజా రాజా నేను తెస్త అనెనంట. ఇగ జల్లెడ మల్లె పువ్వుల దెంపిందంటా. తెచ్చి ఊరు మందికి అందరికీ ఒక పువ్వ పెట్టాలంటూ ఒక ఎంటిక గుంజుకోవలంట తెచ్చిన ఎంటికెలు ఒక్క మూలకు పోసెనంట. ఎంటిక యాడవెట్టలే ఏం జేతు పటేల అందరివీ తెచ్చిన కుమ్మరి నాగమ్మ కొడన్లవితెలే అడికిపోయి తేస్తా అనిందంటా పోయి ఆరు మంది కొడన్లవి ఎంటీకలు తెస్తే ఒక్క మూలకు సరిపోతయంట, మల్లొచ్చి పువ్వు తీసుకొని నాగమ్మ మీ అన్న బిడ్డను చేస్కున్నవంట మల ఆయమ్మ యాడుంది నేను వచ్చినప్పటి నుండి సూడనేలేదు చూస్తా అన్నదంటా ఐతే ఆ పిల్ల పిడకల కుచ్చలకెల్లి బయటకు వచ్చెనంటా అప్పుడు ఒక పువ్వు నెత్తి వెట్టి ఒక ఎంటిక తెచ్చేనంట ఆ అప్పుడు ఆ ఎంటిక ఈ ఎంటీకా సమానం అయేనంటా, మల్ల అట్లేతే వస్తదో అడుగు గట్టిగా అడిగి రా అన్నాడు పటేలు అప్పుడు నాగమ్మ

బాగున్నారా అందరూ నీ కోడండ్లు అని వోగలు జేసుకుంటుపోయింది. మల్ల గిట్ల పటేలు అడుగుతుండు నువ్వు ఎట్లైతే వస్తవు అని అడుగుతుంది అంటే సుదమ్మకు అందరూ ఉన్నారు. ఏడు కొట్టాల పెండ తీయలే, ఏకులు వడికే నరుని కంట్లా పడేదేలేదు అంట. అతనికి ఉంటే నా పిడుకల కుచ్చుకు, అతని ఇంటికి మేడ కట్టమను అప్పుడు వస్త అన్నది అంటా అట్లనే పటేలు మేడ కట్టిచ్చేనంటా అట్లనే పోవలే. అంత నువు ఎట్లంటే అట్ల. నీకు చీరలు నగలు అరు సవరాల సొమ్ములు పెడుత అన్నాడు అంటా, పటేలు వాల్లప్ప నా యారాన్లు నా బావ నా మొగడు ఉకుంటరా నేను వల్ల అన్నది. దినం జరగవట్టేనంట పటేలు నాకు ఏం బెకులేదు ఏడు మంది అవుసులోల్లని పిలిపించి ఏడు కుంపట్లు పెట్టి ఎంటికకు ఏడు పూవులు అల్లిపియ్యాలే అని అన్నది. సరే అని కమలం, పూవులు అల్లిపిచ్చినందుకు పూలు మొగని కండ్లవడ్డది. అప్పుడు ఆ ఆయన ఆ పువ్వును తీస్కొనికి శాల ఏసుకొని ఇంటికి పోయి వదిన మీరు అన్నలు అందరూ కలిసి ఉంటున్నారు మరి నా పెండ్లాం ఏది అని అడిగితే అప్పుడు ఆ ఆరు మంది కోడళ్ళు ఆమెకి స్నానం చేపిచ్చి కొత్త చీరను కట్టి తోలిస్తరు అప్పుడు ఆకు, సున్నం, కాసు తీస్కొనిపోవాలె, ఆమె ఏం చేసింది ఆకు పైన కాసు, ఏసింది కానీ సున్నం వేయలేదు, ఐతే కమలం రాజులను కమలం పూవులు అడగనికే వస్తది కానీ మొగన్ని సున్నం అడగనీకే రాకపాయెనని, మంచం కోడుకు ఉరివెట్టి సంపెనంటా. బొంద వెట్టేనంటా. 23 రోజులు అయ్యింది. ఆమే మొగులమ్మ ఈమె ఇంకా వస్తలేదు కనుక్కో అంటే ఆమె వాళ్ల ఇంటికి వెళ్లి పోకుంటా ఇంకెక్కడ ఉంది సచ్చిపోంది అని జెప్పిరంట, అట్లాగే పటేలుకు జెప్తే బొంద దగ్గర పోయి ఏడుస్తుందంట అప్పుడు పైన పార్వతీపరమేశ్వరులు పోతున్నరంట అప్పుడు పార్వతి, శివుడి నీ ఏమయిందో కనుక్కోమని చెప్పిందంతా ఐతే అతను తన పెండ్లాం సచ్చిపోయింది అని చెప్పింరంట సరే అని మంత్రం వేసి నీ వెనకాల మళ్ళీ సూడు అన్నాడంటా శివుడు. అప్పుడు చూస్తే పడుకున్నమే లేచి నిలబడిందని సరే అని నాతో వస్తావా, మీ ఇంటికి పోతావా అని అడిగితే నీతో వస్త అన్నది అంటా, సరే అని తీస్కొని పోయి అందరికీ భోజనం పెట్టిరంట అప్పుడు ఊరు మంది వచ్చి తిన్నారు. మళ్ళీ పటేలు వాళ్ళను తోల్కరమ్మని మొగులమ్మను పంపాడు. ఆమె వెళ్లి చెప్తే అందరూ వచ్చారు. చిన్నోడు రాలేదు ఐనా మళ్ళీ పంపించాడు. అప్పుడు వేళ్ళు నయన ఈ పటెన్ల పని వాళ్ళు ఏమి అనుకుంటే అది చేస్తారు అని నచ్చజెప్పి పంపింది అప్పుడు తన పెండ్లాం పటేలు ఇద్దరు వస్తున్నది చూసి అప్పుడు అందరూ ఇగ తిన కుండ లేసేనంటా. ఇంటికి వచ్చి ఉరి పోసుకొని సచ్చేనంట ఇగ ఈయమ్మ ఈడనే పెండ్లి చేసుకొని ఉన్నదంటా.

**నీతి :**

ఈ కలియుగంలో అధర్మం ఎక్కువగా నడుస్తుంది ఎవరైనా కానీ నమ్మిన వారిని మోసం చేయకూడదు.

*సేకరించినవారు :*

**జి.వైష్ణవి**

రూల్ నెంబర్: 17

బిబిఏ సెకండియర్, 3వ సెమిస్టర్

# 5. రాజు గారి కోతి

అనగనగా ఒకరాజు గారు ఉండేవారు. ఆ రాజుగారికి ఒక పెంపుడు కోతి ఉండేది. రాజు చాలా మూర్ఖుడు కాని రాజు గారికి కోతి అంటే చాలా ఇష్టం. ఆ కోతికి రాజు గారి గదులలోకి కూడా వచ్చిపోయే స్వేచ్ఛ ఉండేది.

ఒకరోజు రాజుగారు నిద్రపోతుంటే కోతి కాపలా కాస్తోంది. ఇంతలో రాజుగారి భుజం మీద ఒక ఈగ వాలింది.

కోతి ఈగని తోలడానికి ప్రయత్నం చేసింది. కాని ఎన్ని సార్లు తోలితే అన్ని సార్లు ఈగ కొంచం సేపు ఎగిరిపోయి మళ్ళీ వచ్చి రాజుగారు మీద వాలుతోంది.

రాజుగారికి నిద్రాభంగం అవ్వ కుండా ఉండాలంటే ఎలా? కోతికి ఒక ఐడియా వచ్చింది.

ఒక కత్తిని తీసుకుని వచ్చి రాజుగారి దగ్గర కూర్చుంది. మళ్ళీ ఈగ రాజు గారికి ముక్కు మీదవాలగానే కత్తితో దాడిచేసింది. ఈగ ఎగిరిపోయింది కాని రాజు గారికి ముక్కు బాగా గాయాలు తగిలాయి.

నీతి: మూర్ఖులతో చనువు మంచిది కాదని పెద్దలు చెప్తారు.

*కథ చెప్పినవారు : హేమలత*

*వయస్సు: 45 సం॥లు*

*హైదరాబాద్*

*సేకరించినవారు :*

**కె. సింధూజ**
బి. ఎస్సి (ఎమ్ఎస్సిఎస్)
ద్వితీయ సంవత్సరం, 3వ సెమిస్టర్
క్రమసంఖ్య : 1058-22-467-022

# 6. ఇద్దరు అక్కచెల్లెలు

ఇద్దరు అక్కచెల్లెలు ఉన్నరంట. అక్కని కోటీశ్వరుని ఇంటికి ఇచ్చిరంట చెల్లెలిని పేదింటికి ఇచ్చిరంట. చెల్లెలు కట్టెలు అమ్ముకొని ముగ్గురు పిల్లలతో బతుకుతుందంట. అక్క ఆమె కొడుకు పెళ్లికి చెల్లిని తోలుకొచ్చి బాసండ్లు కడగనింకే కసువు నూకనింకె పెట్టిందట. తిననింకి కూడ పెట్టలేదంట. పెళ్లికొచ్చిన అందరికీ తిననింకి పెట్టిందంట కానీ చెల్లెలిని తిను అని కూడా అనలేదంట. చెల్లెలు బోగన్లు కడిగేటప్పడు మాడుచిప్పలు తిని, కొడుకుల కోసం తట్టుబొంత తీసుకొని ఆ తట్టులో మాడుచిప్పలను అన్ని కట్టుకొనేనంట. అక్క నాకు నా పిల్లలకు బట్టలు తెస్తదో, ఏమి తెస్తదో అని ఆశపడుతుంది కానీ ఏమి తేకపాయే అనుకొని, మాడుచిప్పల బొంతను గాటిల పెట్టుకుంటే, అక్క చూసి పిడకలు వేసి కట్టిందంట. చెల్లెలు అదేబొంత భుజంకి వేసుకొని ఓ కంట ఏడ్సుకుంట అడవిలకి పోయిందంట. పెద్దమ్మ బట్టలు తెస్తదో ఏమి తెస్తదో పెళ్లికి పోతే అని నా పిల్లలకు చెప్పి వచ్చిన ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని పోవాలి నా పిల్లల దగ్గరికి అని ఏడుసుకొంటూ అడవికి పోయెనంట. అడవిలో పెద్ద పుట్ట కనపడేనంట, ఆ పుట్ట కాడ పోయి దేవ శోకం పెట్టి ఏడ్చినంట. పుట్టల ఉన్న నాగ శేషునికి రాస పుండు పుట్టిందంట, ఆ యమ్మ కన్నీరు పడగ తడవగ నాగ శేషునికి సల్లగా అయ్యేనంట. చల్లగా అయ్యి పుండు కరిగి మంచిగా అయ్యిందంట. ఆ అమ్మ పుట్టల చెయ్యి పెడితే నాగశేషుడు సరసర వచ్చి మీదకు ఎక్కి, ఏమమ్మా ఎందుకు ఏడుస్తున్నావు నా బాధ నీవు తీర్చినవు, నీ బాధ నేను తీరుస్తా చెప్పు అని అన్నాడంట. నా బాధ నువ్వేం తీరుస్తావు, నన్ను కాటేయి నేను సచ్చిపోత అని చెప్పి అక్క ఆమెకు చేసిందంతా చెప్పెనంట. నాగశేషుడు ఏడవకమ్మ నువ్వు ఆ పిడకలు గుమ్మరియి, నీ కుల్లల నేను ముదురుకొని పడుకుంటా, ఇంటికొయ్యి కుమ్మ రోంతాడ

కొత్తకుండ తెచ్చి ఇల్లు నాలుగు మూలల అలుకు చేయి ఆ కుండల నన్ను పెట్టి రెండు ఊదు బత్తులు తెచ్చి నాకు పూజ చేసి మొక్కు నేను బంగారు గని అయితా. ఆ బంగారాన్ని ఇంతింత అమ్ముకొని పెద్దగా నువ్వు కూడా మంచిగా అయితవు అని చెప్పిండు. ఆమె కూడా ఇంటికి పోయి అట్లే చేసింది, చేస్తే కుండ నిండా బంగారు గనిలు మస్తు అయినయంట. ఊల్ల వాళ్ళు లక్ష్మమ్మ కట్టెలు అమ్ముకుంటా ఉండే, కానీ ఇప్పుడు రోజు కోమటోల్ల దుకాణానికి పోయి కొనుకునవట్టే, పిల్లలకు బట్టలు కూడా తెచ్చే, సొమ్ములు కూడా చేపించుకునే, ఇల్లు కట్టుకునే, మంచి గాయే లక్ష్మమ్మ. ఎక్కడ నుంచి తెచ్చుకునే అప్పు సత్తెమ్మ అక్క కొడుకు పెళ్ళికి అంట పాయే మంచిగా ఆయె అని అనుకున వట్టిరి అందరూ. అనుకున్నంగా ఆ ముచ్చట అక్క చెవిలో పడే అప్పుడు అక్క ఆ ముచ్చట విని ఆగ బేగా చెల్లెలి దగ్గరకు వచ్చేనంట, చెల్లి నువ్వుమాడు చిప్పలు కట్టుకుంటే గుమ్మరించు కుంటి నీ పిల్లలకు బట్టలు కూడా తీసుకురాలే నీకు కూడా ఏమి పెట్టలె, మల నువ్వు ఎట్లా ఎదిగితివి చెప్పు చెల్లె అని అక్క చెల్లెలితో అన్నదంట. ఎట్లనో దేవుడు మేలిమి చేసిండు పెద్దగైన అని చెల్లెలు అక్కతో అన్నదంట. దేవుడు నీకు అట్లా బుద్ధి పుట్టించిండు చేసినవు కానీ నాకు అయితే మంచిగా అయింది, అని అన్నది చెల్లెలు. కాదు చెప్పాలంటే చెప్పాలి అని అక్క అడిగితే, చెల్లెలు ఇట్లు చెప్పింది."నువ్వు అట్లా చేసేటికల్లా నేను అడవిలోకి పోయి పుట్ట గడ్డ మీద పడి ఏడ్చి చెయ్యి పెడితే నాగశేషుడు వచ్చి ఇవన్నీ చెప్పిండు, నేను అట్లే చేసినా మంచిగా అయినా అని అన్నది." ఇగ అక్క ఆగబేగ ఉరుకుకుంట పుట్ట కాడికి పోయి ఏడ్చి పుట్టలా చేయి పెడితే నాగ శేషుడు వచ్చి కాటేసిండు అక్క పుట్టగడ్డకాన్నే చనిపోయింది.

**నీతి:**

ఈ కథలో అక్క పెద్ద ఆశ పూరితమైనది ఉంటది మరియు చెల్లెలు మీద కొంచెం కూడ ప్రేమ ఉండదు. అసలు ఆమె అక్క లాగానే ఉండదు. చెల్లెలిని హీనంగా చూస్తుంది. ఎంతో కష్టపడుతుంది. చెల్లెలు మంచి మనసు ఉన్నది. ఆమె తన స్వచ్ఛమైన మనసుతో మంచిగా ధనవంతురాలు అయితది. ఆ విషయం అక్కకు తెలుస్తది. ఆమెకు ఎంత ఆస్తి ఉన్నా కూడా ఆశతో చెల్లెలు దగ్గరికి వచ్చి, చెల్లెలా నేను నిన్ను ఎంతో కష్టపెట్టిన నీకు తిండి కూడా పెట్టలే, అయినా కూడా ఎట్లా పెద్దగా అయినావు అని అడిగి తన ఆశ పూరితమైన బుద్ధిని చాటింది. చివరకు చనిపోయింది. మనం కూడా మన తోబుట్టువులతో ప్రేమగా ఉండాలి, వారికి కష్టం వచ్చినప్పుడు సహాయం

చేయాలి. అలాగే అత్యాశతో ఉండకూడదు, మనకున్న దాంట్లోనే సంతోషాన్ని చూసుకోవాలి.

**ముగింపు :**

ఈ కథల సేకరణ వల్ల మనం అప్పట్లో ఉన్నా కథలు అంతరించి పోకుండా వెలికి తీయడం చేస్తున్నాం.

ఇప్పట్లో పిల్లలు అందరూ ఫోన్లకి అలవాటుపడి నానమ్మ, అమ్మమ్మ దగ్గర కథలు వినడం మర్చిపోతున్నారు. మా నానమ్మని కథా చెప్పమని అడగగానే ఎంతో సంతోషించింది.

*కథ చెప్పినవారు : లక్ష్మమ్మ*
*వయస్సు: 55 సం॥లు*
*ఉడిమేశ్వరం*
*కొడంగల్, వికారాబాద్*

సేకరించినవారు :
**ఎం.శ్రీ లక్ష్మి గాయత్రి**
BBA 2ND YEAR
ROLL. : 1058-22-684-009

# 7. పిసినారి

అనగనగా ఒక ఊరిలో ఒక పెద్దాయన ఉండేవారు. ఆయిన చాలా లోభి. అంటే యెంత పీనాసితనం అంటే ఒక్క పైసా కూడా చేతిలోంచి జారనిచ్చే వాడు కాదు. ఇంట్లో కుటుంబ సభ్యులను కూడా ఖర్చు పెట్టనిచ్చేవాడు కాదు. పైసా పైసా కూడ పెట్టి, ధనమంతా పోగు చేసుకుని కొన్ని బంగారు నాణాలు కొనుక్కున్నాడు. అవి లెక్కపెట్టుకోవడం ఒక సరదా.

ఆ నాణాలన్నీ ఒక సంచిలో వేసి, ఇంటి వెనుక ఒక చెట్టు కింద గొయ్యి తీసి, ఆ సంచి అందులో కప్పెట్టాడు.

అప్పుడప్పుడు గొయ్యి తీసి, సంచి చూసుకుని, నాణాలు లెక్క పెట్టుకుని, మళ్ళీ కప్పెట్టేస్తూ ఉండేవాడు. ఎప్పుడైనా కొంత డబ్బు పోగైతే ఇంకో నాణం కొని నిధిలో కలుపుతూ ఉండేవాడు.

ఇలా కొంత కాలం బాగానే గడిచింది. కాని ఒక రోజు ఇలాగే సంచి తీసి నాణాలు లెక్క పెట్టుకుంటుంటే ఒక దొంగ చూసాడు. ఇంకేముంది? రాత్రికి రాత్రి వచ్చి, గొయ్యి తీసి, సంచి దోచేసాడు.

ఒకనాడు పెద్దాయన అలవాటు ప్రకారం సంచీ కోసం తవ్వితే అది అక్కడ లేదు!

భోరు భోరు మని ఎడిచాడు. కానీ ఇప్పుడు నెత్తీ నోరు బాదుకుని ఏమి లాభం. పోయిన ధనం తిరిగి రాదు కదా?

ఆశాభంగమైన పెద్దాయన ఊరిలో ఒక స్వామీజీ దగ్గరికి వెళ్ళి ఇలా జరిగినది అని చెప్పాడు. నిధి మళ్ళీ దక్కే మార్గం అడిగాడు.

స్వామీజీ, “బంగారం తీసుకెళ్ళి గోతిలో ఎందుకు పెట్టుకున్నావు? ఇంట్లో పెట్టుకుంటే అవసరానికి ఖర్చు పెట్టుకునే వాడివి కదా?” అని అడిగారు.

"ఖర్చు పెట్టడమా! నేను జన్మలో ఆ డబ్బు ఖర్చు పెట్టను! అందులోంచి ఒక్క నాణం కూడా వాడే ప్రసక్తి లేదు!" అని పెద్దాయన ఉన్నదున్నట్టు చెప్పేసాడు.

అప్పుడు స్వామీజీ నవ్వి, "ఒక సంచిలో కొన్ని రాళ్ళు వేసుకుని కప్పెట్టుకో, నీకు బంగారు నాణాలన్నా, రాళ్ళన్నా తేడా ఏముంది? లెక్క పెట్టుకోవడానికి తప్ప దేనికి వాడవు కదా. వాడని వస్తువు అవసరం మనకి వుండదు. ఇంకది పోయిందని బాధెందుకు?" అని సలహా ఇచ్చి పంపించేసారు.

**ముగింపు:**

ఈ విధంగా మా మమ్మీ నాకు కథ చెప్పింది. ఈ విధంగా కథ వినడం నాకు చాలా నచ్చింది, నాకు ఎంతో సంతోషమైయింది. ఈ కథలో నీతినీ నేను నా జీవితంలో ఉపయోగిస్తాను అని నేను మా మమ్మీకి చెప్పాను అయితే మా మమ్మీ సరే అని చెప్పింది. ఈ విధంగా నేను నా అసైన్మెంట్ పూర్తి చేసాను.

*కథ చెప్పినవారు : ఎం. శాంత కుమారి*
*వయస్సు : 45 సం॥లు*
*మహబూబ్‌నగర్*

సేకరించినవారు :
**ఎం. స్వాతీ**
B.B.A
క్రమ సంఖ్య:1058-22-684-051

# 8. కాకి- పాము

అనగనగా పూర్వం నర్మద నది తీరంలో రాజ మందిరం ఉండేది. దానికి కొంచెం దూరంలో చెట్టుపైన కాకి గూడు నిర్మించుకుని ఉంటుండగా ఆ చెట్టు కిందనే ఉన్న పుట్టలో పాము ఉండేది. కాకి తన పిల్లలకు ఆహారం తేవడానికి బయటకు వెళ్తున్న సమయం చూసి పాము మెల్లిగా చెట్టు పైకి ఎక్కి కాకి పిల్లలను తినేస్తూ ఉండేది. దీంతో కాకి ఏమి చెయ్యాలో తెలియక తెగ బాధపడుతుండేది.

ఆహారం కోసం గాలిలో ఎగురుతున్న సమయంలో కాకికి మంచి ఉపాయం తోచింది. ఉపాయం వచ్చిందే తడువుగా ఒడ్డునే ఉన్న రాజమందిరంలోకి ప్రవేశించి అక్కడ ఉన్న భటులు చూస్తుండగానే రాణీ గారి నగను తన నోట కరుచుకుని పైకి ఎగిరి తన గూడు వైపు వెళ్ళ సాగింది. రాజ భటులు ఆ కాకి వెంట పడ్డారు. తన గూడు ఉన్న చెట్టు కొమ్మపై వాలిన కాకి తనను వెంబడిస్తున్న భటులు చూస్తుండగానే నోటిలో ఉన్న నగ చెట్టు కింద ఉన్న పాము పుట్టలోనికి జార విడిచింది. దీంతో రాజభటుటు గునపములు, పారలు తెచ్చి ఆ నగ కోసం పుట్టను పెకిలించగా దానిలో ఉన్న పాము రాజ భటులపై కోపంతో బుస కొట్టింది. దీంతో రాజభటులు తమ దగ్గర ఉన్న ఆయుధాలతో ఆ పామును చంపి వేసి ఆ నగను తమతో తీసుకు వెళ్ళి రాణి గారికి అప్పగించారు. ఇక తన బిడ్డలకు పాము పీడ విరగడయ్యిందని సంతోషించిన కాకి తన పిల్లలతో సంతోషంగా జీవించసాగింది.

**ముగింపు:**

నేను ఈ చిన్న కథ రాసినందుకు నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఎందుకంటే నేను ఎంతో శ్రద్ధగా అమ్మమ్మలు, నానమ్మల నుండి కథలు సేకరించి రాసినందుకు. మా అధ్యాపకురాలు మాకు తరగతి గదిలో కథలు సేకరణ చేసి అసైన్మెంట్

రాయమనప్పుడు నేను ఎలా రాస్తాను మా అమ్మమ్మ ఊర్లో ఉంటారు కదా అని అనుకున్నాను. ఇదే ప్రశ్న మా అధ్యాపకురాలు అడుగుతే మా మేడం అన్నారు మీ దగ్గర సెల్‌ఫోన్లు ఉన్నాయి కదా అమ్మ,మీ అమ్మమ్మలకు కాల్ చేసి అడగండి. అలాగే వాళ్ళు చెప్పింది. రికార్డ్ చేయండి అని అన్నారు నేను ఆ రోజే హాస్టల్‌కి చేరుకొని మా అమ్మమ్మకు కాల్ చేసి అడిగాను మా అమ్మమ్మ వెంటనే కథ చెప్పింది నేను పుస్తకంలో రాసుకున్నాను.

మాలోని ట్యాలెంటును బయటకు తీసుకురావడానికి మమ్మల్ని గొప్ప స్థాయిలో ఉండాలని మా అధ్యాపకురాలి కోరిక. మేము మా అధ్యాపకురాలు చెప్పినట్లుగా నడుచుకుంటాము. నాకు ఈ అసైన్మెంట్ పని ఇచ్చిన మా తెలుగు అధ్యాపకురాలు ఎం. అలివేణి గారికి నేను నా మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నాను.

**నీతి:** ఉపాయముతో ఎంతటి అపాయము నుండైనా బయటపడవచ్చు.

*కథ చెప్పినవారు :* ***ఎన్. మల్లమ్మ***
*వయస్సు : 59 సం॥లు*
*కురుమపెల్లి, నల్గొండ*

# 9. సూర్య మండలం

ఒక ఊరికి ఒక రాజు అంట. తొప్రం రాజు అంటే తోప్రంపేట అనే పెద్ద రాజ్యనికి రాజు. ఆయనకి ఐదుగురు బిడ్డలు. ఆ అయిదుగురు బిడ్డలను వెంట వెట్టుకొని వనవాసం ఎలుతుండు. వేట మార్గం అని వెళ్ళి ఏడ భగవంతుడు దర్శనం ఇస్తే ఆడ చేస్తా అని పోతుండు. పొంగ పోంగ పోంగా పెద్ద నర అడవి వొచ్చింది. నర అడవి వొచ్చినంక ఆగమైతి, ఎట్ల పోవాలి, ఎటు పోవాలి అని అంటుంటే, చిన్న బిడ్డ అన్నదట ఇంక పదడుగులు పోతే, మనకి పట్టాభిషేకం వస్తది పా అన్నదట. సరే అని, ఇంకా పదడుగుల పోతే అప్పుడు సింహాలు, పెద్ద పులులు, గుడ్డేల్గులు అన్ని అగుపడతాయ్. అవి వీరిని చూస్తే అవి నోరు ముస్కుంటున్నయ్. అప్పుడు శ్రీకృష్ణ భగవంతుడు వొచ్చి అవిటిని పక్కకు జరిపి, ఆడ పట్టాభిషేకం కట్టి, ఆడ రాజ్యం కట్టి, పెద్ద వైభవంగా చేసి, పెద్ద ఆమెనేమో ఉత్తరానికి ఇచ్చిండు, చిన్నామెనేమో దక్షిణానికి ఇచ్చిండు, నడిపామనేమో పడమటికి ఇచ్చిండు, ఇంకొకామనేమో తూర్పు కు ఇచ్చిండు. ఇంకొకామే మిగిలింది ఇంకొకామెని ఎం చెయ్యాలి? అనుకొని ఆనా దేవునికి ఇస్తా అంటాడు. ఆన దేవునికి ఇస్తే బాగుంటది అంటే, ఆన దేవుడు తెప్ప అయినప్పుడే ఆన కొడ్తాడు. తెప్ప లేనప్పుడు ఏడుంటడు? మొగులైనప్పుడే ఆన వొస్తది. మొగులు లేనప్పుడు ఎండనేగా. అందుకే భూ దేవతకి, ఆన దేవతకి, గంగకి, ఇది అని అంటాడు ఆన దేవుడు. సుర్ల ముప్పైకోట్ల దేవతలకు ఇది ఒక సూత్రం ,శాస్త్రము, గొప్పది. ఏది బాగుంటది అని ఆలోచించాలి! శివ మంచిగ ఉంటదో, గంగా మంచిగ ఉంటదో, వాన దేవత మంచిగ ఉంటదో, భూ దేవత మంచిగ ఉంటదో, ఇది అంత సృష్టించేది ఎవరు శివుడేగా. శివ ఆగ్రహము చాన పెద్దది అని ఆలోచిస్తాడు.

**ముగింపు:**

ఈ కథ ద్వారా ఆ కాలంలో రాజులు యే విధంగా తన రాజ్యాలను కాపాడుకునే వాళ్ళో, వాళ్ళు యే విధంగా భగవంతుని కొలిచే వాళ్ళో తెలుసుకున్నాను. ఇలాంటి కథలు వాళ్ళ తోనే అంతం కాకుండా ఉండడానికి మా టీచర్ చేస్తున్న పనిలో నేను కూడ భాగస్వామ్యం అయినందుకు నా మనసుకి ఎంతో తృప్తిని అందించింది.

*సేకరించిన వారు:*

**ఎం. అక్షిత**

B.Com ( Tax procedure) 2 nd years

రూల్ నెంబర్: 105822406003

# 10. ఆశపోతు నక్క

అనగనగా ఓ అడవి. ఆ అడవిలో ఓ నక్క. జిత్తులమారి నక్క గురించి తెలిసిన జంతువులు దాని కంట పడకుండా తప్పించుకుని తిరుగుతాయి. దాంతో అది ఆకులు అలములు తింటూ ఎలాగో బతకసాగింది.

అలా ఓ రోజు నీరసంతో నడవలేక నడవలేక ఆహారం కోసం వెతుకుతుండగా దానికి ఒక పిల్లి ఎదురై "ఎలా ఉన్నావు పెద్దమ్మ"! అనీ పలకరించింది.

నక్క దానికి తన పరిస్థితి చెప్పుకుని బాధపడింది.

పిల్లికి నక్క మీద జాలేసింది.

"అలా అయితే నాతో రా పెద్దమ్మ, ఇక్కడికి దగ్గరలో ఓ ఇంట విందు జరుగుతుంది. ఎవరి కంటా పడకుండా ఆ ఇంట్లో దూరి కావాల్సిందంట తిని గుట్టు చప్పుడు కాకుండా బయట పడుదాం" అంటూ వెంట తీసుకెళ్ళింది.

రెండు కలిసి విందు జరిగే ఇంటి కిటికీలోంచి నెమ్మదిగా లోపలకు దూరాయి. పిల్లి ఒక్కొక్క పదార్థాన్ని కొంచెం కొంచెం రుచి చూసి వదిలేసింది. నక్క మాత్రం అత్యాశతో అన్ని సులభంగా లాగించింది. ఇంతలో ఏదో అలికిడి కావడంతో పిల్లి చెంగున కిటికీలో నుండి దూరి బయటపడింది. నక్క కూడా ప్రయత్నించింది కానీ వీలు కాలేదు. ఎందుకంటే వచ్చేటప్పుడు డొక్కలు ఎండిపోయి కిటికీలో నుండి సులభంగా దూరగలిగింది.

ఇప్పుడేమో పొట్టపగిలేట్టు తినడంతో కిటికీలో పట్టలేదు.

ఇంతలో ఇంటి వాళ్ళు రావడంతో ఓ ఉపాయం ఆలోచించి గుడ్లు తేలేసి చచ్చినట్లు నటించింది.

ఆ ఇంటి వాళ్ళు "అయ్యయ్యో! మాయదారి నక్క ఇక్కడికొచ్చి చచ్చింది. ఈ ఇంటికేదో అరిష్టం దాపురించినట్టుంది" అనుకుంటూ దాని కాలికి తాడుకట్టి ఈడుచుకుంటూ తీసుకెళ్లి ఊరవతల పారేశారు.

వాళ్ళు వెళ్ళిపోగానే నక్క మెల్లగా లేచి ఒంటికి అంటిన దుమ్ము దులుపుకుని బతుకు జీవుడా అని తిరిగి అడవి తోవ పట్టింది.

**నీతి :** అత్యాశ అనర్ధదాయకం.

*కథ చెప్పినవారు : పద్మమ్మ*
*మహబూబ్‌నగర్*

సేకరించినవారు:

**వి.మాధవి దేవి,**

బీకాం (టాక్స్ ప్రొసీజర్స్)

రూల్ నెంబర్: 1058-22-406-006

# 11. పంచుకుందాం

అనగనగా ఒక ఊరిలో ఒక గురువు,ఇద్దరు శిష్యులు ఉండేవారు. ఒకరోజు గురువుగారు తన ఇద్దరు శిష్యుల్ని పిలిచి, ఈరోజు మీరిద్దరూ పొరుగూరికి వెళ్ళి రావాలి అని గురువుగారు చెబుతారు.ఇద్దరికీ సంచిలు ఇచ్చారు. ఒక సంచిలో ఆహారాన్ని నింపి, ఒక శిష్యునికి ఇచ్చి "ఎవరైనా అవసరం ఉన్న వాళ్లు కనిపిస్తే వారికి ఈ ఆహారాన్ని పంచుకుంటూ వెళ్ళు"అని అన్నారు.

రెండో శిష్యుడికి కాళీ సంచి ఇచ్చి "దారిలో ఏదైనా విలువైన వస్తువు కనిపిస్తే దాన్ని సంచిలో వేసుకుంటూ వెళ్ళు" అని చెప్పారు.

ఇద్దరూ సంచుల్ని తగిలించుకుని ప్రయాణం మొదలుపెట్టి నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లారు. ఖాళీ సంచివాడు ఆడుతూ పాడుతూ నడుస్తున్నాడు.కొంత దూరం వెళ్ళాక తనకి ఒక విలువైన రంగు రాయి దొరికింది,దాన్ని తీసుకుని సంచిలో వేసుకుని మరి కొంత దూరం వెళ్తాడు.మళ్ళీ ఇంకో రంగు రాయి దొరుకుతుంది ,దాన్ని సంచిలో వేసుకుని ఎక్కడ రంగురాయి కనిపిస్తే దాన్ని తీసుకుని సంచిలో వేసుకుంటూ నడుస్తూ వెళ్తాడు.దాంతో సంచి బరువు ఎక్కుతుంది నడక భారంగా మారింది .ఉండే కొద్దీ అడుగు తీసి అడుగు వేయడం చాలా కష్టమైపోయింది.

ఇంక రెండోవాడు వెళ్తూ వెళ్తూ దారిలో ఆకలితో కనిపించిన వారికి తన సంచిలో నింపుకున్నాం తిను బండరాలను కొంచెం కొంచెంగా పంచుకుంటూ వెళ్తాడు. అలా పంచుతూ వెళ్తూ తన సంచి బరువు తగ్గి ,నడక సులభంగా అయ్యింది. పంచుకుంటూ వెళ్ళిన వాడు తన గమ్యాన్ని సులభంగా చేరుకోగలిగారు. పోగేసుకుంటూ వెళ్ళిన తను గమ్యాన్ని చేరుకోలేక పోయాడు. ప్రయాణం కష్టంగా సాగింది.

**కథలో నీతి:**

విలువైన వస్తు సామాగ్రిని పోగు వేసుకుంటూ వెళితే జీవితం కష్టంగా మారుతుంది. అదే తన ప్రేమని, జ్ఞానాన్ని ఇతరులతో పంచుకుంటూ జీవిత ప్రయాణం సాగిస్తే సుఖంగా మారుతుంది. ఇదే కథలోని తత్వం .మానవునికి అనుసరణీయం.

**ముగింపు**

**నా అనుభవం:** ఈ కథ ద్వారా నేను చాలా విలువైన విషయం తెలుసుకున్నాను .ఇతరులకు మన జ్ఞానాన్ని, అనుభవాన్ని పంచితే జీవితం చాలా బాగుంటుంది .మన జ్ఞానాన్ని ఎవరితో పంచుకోకపోతే ఉపయోగమే ఉండదు .మన జ్ఞానాన్ని ,చదువును ఇతరులకు పంచడం వలన ఎంతో ప్రయోజనం ఉంది .సమాజంలో కొత్త తరాలను ప్రోత్సహించడం వలన సంతోషం కలుగుతుంది. ఇతరులతో పంచుకోలేని జ్ఞానం, చదువు ఎంత ఉన్నా వ్యర్థం. ఈ కథ ద్వారా మంచి విషయాన్ని తెలుసుకున్నాను.

**ధన్యవాదాలు:**

ఈ కథ సేకరించే క్రమంలో ఎన్నో విలువైన విషయాలు తెలుసుకున్నాను .ఈ కథ సృజనాత్మకంగా తెలుసుకోవడం ఎంత ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ కథ చెప్పిన మా బామ్మ గారికి ధన్యవాదాలు .ఈ కథ సేకరించమని చెప్పిన మా అధ్యాపకురాలికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

ఈ తెలుగు కథలు తెలుసుకోవడంలో ఎంతో నీతి ఉంది, అందుకే పాతకాలపు కథలకు ఎంతో విలువ ఇప్పటికీ కథలను మానవులు ఆదరిస్తున్నారు.

*చెప్పినవారు : మంగ*
*వయస్సు : 65 సం॥లు*
*రాజమండ్రి*

*సేకరించిన వారు:*

**వి. నికిత**

బి.ఎస్‌సి (ఎంఎస్‌సిఎస్)

ద్వితీయ సంవత్సరం, 3rd సెమిస్టర్

క్రమ సంఖ్య: 1058-22-467-014

# 12. పెద్దపులి ఆకలి

అనగనగా ఒక పెద్ద మనిషి. పెద్దమనిషికి ఇద్దరు బిడ్డలు. ఒకరోజు చిన్న బిడ్డ ఇంటి నుంచి పెద్ద బిడ్డ ఇంటికి పోతున్నదంట పోంగ పోంగ అడివి. అడవిల, పెద్దపులి ఎదురైందంట. నాకు కండ లేదు, నా పెద్ద బిడ్డ ఇంటికాడ బాగా ఉంది సంసారం, నా పెద్ద బిడ్డ ఇంటికి పోతే నాకు మంచిగా పెడతారు. నెలకు మళ్ళీ వస్తా, అప్పుడు కండ పెట్టుకొని వస్తా, అప్పుడు మంచిగా భోజనం చెయ్యి, అని పులికి చెప్పి పెద్ద బిడ్డ ఇంటికి పోయింది. పెద్ద బిడ్డ ఇంటికాడనే నెల ఉంటది. తర్వాత మళ్ళీ వస్తది.నడిచి వస్తుంటే చెమటలు వస్తాయి, పులి తినడానికి వస్తే చెమటలు కారిపోయినాయి చెమట తోటి ఎట్ల తింటావు? నేను పోయి చెరువుల స్నానం చేసి వస్తా, అని పులి తోని చెప్పి చెర్లకు పోయింది. చెరువుల మునిగింది, ఇక రావట్లేదు ఇక రావట్లేదు అని పులి అనుకొని దగ్గరికి పోయింది. ఏంది అమ్మ ఇంకా వస్తలేవు, అని అంటది పెద్దపులి. వస్తున్న అంటది ఆ పెద్దమనిషి. వచ్చి కళ్ళల్లో ఇసుక వేస్తది ఇసుక పెద్దపులి కళ్ళలా పడుతది. కళ్ళు నలుసుకుంట పెద్దపులి ఉంటే, పెద్ద మనిషి తప్పించుకొని పోయింది.

**నీతి:**

ఈ కథలు ఒక పెద్ద మనిషి పెద్దపులి చేతుల చిక్కినప్పుడు భయపడకుండా దాన్ని మైమరపింప చేసింది. చివరకు దాని నుండి తప్పించుకొని వెళ్ళిపోయింది. ఈ కథలో లాగే, మనం కూడా ఏదైనా కష్టం వస్తే భయపడకుండా ఎదుర్కోవాలి. మన ముందు ఏ కష్టం ఉన్న మనం వెనకడుగు వేయకూడదు, నిరాశ పడకూడదు. మన ముందు మృత్యువే ఉన్నా మనం భయపడకూడదు.

**ముగింపు:**

ఈ కథల సేకరణ వల్ల మనం అప్పట్లో ఉన్న కథలు అంతరించిపోకుండా వెలికి తీయడం చేస్తున్నాం. ఇప్పట్లో పిల్లలందరూ ఫోన్లకు అలవాటు పడి అమ్మమ్మ వాళ్ళ దగ్గర కథలు వినడం మర్చిపోతున్నారు. నా స్నేహితురాలి నాయనమ్మని కథ చెప్పమని అడగానే ఎంతో సంతోషించిందంట.

*కథ చెప్పినవారు : సాలమ్మ*
*వయస్సు : 70 సంIIలు*
*సూర్యాపేట*

సేకరించువారు :

**జి. స్వాతి**

B.A (EPP), 2 nd year 3 rd Sem

క్రమసంఖ్య : 1058-22-111-050

# 13. నక్కతెలివి

అడవిలో ఒక చిన్న చెరువులో ఒక మొసలి ఉండేది. ఆ చెరువులో బోలెడన్ని చేపలున్నాయి. వాటిని తింటూ ఆ మొసలి అక్కడే ఉంటోంది. అది ఉన్నదనే భయానికి అక్కడికి ఏ జంతువులూ వచ్చేవికావు. ఆ చెఱువు దగ్గరలోనే ఒక పీత ఉంటోంది. మొసలికి అది మిత్రుడు.

ప్రతీ రోజు చేపలు తిని తినీ మొసలికి వెగటు పుట్టింది. అందు చేత ఏదైనా ఉపాయం చెప్పి, తనకు వేరే ఆహారం ఏదైనా దొరికేటట్లు చూడమని మొసలి పీతతో చెప్పింది. పీత బాగా ఆలోచించి దానికొక సలహా చెప్పింది. “నీవు ఒడ్డు పైన చచ్చిపోయినట్లుగా పడి ఉండు! నేను వెళ్ళి అడవిలోని జంతువులు అన్నింటికి నీవు చచ్చిపోయావని చెప్తాను. ఆ పైన జంతువుల్నీ ఇక్కడకు నీళ్ళుతాగడానికి వస్తాయి. అప్పుడు నీ ఇష్టం వచ్చిన జంతువుని పట్టుకొని తింటూండవచ్చును”

“ఓహెూ! నీ సలహా చాలా బాగుంది!” అంది మొసలి. పీత వెంటనే అడవిలోకి వెళ్ళి “మిత్రులారా! చెరువులోని మొసలి చచ్చిపోయింది. మీరింక భయం లేకుండా వచ్చి నీళ్ళు తాగవచ్చును” అని చెప్పింది. దాని మాటలు అన్ని జంతువులు నమ్మాయి. కాని వాటిలో ఒక తెలివైన నక్క మాత్రం నమ్మలేదు. “నీతో వస్తాను, నాకు చచ్చిన మొసల్ని చూపించు” అని పీత వెనకే వెళ్ళింది. నక్క మొసల్ని చూసి అది చావ లేదని ఊహించుకొని, కూడా వచ్చిన జంతువులతో “మిత్రులారా! మొసలి చచ్చిపోయిందని మీరు నమ్ముతున్నారా? అది తోక కదుపుతున్నట్లు మీరెవరైనా చూశారా? నాకు ఒక గుడ్ల గూబ చెప్పిన ప్రకారం, మొసలి చచ్చినా సరే దానితోక కదులుతూ ఉంటదట” అని నక్క గట్టిగా అరచి చెప్పింది.

తెలివి లేని ఆ మొసలి, నక్క మాట విన్న వెంటనే తోక కదల్చడం మొదలెట్టింది. అది బ్రతికే ఉందని, నక్కకు ఇప్పుడు అర్థమైంది. వెంటనే గట్టిగా ‘మిత్రులారా

పారిపోండి! మొసలి చావలేదు. బ్రతికే ఉంది.” అని అరిచింది. వెంటనే జంతువులన్నీ అక్కడి నుండి పారిపోయాయి.

**నీతి:** మోసాన్ని మోసంతోనే జయించాలి.

**ముగింపు:** ఈ కథలోని నక్క ఎంతో తెలివిగా సమయానుసారంగా వ్యవహరించింది.నక్క తెలివితో అడవిలోని జంతువులను మొసలి పీతల బారిన పడకుండా కాపాడింది. దీని నుంచి మనం ఎప్పుడు తెలివిగా,చురుకుగా,సమయం ప్రకారం నడుచుకోవాలి,ఆలోచనతో వ్యవహరించాలి. ఏ కష్టం వచ్చిన మనం తెలివిగా అలోచించి దాన్ని ఎదుర్కోవాలి అని ఈ కథ నుంచి మనం నేర్చుకోవాలి.

సేకరించువారు :
**జి. అక్షర**
BSC(BZC) 1ST YEAR
క్రమ సంఖ్య: 27

# 14. రుద్రమ్మ దేవి

రుద్రమదేవి కాకతీయుల వంశంలో ఒక ధ్రువతారగా వెలిగిన మహారాణి. కాకతీయ వంశమునకు గొప్ప పేరు ప్రఖ్యాతులని తెచ్చిపెట్టిన వీరవనిత. భారతదేశ చరిత్రలో రాజ్యాలను ఏలిన మహారాణులలో రుద్రమదేవి ఒకరు. ఈమె అసలు పేరు రుద్రాంబ. కాకతీయ గణపతిదేవుడు, పాలకుడైన జయాపసేనాని సోదరీమణులైన నారంభ, పేరాంభలను వివాహ మాడినాడు. వీరి ముద్దుల కుమార్తె రుద్రమదేవి. చేబ్రోలు శాసనం దీని గురించి తెలియజేస్తుంది. ఈమె తండ్రి గణపతిదేవునికి పుత్ర సంతానం లేదు. అందువలన రుద్రాంబను తన కుమారుడిలా పెంచుకొని రుద్రదేవుడని నామకరణం చేసాడు. గణపతిదేవుడు తన కుమార్తె రుద్రమదేవిని నిరవద్యపుర (నిడదవోలు) ప్రాంతాన్ని పాలిస్తున్న తూర్పు చాళుక్యుడైన వీరభద్రుడికి ఇచ్చి వివాహం చేశాడు. రుద్రమదేవికి ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె ముమ్మడమ్మ. ఈమె మహాదేవుని భార్య. వీరి పుత్రుడే ప్రతాపరుద్రుడు. రుద్రమాంబ ప్రతాపరుద్రుని దత్తత తీసుకొని యువరాజుగా పట్టాభిషేకం చేసింది. అన్నమదేవుడు అనే తమ్ముడు ఉండేవాడని స్థానిక గాథ. బస్తర్ రాజ్య చివరి పాలక వంశంవారు అన్నమదేవుని తమ వంశకర్తగా చెప్పుకున్నారు. రుద్రమదేవి రెండవ కుమార్తె రుయ్యమ్మ.

కాకతీయులలో అగ్రగణ్యుడైన గణపతిదేవుని తరువాత 1269 లో రుద్రమదేవి ' రుద్రమహారాజు ' బిరుదుతో కాకతీయ మహాసామ్రాజ్య సింహాసనాన్ని అధిష్టించింది. అయితే ఒక మహిళ పాలకురాలు కావటం ఓర్వలేని అనేకమంది సామంతులు తిరుగుబాటు చేశారు. అదే సమయంలో నెల్లూరు పాండ్యుల కిందకి, వేంగి ప్రాంతం గొంకరాజు మొదటి నరసింహుడి కిందకి వెళ్ళినాయి. పాకనాటి కాయస్థ అంబదేవుడు, కళింగ నరసింహుని కుమారుడు వీరభానుడు తిరుగుబాట్లు చేశారు. రుద్రమ తన సేనానులతో కలిసి ఈ తిరుగుబాట్లనన్నిటినీ విజయవంతంగా అణచివేసింది.

రుద్రమాంబ ఎదుర్కొన్న దండయాత్రలన్నిటిలోకీ దేవగిరి యాదవరాజుల దండయాత్ర అతి పెద్దది, కీలకమైనది. యాదవరాజు మహాదేవుడు ఓరుగల్లును ముట్టడించాడు. అయితే రుద్రమదేవి యాదవులను ఓడించి, దేవగిరి దుర్గం వరకూ తరిమి కొట్టింది. వేరేదారి లేని మహదేవుడు సంధికి దిగివచ్చి, యుద్ధ పరిహారంగా మూడుకోట్ల సువర్ణాలు చెల్లించాడు. రుద్రమదేవి యొక్క శైవమత గురువు విశ్వేశ్వర శివశంబు. గణపతి దేవునికి, రెండవ ప్రతాపరుద్రునికి కూడా ఈయనే గురువు. రుద్రమ తానే స్వయంగా కాయస్త రాజ్యంపై దాడి చేసినట్లు తెలుస్తోంది. చందుపట్ల శాసనం ఆధారంగా కాయస్త అంబదేవునితో జరిగిన యుద్ధాలలోనే మరణించినట్లు చరిత్రకారులు భావిస్తున్నారు. రుద్రమదేవికి గల ఇతర బిరుదులు: రాయగజకేసరి, ఘటోద్భృతి.

ప్రఖ్యాత పథికుడు మార్కో పోలో చైనా దేశము నుండి తిరిగి వెళ్తూ దక్షిణ భారతదేశము సందర్శించి రుద్రమదేవి గురించి, ఆమె పాలన గురించి బహువిధముల పొగిడాడు. మోటుపల్లి రేవు నుండి కాకతీయుల సముద్ర వ్యాపారము గురించి కూడా వివరముగా వ్రాశాడు.

రాణి రుద్రమ దేవి గురించి మనకు తెలిసి దానికన్నా తెలియనిదే ఎక్కువ. ఆమె జన్మ సంవత్సరం తెలియదు. ఉజ్జాయింపుగా ఊహించడానికి వీలుంది అని కాకతీయ యుగము గ్రంథంలో లక్ష్మీరంజనం రాశారు. రుద్రమదేవి గురించి చరిత్రకారులకూ తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయి.

రుద్రమదేవి సా.శ. 1261 మార్చి 25వ తేదీన ఇప్పటి ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా కృష్ణా నది దక్షిణ తీరానున్న మందడం గ్రామంలో, రాజగురువు విశ్వేశ్వర శివాచార్య సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్నట్లు అక్కడ దొరికిన శాసనం తెలియజేస్తోంది. దానివల్ల పుట్టినతేదీ తెలుస్తోందే తప్ప సంవత్సరం కాదు.

సా.శ. 1257 నాటి జుత్తిగ శాసనం ప్రకారం ఆమె నిడదవోలుకు చెందిన చాళుక్య వీరభద్రుని పెండ్లాడింది.

సా.శ. 1259 నుంచే ఆమె తండ్రికి సహకరిస్తూ పరిపాలనానుభవాన్ని సంపాదించింది.

1262 సంవత్సరం నుంచే ఆమె స్వతంత్రంగా పరిపాలించటం ప్రారంభించింది.

సా.శ. 1268లో నెల్లూరు జిల్లా ముత్తుకూరు ప్రాంతం వరకూ చొచ్చుకొచ్చిన వీరరాజేంద్ర చోళున్ని ఓడించి, ఆ భూభాగాన్ని సొంతం చేసుకొంది. అయినప్పటికీ

కాయస్త జన్నిగ దేవుడు గుంటూరు జిల్లా పల్నాడులోని దుర్గి గ్రామంలో సా.శ. 1269వ సంవత్సరంలో వేయించిన శాసనం రుద్రమదేవిని పట్టోధృతి (యువరాణి) గానే పేర్కొంది.

ఆమె తన శక్తిసామర్థ్యాలతో ప్రతి ఒక్కరినీ మెప్పించి దిగ్విజయంగా పాలనా వ్యవహారాలను నిర్వహించారు. ప్రఖ్యాత కాకతీయ వంశానికి చెందిన రుద్రమదేవి ఓరుగల్లు (నేటి వరంగల్లు) రాజధానిగా పరిపాలించారు. సా.శ.1262 నుంచి 1289 వరకు సుమారు 27 సంవత్సరాల పాటు చక్కటి పరిపాలన చేశారు. మనదేశంలో మహిళాపాలకులు చాలా అరుదు. రాణీ రుద్రమదేవికి కొద్దికాలం ముందే సుదూరంలో ఉన్న ఢిల్లీని రజియా సుల్తానా అనే మహిళ పరిపాలించారు. ప్రభువర్గాలకు చెందిన వారు స్త్రీ పరిపాలన ఇష్టం లేక ఆమెను పాలకురాలిగా అంగీకరించక తుదముట్టించారు. ప్రముఖ ఇటాలియన్ యాత్రికుడైన మార్కోపోలో రుద్రమదేవి రాజ్యాన్ని సందర్శించి, ఆమె పరిపాలన, ధైర్యసాహసాలను కొనియాడాడు. ఆమె పురుషుల దుస్తులు ధరించి నిర్భయంగా, సునాయాసంగా గుర్రాల స్వారీ చేసేవారని పేర్కొన్నాడు. నాటి శాసనాలలో రుద్రమదేవి రుద్రదేవ మహారాజుగా కీర్తించబడింది. రజియా సుల్తానా లాగా రుద్రమదేవి కూడా తన తండ్రి పాలనా కాలంలోని ముఖ్యమైన నాయకుల వ్యతిరేకతను విజయవంతంగా అణిచివేసింది. రుద్రమదేవి, ఆమె మనుమడైన ప్రతాపరుద్రుడి పాలనలో చెలరేగిన అనేక సామంత తిరుగుబాట్లను నియంత్రించడానికి పలు చర్యలు తీసుకున్నారు.

రాణీ రుద్రమ దేవిని గూర్చి రాస్తూ ప్రసిద్ధ చరిత్రకారులు మల్లంపల్లి సోమశేఖర శర్మ, డాక్టరు నేలటూరు వెంకటరమణయ్య ఇట్లా అభివర్ణించారు.

తెలుగు వారిని పాలించిన దేశ పరిపాలకులలో రుద్రమదేవి నిస్సందేహంగా మహోఘనత చెందిన వ్యక్తి. రాజధర్మ విధులను ఆమె నిర్వహించిన తీరు వలన తండ్రి ఆమెకు ప్రసాదించిన పురుషనామము, 'రుద్రదేవుడు' అన్ని విధముల సార్థకమైనది. ప్రజలు ఆమెను రుద్రదేవ మహారాజు అని పిలుచుకునేవారు. దేశ పరిపాలనలో ఆమె చైతన్యవంతమైన పాత్ర వహించింది. ధైర్య సాహసములు, విక్రమము కల యోధురాలు అవడమే కాక, ఆమె గొప్ప వ్యూహ తంత్రజ్ఞురాలు. ఆమె రాజరికం చేసిన కాలంలో తరుచూ యుద్ధముల అలజడి కలిగినా, ఆమె ప్రజలు సంతుష్టులు, సంప్రీతులు అయి సుఖించారు.

రుద్రమదేవి పాలన ప్రజారంజకమై భాసిల్లింది. శాంతి సుస్థిరతలతో విరాజిల్లింది. క్రీ. శ. 1000 నుంచి 1323 వరకు దాదాపు మూడు శతాబ్దాల పాటు తెలుగు

నేలనేలింది కాకతీయ వంశం. వీరికాలంలోనే త్రిలింగ, ఆంధ్ర పదాలకు అర్థం, పరమార్థం ఏర్పడ్డాయి. కాకతీయ వంశంలో సప్తమ చక్రవర్తి అయిన గణపతి దేవుడు అత్యంత పరాక్రమవంతుడు, రాజనీతి కోవిదుడు. ఈయనకు ఇద్దరు కూతుళ్ళు. మహిళలు రాజ్యాధికారానికి అనర్హులన్న అప్పటి కాలపరిస్థితులకు తలొగ్గిన ఆయన తన కూతురు రుద్రమదేవిని కుమారుడిగా పెంచాడు. అన్ని విద్యలూ నేర్పించాడు. గణపతి దేవుడు రుద్రమను రాజప్రతినిధిగా ప్రకటించినప్పుడు ఆమె వయసు పద్నాలుగేళ్ళే. అప్పటి నుంచి ఆమె తండ్రి చాటుబిడ్డగా పాలన సాగించింది. రుద్రమదేవి 1261 ప్రాంతం నుంచి స్వతంత్రంగా పరిపాలించినట్లు కనబడుతుంది. కొన్ని శాసనాల్లో 1279 వరకు పట్టాభిషక్తురాలు కాలేదేమో అనే భావం కలిగించే రాతలున్నాయి.

పద్నాలుగవ యేటనే పాలనా పగ్గాలు చేపట్టిన రుద్రమకు ఇరవై ఐదో యేట నిడదవోలు రాజైన చాళుక్య వీరభద్రునితో వివాహమైంది. సా.శ. 1257 నాటి జుత్తిగ శాసనం ప్రకారం రాణి రుద్రమదేవి భర్త చాళుక్య వీరభద్రుడు అగ్నికుల క్షత్రియ కులానికి చెందిన "కొల్లి"పాక వంశ చాళుక్య రాజు. వీరికి ఇద్దరు కూతుళ్ళు ముమ్మడమ్మ, రుయ్యమ్మ. తనకు మగ సంతానం లేకపోవడంతో రుద్రమ తన పెద్ద కుమార్తె ముమ్మడమ్మ కుమారుడైన ప్రతాపరుద్రుడ్ని దత్తత తీసుకుని యువరాజుగా పట్టాభిషేకం చేసింది. విధి ప్రాతికూల్యం చేత రుద్రమ దేవి భర్త చాళుక్య వీరభద్రుడు సా.శ. 1266 నాటికే మృతిచెందినట్లు ఆయన తల్లి ఉదయ మహాదేవి పాలకొల్లు శాసనంలో ఉంది. భర్త మరణానికి సమీప కాలంలోనే రుద్రమదేవికి మరొక తీరని దుఃఖం కలిగింది. వృద్ధుడైన గణపతి దేవ చక్రవర్తి 1267లో శివసాయుజ్యం చెంది ఆమెను నిస్సహాయురాల్ని చేశాడు. రుద్రమకు ఇద్దరు కూతుళ్ళే కాక, ఎల్లన దేవుని భార్య కూడా రుద్రమదేవి తనయ అని ప్రకృతశాసనం చెబుతోంది.

రాణి రుద్రమ తనదైన శైలిలో, అరుదైన రీతిలో పాలన సాగించింది. ప్రజలను, ముఖ్యంగా మహిళలను ఆమె అర్థం చేసుకున్నట్టుగా ఏ ఇతర రాజులూ అర్థం చేసుకోలేదు. రుద్రదేవుడి రూపంలో ఉన్న రుద్రమ పట్టోధృతి అంటే రాజప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం దేశమంతా కలియ తిరిగింది. ప్రజాసమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుంది. యువరాజుగా ఆమె ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించింది. రాజ్యంలో ఒక చోట ఒక తల్లి కాన్పులోనే కన్ను మూయడం చూసి రుద్రమ తల్లడిల్లింది. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా సాహసోపేతమైన

నిర్ణయం తీసుకుంది. గ్రామగ్రామాన ప్రసూతి వైద్యశాలలు కట్టించమని ఆదేశించింది. ఇకపై రాజ్యంలో ప్రసవ సమయంలో ఒక్క మాతృమూర్తి కూడా మృత్యువాత పడడానికి వీల్లేదు అని ప్రకటించింది.

గొలుసు కట్టు చెరువులు అంటే ఒక ఊరి చెరువు నిండి అలుగు పోస్తే ఆ వృథా నీరు మరో పల్లెలోని చెరువు, కుంటల్లోకి వెళ్తుంది. ఇదీ గొలుసుకట్టు చెరువులు, కుంటల పరిస్థితి. అయితే ఈ గొలుసుకట్టు చెరువులు, కుంటలకు అనుబంధంగా ఏఎమ్మార్పీ కాల్వలను తవ్వారు. ఈ కాల్వల ద్వారా ఎగువభాగంలో ఒక చెరువు, లేదా కుంటలోకి తూముల ద్వారా చేరవేసిన నీళ్ళు వాగులు, వంకలద్వారా పారుకుంటూ దిగువ ప్రాంతంలోని సాగునీటి వనరులను నింపుతున్నాయి. దీంతో వివిధ గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలు కృష్ణా జలాలతో నిండి పల్లెల్లో తాగు, సాగునీటి ఇబ్బందులను తొలగిస్తున్నాయి. రుద్రమదేవి పాలనలో అప్పటి ప్రధాన రంగమైన వ్యవసాయం వర్ధిల్లింది. సాగునీటి కొరత లేకుండా సువిశాలమైన చెరువులు తవ్వించారు. తెలంగాణలో ఇప్పుడు ఉన్న గొలుసు కట్టు చెరువుల శాస్త్రీయ విధానము ప్రపంచం మొత్తంలో తెలంగాణలో తప్ప మరెక్కడ కనిపించవు. రాణి రుద్రమా దేవి సూచించిన వ్యవసాయ శాస్త్రీయా విధానం 800 సం౹౹లు దాటినా తెలంగాణలో రైతులకు వ్యవసాయానికి ప్రధాన మూలాధారాం. ప్రతి గ్రామానికీ ఉన్న చెరువులు, కుంటలుబీ లక్నవరం, పాకాల, రామప్ప లాంటి పెద్ద పెద్ద జలాశయాలు, వారి పరిపాలన దక్షతకు నిదర్శనం. వారి కాలంలో వ్యవసాయంతో పాటు వాణిజ్యం కూడా విస్తరించింది. భరతనాట్యం, కూచిపూడి వంటి సంప్రదాయ నృత్యాలకు దీటైన పేరిణీ శివతాండవమనే నూతన నృత్య విధానం పురుడుపోసుకుంది రుద్రమ కాలంలోనే. కాకతీయుల సైన్యాధిపతి అయిన జాయప సేనాని పేరిణీ నృత్య సృష్టికర్త. రుద్రమదేవి కాలంలో సంగీతం, సాహిత్యం, శిల్ప కళ, నృత్యం కలగలిసిపోయి విరాజిల్లారు.

*కథ చెప్పినవారు : రుక్మ*<br>
*వయస్సు : 70 సం౹౹లు*<br>
*ఆదిలాబాద్*

సేకరించినవారు:

**జెడ్. సుష్మ**

BA(EPP)

2nd year, 3rdsem

క్రమసంఖ్య :1058-22-111-080

# 15. మూడు ప్రశ్నలు

అక్బర్ రాజుకు బీర్బల్ మంత్రి అంటే చాలా ఇష్టం. అక్బర్ ఆ ఇష్టాన్ని ఎప్పుడు బాహిర్గతం చేసేవాడు. ప్రతి విషయంలో అక్బర్ బీర్బల్‌ని చాలా ప్రశంసించేవాడు ప్రతీరోజు ఇదంతా చూస్తున్న అక్బర్ సభలోని ఒక మంత్రికి బీర్బల్ పైన చాలా అసూయ కలిగేది.

ఆ మంత్రికి కలిగే అసూయ గురించి తెలిసిన అక్బర్, బీర్బల్‌ని ఎందుకు తాను అంతగా ప్రశంశిస్తాడో, బీర్బల్ యొక్క తీర్పుకి ఎందుకు అంత విలువ ఇస్తాడో.., ఇలాంటి అసూయ కలిగే అందరి మంత్రులకి తెలియ చెప్పాలి అనుకున్నాడు.

ఒకరోజు సభలో అందరు మంత్రులు హాజరయ్యారు. ఇదే సరైన సమయం అని భావించిన అక్బర్, బీర్బల్‌ని కూడా సభకి పిలిపించాడు.

బీర్బల్ నువ్వు చాలా తెలివైన వాడివని నేను నమ్ముతున్నాను. కానీ, ఈ సభలో చాలా మంది మంత్రులు నీ పట్ల అసహనాన్ని కలిగి ఉన్నారు నేను ఈ రోజు వారికి గుణపాఠం చెప్పాలి అనుకుంటున్నాను.

అందుకోసం నేను కేవలం మూడు ప్రశ్నలు వేస్తాను. సభలో ఎవ్వరైనా దానికి సమాధానం తెలిస్తే ముందుకు వచ్చి మీ సమాధానాన్ని అందరి ముందు చెప్పగలరు. సభికులందరికి మీ సమాధానం నచ్చి మరియు మీ సమాధానంతో ఏకీభవిస్తే మీకు నేను బీర్బల్ యొక్క పదవిని, స్థానాన్ని కల్పిస్తాను అని చెప్పాడు.

అందుకు సభలోని మంత్రులు అందరు మనసులో, బీర్బల్ తెలివి ముందు ఎలాగూ ఓటమి తప్పదని తెలిసినా. అక్బర్ ప్రశ్నలు అడగకముందే ఓటమిని ఒప్పుకుంటే సభలో వారికి విలువ ఉండదని భావించి, బయటకి వారు తాము సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

అక్బర్ అడిగిన మూడు ప్రశ్నలు

1. ఆకాశంలో ఎన్ని నక్షత్రాలు ఉన్నాయి ?

2. భూమి యొక్క మధ్య భాగం ఎక్కడ ఉంది ?

3. మన రాజ్యంలో ఎంత మంది పురుషులు మరియు ఎంత మంది మహిళలు ఉన్నారు ?

వెంటనే అక్బర్, బీర్బల్‌ని, నేను అడిగిన మూడు ప్రశ్నలకు నువ్వు కూడా సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ మూడు ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుందని తెలియజేశాడు. బీర్బల్ అందుకు సరే అన్నాడు. బీర్బల్ కాకుండా సభలో ఉన్న ఏ మంత్రి అయినా సరైన సమాధానం చెప్తే వారే ఇక నుండి బీర్బల్ యొక్క స్థానాన్ని పొందుతారు అని చెప్పాడు అక్బర్.

కాకుండా సభలో ఉన్న ఏమంత్రి అయినా సరైన సమాధానం చెప్తే వారే ఇక నుండి బీర్బల్ యొక్క స్థానాన్ని పొందుతారు అని చెప్పాడు అక్బర్.

అక్బర్ అందరి మంత్రులని ప్రశ్నించాడు. ఎవరికైనా సమాధానం తెలిస్తే ముందుకు వచ్చిచెప్పొచ్చు అని కానీ అక్బర్ రాజు అడిగే ప్రశ్నలు సామాన్యమైనవి కాదు. వాటికి అంత సులువుగా సమాధానం చెప్పలేమని అనుకుని సభలోని ఏ ఒక్క మంత్రి కూడా సమాధానం చెప్పడానికి ముందుకు రాలేరు.

కాస్త సమయం గడిచాక బీర్బల్ ముందుకు వచ్చి నేను ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పగలను అన్నాడు. అది విన్న సభికులందరు ఆశ్చర్యపోయారు. బీర్బల్ సమాధానం కోసం మంత్రులందరూ ఎదురుచూస్తున్నారు.

మొదటి ప్రశ్నకు సమాధానంగా, బీర్బల్ బాగా వెంట్రుకలతో కూడిన ఒక గొర్రెను తీసుకువచ్చి, "ఈ గొర్రెకి ఎన్ని వెంట్రుకలు ఉన్నాయో ఆకాశంలో అన్ని నక్షత్రాలు ఉన్నాయి. మీకు ఎవరికైనా సందేహంగా ఉంటె మీరు వచ్చి ఈ గొర్రెకి ఉన్న వెంట్రుకలని లెక్కపెట్టండి అన్నాడు.

రెండవ ప్రశ్నకు సమాధానమివ్వడానికి, బీర్బల్ నేలపై రెండు గీతలు గీసి, వాటి మధ్యలో ఒక ఇనుపకడ్డీని ఉంచి, "ఇది భూమి మధ్యలో ఉంది, మీకు ఎవరికైనా సందేహంగా ఉంటె మీరు వచ్చి స్వయంగా కొలవగలరు.

మూడవ ప్రశ్నకు సమాధానంగా, బీర్బల్ ఇలా అన్నాడు, "మనం రాజ్యంలోని ప్రజలు కొంతమంది పక్క రాజ్యంలోకి మరియు పక్క రాజ్యంలోని ప్రజలు మన రాజ్యానికి వచ్చారు. కావున, ఎప్పుడైతే వారు ఎవరి రాజ్యానికి వారు వెళ్తారో మరియు అలా ఒకరి రాజ్యానికి మరొకరు ప్రయాణించడం ఆగిపోతుందో అప్పుడు నేను సమాధానం చెప్తాను అన్నాడు బీర్బల్.

నిజానికి అది ఎప్పటికి జరగని పని. ఎందుకంటే? ఒక రాజ్యం నుండి మరొక రాజ్యానికి ప్రజలు ప్రయాణించడం సహజంగా జరిగే పని. అంటే బీర్బల్ ఆ ప్రశ్నకి శాశ్వత సమాధానం లేదని తెలివిగా సమాధానం చెప్పాడు.

బీర్బల్ సమాధానాలు విన్న సభికులందరు ఆశ్చర్యపోయారు మరియు అక్బర్ లోలోపల గర్వంతో అనుభూతి చెందాడు. కావున బీర్బల్ స్థానం మరియు పదవి మారలేదు. ఎల్లప్పుడు అసూయ చెందే మంత్రులు తమ తప్పు తెలుసుకుని, తెలివి తేటలలో తమ స్థాయి ఏంటో అర్థం చేసుకున్నారు. బీర్బల్ పైన అసూయ చెందడం మానుకున్నారు.

**నీతి:** ప్రతి ప్రశ్నకు ఒక సమాధానం తప్పకుండా ఉంటుంది.

*కథ చెప్పినవారు : వసుంధర*
*వయస్సు: 50 సం॥లు*
*నర్సూర్, ఆదిలాబాద్*

*సేకరించిన వారు:*

**నేనావత్ దీపిక**

బిఎస్సి (ఎంఎస్సిఎస్)

రూల్ నెంబర్: 1058-22-467-067

# 16. నరుడు ఆయుష్షు

అనగనగా ఒక భగవంతుడు నరుడు అయితే ఆ భగవంతునికి భగవంత భగవంత నాకు వయసు ఎంత రాసినావు అని అడిగాడంట. అరే నరుడ నీకు 40 ఏళ్ళ ఆయుష్షు ఉంది 40 ఏళ్ళు బతుకు పో. భగవంత నేను 40 ఏళ్ళ వయసుకే ఏం పిల్లల్ని కనాలి పిల్లల్ని సాకలి నేను ఎట్లా బతకాలి అని అడిగాడంట. అయితే అంతే ఉంది నరుడ నీ వయస్సు ఎక్కువ లేదు అని భగవంతుడు అన్నాడు. అంతే ఉంది నీ వయస్సు ఎక్కువ లేదు అనే సరికి నరుడు ఊరుకున్నాడు. ఊరుకునే సరికి మల్ల ఆవు పోయిందంట. అరే నేను ఎన్ని రోజులు ఈ నరలోకానికి ఎన్ని రోజులు కష్టాలు చేసి పెట్టాలి నాకు భగవంతుడు ఎంత వయసు రాసిండు అని గోమాత భగవంతుని దగ్గరికి పోయింది. పోయి భగవంతునికి ఏమని అడిగింది. భగవంత భగవంత నాకు ఎన్ని ఏళ్ళ వయస్సు ఇచ్చినావు నేను ఎన్ని ఏళ్ళు బతకాలి అని భగవంతుని గోమాత అడిగింది. గోమాత అడిగేసరికి భగవంతుడు అన్నాడంట. అమ్మ గోమాత నీకు కూడా 40 ఏళ్ల వయసు ఉంది ఏం చేసినా చేయకున్నా బతకాలి అని గోమాతకు చెప్పాడంట అయితే సరే అని గోమాత వెళ్ళిపోయింది. అయితే ఆ గోమాతకు లేనిపోని కష్టాలు అది సుడితోటి ఉందా అని చూడరు అది ఈనిన పాలు ఇచ్చి దూడని సాకలి ఇక్కడ గడ్డేకు పోవాలి ఇన్ని బాధలు వస్తుందంట గోమాతకు అన్ని బాధలు వస్తుంటే వా యబ్బ నేను ఈ కష్టం చేస్తే బతకగలనా నేను మల్ల భగవంతుని కాడికి పోవాలి నా ఆయుష్షు తక్కువ చేసుకోవాలి మల్ల భగవంతుని కాడికి వచ్చిందదంట. భగవంత భగవంతం ఈ కష్టాలు బాధలు పడలేను వయసు తగ్గించమని అడిగిందదంట. భగవంతుడు అన్నాడు అమ్మ గోమాత నీకు 20 ఏళ్ల ఇస్తున్న అని చెప్పిండు చెప్పేసరికి గోమాత వెళ్ళిపోయింది. ఏం రా నరుడు నీకు ఇంకా వయసు కావాలా ఈడనే నిలబడి ఉన్నావు. అని భగవంతుడు అడిగిండట.

స్వామి నాకు ఇంకా వయసు కావాలి గోమాత 20 ఏళ్ళు ఇచ్చి పోయింది ఆ 20 ఏళ్ళు కూడా ఇస్తున్న పో అన్నాడంట పోతలేడంట. అయితే ఒక గాడిద వచ్చిందంట. భగవంత భగవంత నాకు ఎన్ని ఏళ్ళ వయసు రాసినావు నాకు తెలియకుండా ఎన్నిరోజులు బతకాలి అని భగవంతుణ్ణి అడిగిండట. గాడిద వచ్చి అడిగేసరికి భగవంతుడు అన్నాడంట. నీకు 40 ఏళ్ళ వయస్సు ఉంది బతుకు పో అన్నాడంట. ఆ గాడిద వచ్చేసింది. అయితే ఆ గాడిదకు లేనిపోని కష్టాలు అన్ని బరువు వేసి ఎక్కడ పడితే అక్కడ గట్టు ఎక్కిస్తున్నారు. ఊరి పొన్న బయట పొన్న నడిపిస్తున్నారంట. ఆ గాడిదకు లేనిపోని ఆయాసం వస్తోంది. అబ్బా నేను ఈ బతుకు బతికిన లాభం లేదు భగవంతుని కాడికి పోవాలి. నా ఆయుష్షు తక్కువ చేసుకోవాలని భగవంతుని కాడికి గాడిద పోయిందంట. భగవంత భగవంత నాకు ఇన్ని తిప్పలు కష్టాలు పడి నేను బతకలేను బతికిన లాభం లేదు నా చెంతకు సుఖం లేదు బతుకు నాకెందుకు నాకు ఇంత వయసు వద్దు నాకు వయసు తగ్గించమని అన్నదంట. సరే అని నీవే వద్దు అన్నప్పుడు నేను ఎందుకు ఎక్కువ ఇవ్వాలి. నీకు 20 ఏళ్ళ వయసు తగ్గిస్తున్న 20 ఏళ్ళ ఆయుష్షు ఉంటుంది నీవు బతుకు పో. ఆ నరుడు ఇంకా  ఆడనే నిలబడి ఉన్నాడు. అయితే  ఏం రా నరుడా నీకు ఇంకా వయసు కావాలా గాడిద వయసు కూడా తీసుకుంటావా స్వామి నాకు ఇంకా వయసు కావాలి అన్నాడంట అయితే ఈ ఇరవై ఏళ్ళు కూడా తీసుకో అన్నాడంట. గోమాత 20 ఏళ్ళు గాడిద 20 ఏళ్ళు మొత్తం 80 సంవత్సరాలు ఆ నరుడు ఇంకా పోతలేడు అంట. ఆ గాడిద వెళ్ళిపోయింది. మల్ల కుక్క వచ్చిందంట. భగవంత భగవంత నాకు ఎన్ని రోజుల వయస్సు రాశావు. నీకు 40 ఏళ్ళ వయసు ఉంది బతుకు పో అన్నాడంట. అయితే మళ్ళీ అడిగి వచ్చేసింది. ఆ కుక్కకు నానా తిప్పలు అవుతుందంట. ఒక్కడు బుక్కెడు బువ్వ వేస్తే ఒక దెబ్బ కొడతాడు. కడుపు నిండా ఎవరు బువ్వ పెట్టరు చిన్న పిల్లల దగ్గర పోతేనే ఇంత గింజలు దొరుకుతాయి. ఈ అమ్మ ఈ బతుకు నాకు ఎందుకు. కుక్క మల్ల  భగవంతుని కాడికి పోయిందంట భగవంతుడు వద్ద ఈ బతుకు బతకలేను ఆయుష్షు తగ్గించమని అడిగిందంట. నీకు 20 ఏళ్ల వయసు తగ్గిస్తున్న బతుకు పో అని చెప్పాడంట కుక్క వెళ్లి పోయేసరికి నరుడు అక్కడనే ఉండు పోత లేడంట ఏందిరా నరుడా నీకు ఏ పాటి వయస్సు కావాలి రా నీకు, ఇంకా వయసు కావాలి స్వామి అని నరుడు అన్నాడంట. అయితే ఈ కుక్క వయసు కూడా నీకే ఇస్తా తీసుకుపో అన్నాడంట.

భగవంతుడు నాకు ఇక చాలు నేను వెళ్లిపోతా అన్నాడంట. ఈ నరుడు అందరి వయసు తీసుకొని మరి ఎట్లా బతుకుతాడో నరుడుకి 40 ఏళ్ళ వయస్సు భగవంతుడు ఇచ్చాడు. అయితే ఎలా కానీ నరుడకి మంచి సుఖం తరువాత ఆవు లాగ పిల్లలు చేయాలి. ఇట్లా కథలు కథలు ఉంటుంది. ఆవుకు ఎంత కష్టం వచ్చిందో అంత కష్టం నరుడికి వచ్చింది  తరువాత గాడిద మోత మొత్తం మోయాలి పిల్లల పెళ్ళిళ్ళు చేయాలి వాళ్ళ పిల్లల్ని చూడాలి. ఆవు వయసు 20 గాడిద వయసు 20 వయస్సు 40 మొత్తం 80 ఏళ్ళు బాధలు భరించాలి. తరువాత కుక్క వయసు ఇంకా బాధలు వస్తాయి పెద్ద కొడుకు రానీయడు చిన్న కొడుకు రానీయడు ఏదైనా ఒకటి అంటారు. దగ్గరికి రానీయరు మంచిగా చూడరు బిడ్డ కూడా ఆయల నన్ను తిట్టినావు అని చెప్పి వాళ్లు కూడా పెట్టరు. లాస్ట్‌కి లేనిపోనీ కష్టాలు కుక్క బతుకు అంటారు నరుడుకి మొత్తం వంద సంవత్సరాలు కష్టాలు పడాలి.

**నీతి :** నరుడు ఆయుష్షు కోసం అత్యాశపడి లేనిపోని కష్టాలు కొని తెచ్చుకున్నాడు.

*కథ చెప్పినవారు : కశ్న నాయక్*

*వయస్సు : 85 సం॥లు*

*బ్రాహ్మణపల్లి, నాగర్ కర్నూల్*

సేకరించినవారు :
**జె.హరిణి యాదవ్**
1058-22-111-013
2వ సంవత్సరం (B.A) EPP

# 17. అత్యాశ - దురాశ

ఒక ఊర్ల కొంటెల్కా (కొంటి ఎలుక) , మంచెల్కా(మంచి ఎలుక) ఉండేనంట, ఉంటే అడనే ఉన్నా మామిడి చెట్టుకు మస్తు మామిడి పండ్లు కాసినాయంట, కాస్తే మంచెల్కా ఉర్కి మామిడి చెట్టు ఎక్కెనంట, దాన్ని చూసి కొంటెల్కా సగానికీ ఎక్కిందంట ఎక్కి కింద పడ్డదంట. ఇగ చెట్టెక్కిన ముంచెల్క మంచి మంచి మామిడిపండ్లు తింన్నదంట.

ఇగ కొంటెల్కా, మంచెల్కా! మంచేల్కా! నాక్ ఓకా పండేయవ అందంట. ఐతే మంచెల్క నేను తినలేకనా, నీకెందుకు అన్నదంట. ఐతే కొంటెల్కా మల్లి మంచేల్కా! మంచేల్కా! నువ్వ్ తినేష్ణ తోల్ అన్నా ఏయ్యి అంటదంట. ఐతే నీకు వేస్తే తోలు నేను తినలేకనా అని అంటదంట ఇగ చేసింది యామి లేకా కొంటెల్కా ఉల్టా పోతాదంట పోంగ, పోంగ, ఒక చిన్నా గుట్ట ఎక్కుతదంట ఎక్కితే ఒక్క చిన్న రూపాయి దొర్కుతాదంట. పెద్ద గుండు ఎక్కిందంట పెద్ద రూపాయి దొరికిందంట. మళ్ళా అట్లే పోంగ పోంగ బాయి దగ్గరకు పోయిందంట బండేడ్లు దొరికాయంట, ఇగ అట్లే పోంగ పోంగ పెద్ద పుట్టొచ్చిందంట. ఇగ పుట్ట కాడికి పోయిందంట పోయి పుట్టల చెయ్యి పెట్టిందంట పుట్టెడు పైసలోచినయంట.ఇగ అన్నీ బండ్లెడ్లా పోస్కోని గల్లా గల్లా అంకుట బయల్దేరిందంట ఇగ పొతుంటే మంచెల్కా ఎదురు అయిందంట.

ఇగ మంచెల్కా ఇట్ల అంటది కొంటెల్కా! కొంటెల్కా! యాడ తెస్తివి నువ్వ రూపాయలు అంటదంట. అయితే కొంటెల్మా యేంటికి నీకు ఎందుకు చెప్పాలె నాకు ఒక్క పండు ఇయ్యలేదు, నీకు నేను చెప్పా అంటదంట. చెప్పు కొంటెల్కా చెప్పు అని అనగ, కొంటెల్కా జరిగిన విషయం మంచెల్కాకు చెప్తదంట. అవునా కొంటెల్కా అయితే నేను కుడా పోతా అని మంచెల్క చిన్న గుండు ఎక్కిందంట చిన్న తేలు కరిసిందంట. పెద్ద గుండు యెక్కిందంట పెద్ద తేలు కరిసిందంట. ఇగ ఆఖరికి పోంగ పోంగ

పుట్టొచిందంట. పుట్టల చెయ్యి పెట్టిందంట, పెద్ద పాము కరిసిందంట. ఇగ మంచెల్క సచ్చిపోయిందంట.

**నీతి :** కాలం ఎప్పుడు ఓకెలా ఉండదు ఇవ్వాళ మన దగ్గర ఎంతైనా వుండొచ్చు కాని అది ఎప్పటికి శాశ్వతం కానే కాదు.

నేను నేర్చుకున్న విషయాలు :

- కుదిరితే ఇతరులకు సహాయం చెయ్యాలి.
- కాలంతో పాటు మనం కుడా మారాలి.
- ఉన్నా దాంట్లో సంతోషపడాలి.
- అత్యాశ దురాశ

**ముగింపు :**

ఇతరులు కష్టాలో ఉన్నపుడు మనం సహాయం చెయ్యాలి. ఎందుకంటే కాలం ఎప్పుడు ఒకేలా ఉండదు ఇవ్వాళ మనం ధనవంతులం ఉండచ్చు కాని రేపు మన పరిస్థితి యేంటో మనకూ రవ్వంత కూడా తెలియదు.

*కథ చెప్పినవారు : లక్ష్మమ్మ*
*వయస్సు : 60 సం॥లు*
*కిస్మత్‌పూర్, రంగారెడ్డి*

# 18. సీతారాముల వారికి సంబంధించిన ఒక చిన్న కథ....

నా పేరు గుట్ట నరసింహ. నాది గండి చెరువు గ్రామం, రంగారెడ్డి జిల్లాలో నివసిస్తున్నాను. నా భార్య పేరు కలమ్మ. మా నాన్న పేరు మాసయ్య. మా అమ్మ పేరు మల్లమ్మ. నేను ఒక సీతారాముల వారికి సంబంధించిన కథ చెప్పబోతున్నాను. ఈ కథలో ఒక

రాములవారు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయులు, ఒక గొల్లోడు ఉన్నారు. ఐదుగురు ఉండగా, ఒక బాపనోడు వీళ్ళ కాడికి వస్తడు అందుకు ఉండు అంటాడు. బాపనాయన రోజు ఆడికి వస్తా ఉంటాడు, పెడతా ఉంటాడు, పూజ చేస్తూ ఉంటాడు, ఆ రాతి విగ్రహాలు. ఆ రాతి విగ్రహాలు ఏవో కావు రాములవారు, సీతమ్మ, లక్ష్మణుడు ఆంజనేయుడు.

ఒకనాడు కాశి పోతున్నాడు. బాపనాయన కాశీకి పోయిండు. ఈడు వచ్చేందుకు నెల అవుతుంది. నెల రోజులు నడుచుకుంటూ పోతుండు. అప్పుడు ఈ బాపనోడు రాములవారు వీళ్ళు భోజనం చేస్తున్నారు కదా చేస్తుంటే ఏం జరిగిందంటే ఈ గొల్ల ఆయనకి ఏం తెలియక వీళ్ళ ముంగట ఇస్తరాకులు పెట్టి, బువ్వ పెట్టి, అన్నం వండి పెట్టి తినండి అయ్యా, తినండి అయ్యా వాళ్ళు తినరు ఇక, మెడ కోసుకుంటా, తాటి మట్టలు తెచ్చుకుంట అని మొదలు పెట్టాడు. ఈ గొల్లోడు రాములవారు గొల్లోని తాటికి ఏం చెయ్యలేక దర్శనం అయ్యారు.

రాములవారు నిజరూపాలు వచ్చినాయి. ఇక అందరూ కూర్చున్నారు. కూసోని అందరూ భోజనం చేశారు. ఈడు తిన్నాడు గొల్లోడు కూడా. తిని అయ్యా వట్టిగుంటే మంచిది కాదు, రోజుకు ఈ సీతమ్మ ఏం చేస్తాందయ్యా, ఈడనే ఉండాలి. ఈ సీతమ్మ వండాలి. ఇదిగో ఈ లచ్చయ్య మాత్రం నీళ్ళు తీసుకురావాలి, తోకయ్యా అంటే ఆంజనేయులు కట్టెలు తీసుకురావాలి, నేను పొయ్యి అడుక్కు వస్తా అని గొల్లోడు అంటాడు. మీరు వండాలి అమ్మ, మీరు పెట్టాలి మాకు. సరే అని ఒప్పుకున్నారు. వాళ్ళు ఒప్పుకొన్నాక ఇలా కథ నడుస్తూ ఉంటుంది. ఇక బాపనోడు కాశీకి వెళ్ళి పోయిండు. వెళ్ళిపోయినంగా తరువాత ఇక రోజు వండి పెడతాంటే ఇగా నెలలు

నడుచుకు పోతుండు. 30 రోజులు అవుతది. ఆడు కాశిలా అడుగుపెట్టబోతుండు. ఆ సమయంలో ఇక్కడ ఒక కాపోడు గొల్లవానికి చెంబుడు పాలు పోసిండు. పోసి ఏమన్నాడంటే, కొన్ని రామునికి పోయ్యరా, ఓ గ్లాసు బాపనోనీకి తాపారా అన్నందుకు ఈ గొల్లోడు ఏం చేసిండు. వచ్చి తీసుకొచ్చి గ్లాసు రాముడికిచ్చి, నేను జర బాపనాని దగ్గరికి పోయిస్తా అని చెప్పి ఆ పాలు పట్టుకొని గ్లాసు తీసుకొని పోతున్నా ఇక మీరైతే తినండి, నేను మళ్ళీ వస్తా అని చెప్పిండు. ఇంకా గొల్లోడికి తెల్వక పోతుండు. బాపనాయన 30 రోజులు నడుచుకుంటూ పోయిన సంగతి కూడా గుర్తు లేదు వీనికి, పోతున్నాడు గొల్లోడు. పోతున్నాడు సరే ఎంత దూరం ఉంది.

జల్ది పోయివస్తా అన్నాడు గొల్లోడు. ఈడంగా ఊరు దాటి గ్లాస్ తీసుకొని పోతున్నాడు గొల్లోడు. సరే అని రాములవారు ఆంజనేయులకు చెప్పిండు. గొల్లాయనను తీసుకుపోయి ఆ బాపనోనికి గ్లాసు పాలు ఇచ్చి వెనుకకు మళ్లీ రాపో అన్నాడు. సరేనని ఊరంతా లేనప్పుడు ఒక దగ్గరికి రా అని ఆంజనేయుడు గొల్లోడికి చెప్పిండు. హేయ్ నువ్వు నన్ను ఏడ ఎత్తుకుంటావు నీకు చేత కాదు. నేను ఉన్నట్లు, నువ్వు ఎట్లున్నవయ్యా అన్నాడు గొల్లోడు. అట్లాకాదు నువ్వు రావయ్య నేను మోస్తా, తీసి భుజం మీద వేసుకొని కాశికి తీసుకుపోయిండు. దూప అవుతుంది అప్పుడే ఎవరైనా కలిస్తే బావుండు అని అక్కడ, ఇక్కడ చూస్తుండు బాపనోడు. అప్పుడే ఆంజనేయులు ఆ గొల్ల వాడిని అక్కడ దించిండు ఆంజనేయుడు. గొల్లోడు పాలు తీసుకుని బాపనోనీ దగ్గరికి పోయిండు. ఇగ వటయ్య అని పాలు బాపనానికి ఇచ్చిండు. ఒకటే సారి వెంటనే ఆ పాలు తీసుకొని తాగేసాడు. బాపనోడు తాగినాక ఎట్లా వచ్చినావురా అని అడిగిండు. తోకయ్య ఎత్తుకు వచ్చిండు అని అన్నాడు. అగోడి ఆ చెట్టుమీద కూర్చుండు అని అన్నాడు. ఏడి నాకు కానోస్తా లేడు. నీకే కానోస్తుండు అని అంటుండు. ఇగ నన్ను పిలుస్తుండు ఇగ నేను పోత అని అంటాడు గోల్లోడు. మళ్ళీ ఆంజనేయులు గోల్లోడిని ఎత్తుకొని దించిండు.

మళ్ళీ యధావిధిగా 30 రోజులు వండుకొని తింటాడు. ఇలా జరుగుతూనే ఉంటుంది. మళ్ళీ నడుచుకుంట వస్తుండు. 30 రోజుల నాడు వచ్చి పాత పూజలెక్క పక్క ఊరి నుంచి వచ్చి అడొచ్చి, ఊరికి వెళ్ళి భిక్ష తీసుకొని వండుకున్నాడు, తిన్నాడు. మళ్ళీ దర్వాజా పెట్టుకున్నాడు. పూజ చేసుకుంటుండు, ఏమయింది అయ్యా గట్ల దర్వాజా పెట్టుకొని పూజ చేస్తావు. నిన్న మొన్న అందరం యధావిధిగా తినేవాళ్ళం.

సీతమ్మ, రాముడు, లచ్చయ్య, తోకయ్య అందరం కూర్చొని ఐదుగురం ఇస్తారాకులు వేసుకొని భోజనం చేసేవాళ్ళము ఈ రోజు నువ్వు దర్వాజా పెట్టుకుంటావు ఏందయ్యా, తియ్యి దర్వాజా, తియ్యవయ్యా అని వీడు అంటాడు గొల్లోడు. అంటుంటే అమ్మ నీకు తెలవదురా ఉకో, ఆల్లు ఎట్లా తింటార్రా. విగ్రహాలు తింటాయారా అని వీడు అంటాడు. లేదు తింటారు గదా అని వీడు బాపనోడు అంటాడు. ఇగ చూపిస్తారా అని తాటి కొమ్మలు తెచ్చుకొని మెడకు చుట్టుకొని తినమని బతిమిలాడుతాడు. మెడను కోసుకుంటా, కోసుకుంటా అడుగుతాడు. సరే అని ఇక రాములవారు. అప్పుడు ఈనీ కోసమని బాపనోనికి దర్శనం ఇవ్వాలని మనుషులు అయ్యారు సీతారాములవారు. అప్పుడు ఈడే దేవుడిని గోల్లోని కాళ్ళు బాపనోడు పట్టుకుంటాడు. నా కాళ్ళు పట్టుకుంటావా అని గొల్లోడు, గొల్లోడు బాపనోడు పట్టుకుంటాడు. నువ్వు కాళ్లు పట్టుకుంటావా, నువ్వు నా కాళ్ళు పట్టుకుంటావా. ఇక నీకు నాకు ఏం పంచాయితీ వద్దు, అని ఊరుకుంటారు. ఎప్పటిలాగా విగ్రహాలుగా మారారు ఇగ కథ ఇంతే.

**ముగింపు :** ఇలా కథలు సేకరించడం వల్ల మనకి ఎన్నో విషయాలు తెలుస్తాయి. పాత కథలు తెలుసుకోవడం, వాటి యొక్క విలువలు, సంస్కృతి, ఒక మంచి పద్ధతి తెలుస్తుంది. పెద్దల నుండి వచ్చిన కథలు మనకి ఇంకా ఎందరికో తెలుస్తాయి. ఇలా పెద్దల నుండి కథలు సేకరించడం నాకు ఉత్సాహంగా, సంతోషంగా అనిపించింది. ఈ కథలో నేను తెలుసుకున్నది ఏమిటంటే నీతి నిజాయితీ ఉన్న వారికి ఆ రాతి విగ్రహాలు అంటే దేవుడు దర్శనం ఇస్తాడు. అలా కపటం లేని వాడు కాబట్టి ఆ కపటం లేనివాడికి దర్శనం దొరికింది.

తేదీ: 22-09-2022

*సేకరించినవారు :*

**కె. ధరణి**

B.B.A

క్రమ సంఖ్య: 1058-22-684-026

# 19. గాడిద గుర్రం

పూర్వం సిద్దయ్య అనే వ్యాపారి ఉండేవాడు. అతడు తన సరుకులను పొరుగూరిలో అమ్ముకొనేవాడు. అలాగే ఒకసారి తన సరుకులను అమ్మడానికి తన సరుకునంతా గాడిద మీద పెట్టుకొని అతను గుర్రం ఎక్కి పొరుగూరుకి బయల్దేరాడు.

అలా చాలా దూరం ప్రయాణం చేసాక, బరువు మోస్తున్న గాడిదకు ఆయాసం వచ్చి, గుర్రం యొక్క సహాయం అడిగింది. గాడిద గుర్రంతో ఇలా అంది," నాకు సరుకు మొత్తం మోయడానికి కష్టంగా ఉంది. ఒక పావు బరువు నువ్వు మోస్తావా?" అని అడిగింది.

అప్పుడు గుర్రం ఇలా అంది, "అది నా బాధ్యత కాదు, బరువులు మోయడం నీ పని, సుఖంగా జీవించడం నా పని" అన్నది.

చివరికి బరువు మోయలేని గాడిద, నడుము విరిగి క్రింద పడింది. వెంటనే వ్యాపారి గాడిదను అక్కడే వదిలేసి ఆ బరువు మొత్తం గుర్రం పైన వేసి తనూ ఎక్కి ప్రయాణం సాగించాడు.

అప్పుడు గుర్రం "ఆ కొంచెం బరువును ముందే మోసి ఉంటే ఈ గాడిద బరువు తప్పేది" అని మనసులో బాధపడింది.

**నీతి:** బరువు పంచుకుంటే బ్రతుకు బరువు తగ్గుతుంది

*కథ చెప్పినవారు : నర్మద*

*వయస్సు : 42 సం॥లు*

*హైదరాబాద్*

**కే ప్రణీత**
బి.బి.ఏ సెకండియర్
రూల్.నెం. : 1058-22-684-043

# ౨౦. దేవుడే కాపాడుతాడు

అనగనగా ఒక నది గట్టున ఒక ఊరు ఉండేది. ఊర్లో జనాలంతా ప్రశాంతంగా కలిసికట్టుగా ఉండేవారు. ఆ ఊర్లో ఒక గుడి ఉండేది రోజు గ్రామ ప్రజలు ఆ ఊర్లో పూజలు చేసేవారు గుడిలో పూజారిని ఆదరించేవారు. అలాంటి పండంటి ఊర్లో ఒక సంవత్సరం తీవ్రంగా వర్షాలు పడ్డాయి, నది పొంగి వరదలు వచ్చాయి ఊరంతా నీళ్ళు నిండిపోవడం మొదలయ్యింది. ఊర్లో ఉన్న వారంతా వరద నుంచి తప్పించుకోవడం కోసం తమ ఇళ్ళను వదిలేసి వెళ్ళిపోయారు. ఆ జనంలో ఒక పెద్ద మనిషి గుడికి వెళ్లి పూజారిని కూడా తమతో రమ్మని అడిగాడు, ఊళ్ళోకి వచ్చేసాయి ఇంటి గడప దాకా నీళ్ళు ఉన్నాయి పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉంది మీరు కూడా మాతో పాటు రండి. పూజారి ప్రశాంతంగా నా గురించి దిగులు పడకుండా నేను నిత్యం సేవించే నా స్వామి నన్ను కాపాడుతాడు మీరు వెళ్ళండి అన్నారు ఆ మాట విని ఆ పెద్దమనిషి వెళ్లిపోయాడు. కొంతసేపటికి నీళ్ళు నడుము దాకా వచ్చేసాయి పూజారి గారు గుడి గుట్టున నించొని జపం చేసుకుంటుంటే ఒక పడవలో పోతున్న వారు కొంతమంది ఆగి పూజారి గారిని కూడా బండి ఎక్కమన్నారు కానీ ఆ పూజారి గారు నేను రాను నన్ను దేవుడే కాపాడుతాడు అని గుడిలోనే ఉండిపోయారు. ఇంకొంత సమయానికి నీళ్ళ మెడ దాకా వచ్చేసాయి పడవలో ప్రయాణం చేస్తూ కొందరు చూసి వారితో వచ్చేయమని బ్రతిమిలాడుకున్నారు. మీరు ఇంకా ఇక్కడే ఉన్నారా, మీరు ఇక్కడ ఉండడం చాలా ప్రమాదం నీళ్ళ చాలా వేగంగా వచ్చేస్తున్నాయి కాబట్టి మీరు మాతో రండి అన్నారు.

కానీ వారితో కూడా పూజారి మీరు వెళ్ళండి నన్ను ఆ దేవుడే కాపాడుతాడు అన్నాడు. ఊరంతా నదితో నిండిపోయింది చలితో వణుకుతున్న ఆ పూజారి ముక్కు దాకా నీళ్ళు వచ్చేసాయి ఇంకా కంగారు పడ్డాడు అతి త్వరలో గుడి మొత్తం నీళ్లతో నిండిపోతుంది. పూజారి గారు దేవుడిని కాపాడుమని వేడుకుంటున్నాడు గుడి గోపురం ఎక్కి కూర్చున్నాడు కొంతసేపటికి దిగులు మొదలైంది ఆ వాన ఆగట్లేదు అలాగే నది

ప్రవాహం చాలా ఎక్కువగా ఉంది. దేవుడా ! నేను నీకు ఏమి తక్కువ చేశాను రోజు శ్రద్ధగా పూజలు చేస్తున్నాను కదా నిన్నే నమ్ముకున్నాను అయినా నన్ను కాపాడ్డానికి రావట్లేదు ఎంతమంది వచ్చి అడిగినా నేను నీ పేరే చెప్పుకొని ఉన్నాను. అప్పుడు దేవుడు ప్రత్యక్షమయ్యాడు ఒరేయ్ మూర్ఖుడా నీకు మనిషిని పంపించాను. పడవని పంపించాను! నువ్వే రాకుండా ఇక్కడ తిష్ట వేసి కూర్చున్న మళ్ళీ నన్ను గుర్తు పట్టలేదు అది నా తప్పు ఎలా అవుతుంది అని తిట్టాడు దేవుడు. అప్పుడు పూజారికి వెంటనే జ్ఞానోదయం అయింది చేసిన పొరపాటు గ్రహించి క్షమాపణ కోరాడు కొంతసేపటికి మరో పడవలో కొంత మంది కనిపించారు పూజారి గారు! మీరు ఇక్కడే ఉన్నారని తెలిసింది నాతోపాటు రండి ఇక్కడ ఉండడం చాలా ప్రమాదకరం అని అన్నారు. పూజారి గారు మరో మాట మాట్లాడుకోకుండా పడవ ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు.

**ముగింపు**

నాకు ఈ కథ చెప్పేటప్పుడు చాలా బాగా అనిపించింది. ఈ కథను బట్టి నాకు ఒక విషయం అర్థమైంది దేవుడనేవాడు ఏ రూపంలోనైనా వస్తాడు దేవుడు ఎప్పుడు నగలతో ఆడంబరాలతో ప్రత్యక్షం కాదు. కాబట్టి మనం ఏ ఆపదలో ఉన్న మనుషుల రూపంలో దేవుడు వస్తాడు.

*కథ చెప్పినవారు : సక్కుబాయి*

*వయస్సు : 78 సం॥లు*

*ఖమ్మం*

సేకరించినవారు :
**ఎన్. మనస్విని**
సెకండియర్ బీకామ్ (బి.ఎ)

# 21. కొమురవెల్లి మల్లన్న కళ్యాణం

మల్లన్న దేవుడు కళ్యాణం చేసుకోవాలనుకున్నప్పుడు స్వామి బండారులో తన కళ్యాణం జరగాలి అనుకున్నాడు. అప్పుడు, స్వామి తన అక్క అయిన ఎల్లమ్మ తల్లి వద్దకు వెళ్ళి ఈ విషయాన్ని చెప్పగా ఎల్లమ్మ తల్లి చెప్పారు. తుర్క రాజ్యం అయిన మక్కాలో బండారు ఉందని జాడ తెలుపుతుంది. అప్పుడు స్వామి తుర్క రాజ్యానికి వెళ్ళి, అక్కడి రాజును పని ఇవ్వమని అడుగుతాడు. రాజు పేరు అడగగా తుర్క 'మిల్లు సాహెబ్' అని చెప్తాడు. రాజు వారి తోటలో తోటమాలిగా పని ఇస్తాడు. అదే తోటలో బండారు గడ్డ ఉంటుంది. స్వామి రోజూ ఆ పూలకి నీరు పోస్తూ ఉంటాడు పూలు బాగా పూస్తాయి. ఒక రోజు స్వామి రాజుకు మంచి రుచికరమైన మాంసం కూర మరియు మద్యం పెట్టి, వాళ్ళు మత్తులోకి జారుకోగానే బండారు తీసుకొని బయలుదేరతాడు. స్వామి వెళ్ళగానే పూలన్నీ ఎండిపోతాయి. అది చూసిన రాజు మోసం చేశాడని తెలిసి స్వామికై వెతకగా దొరకడు. స్వామి కోరిక మేరకు బండారుతో కళ్యాణం చేసుకుంటాడు...

**ముగింపు :**

నాకు ఈ కథ ద్వారా మా అమ్మమ్మతో కలిసి "మల్లన్న కళ్యాణం" కథ తెలుసుకోగలిగాను!!!

*సేకరించినవారు :*
**పోలేని వాహిత**
BBA 3rd, సెమిస్టర్
రూల్ నెంబర్ : 1058-22-684-055

# 22. ఎద్దు గర్వం

**కథ ప్రారంభం :**

ఒక ఊరిలో ప్రతి సంవత్సరం దేవుడిని ఊరేగింపు తీసుకెళ్ళే సాంప్రదాయం ఉండేది. ప్రతి సంవత్సరం ఊళ్ళో వారంతా పండగ చేసుకుని, పూజలు చేసి, ఊరేగింపు కోసం అన్ని వీధులు శుభ్రం చేసి, ముగ్గులతో, తోరణాలతో, పువ్వులతో, చాలా అందంగా అలంకరించేవారు.

ఊరేగింపుకు ఒక ఎద్దు బండి కట్టేవారు. ఆ బండిని కడిగి, పసుపు రాసి, బొట్లు పెట్టి, పూలు కట్టి దాన్ని కూడా అందంగా అలంకరించేవారు.

మరి ఆ బండిని తోలే ఎద్దు సంగతి చెప్పాలా? ఊళ్ళో అన్నిటికన్నా ఆరోగ్య వంతంగా, బలంగా ఉన్న ఎద్దును ఎంచుకునేవారు. ఆ ఎద్దు చర్మం నిగనిగలాడేలా దానికి స్నానం చేయించి, బొట్లు పెట్టి, గంటలు కట్టి పట్టు వస్త్రాలు వేసేవారు. ఆహా! చాలా చూడ ముచ్చటగా తయారు చేసేవారు.

ప్రతి సంవత్సరంలా ఈ సంవత్సరం కూడా ఊరేగింపుకు ఊరు తయారయ్యింది.

రాముడు అనే ఒక ఎద్దును ఎంచుకున్నారు. బాగా తయారు చేసి, బండి కట్టారు. గుడి ముందర నుంచోపెట్టి, దేవుడి విగ్రహాన్ని బండిలో పెట్టి, హారతి ఇచ్చి ఊరేగింపు మొదలెట్టారు.

ఆ రోజంతా రాముడు ఎక్కడికెళ్తే అక్కడ మనుషులు వంగి, నమస్కారాలు పెట్టారు, వెర్రి రాముడు ఇదంతా తనకి చేస్తున్న సత్కారం అనుకుని భ్రమ పడ్డాడు. రోజంతా చాలా గర్వంగా, పొగరుగా, కొమ్ములు పైకి పెట్టి, ఛాతీ బయిటికి పెట్టి నడిచాడు. తనలో తానె మురిసిపోయి, పొంగిపోయాడనుకోండి!

ఇక సాయంత్రంతో మళ్ళీ ఊరేగింపు గుడికి చేరింది. ఎదురు సన్నాహంతో, బాజా బజంత్రీలతో, గ్రామ ప్రజలు తమ దేవుడి విగ్రహాన్ని బండిలోంచి దింపి లోపలి తీసుకుని వెళ్ళారు.

విగ్రహం బండిలోంచి దిగంగానే ఇంకేముంది? అందరు రాముడిని మర్చిపోయారు. ఎవరి పనుల్లో వాళ్ళు పడిపోయారు. రాముడి పై వేసిన పట్టు వస్త్రాలు తీసేసి మళ్ళీ రాముడిని ఎడ్ల పాకలో తీసుకుని వెళ్ళి అక్కడ వదిలేశారు. ఎవ్వరు దండాలు పెట్టలేదు.

అప్పుడు రాముడికి అర్ధమయ్యింది. మనుషులు గౌరవం ఇచ్చేది మనకి కాదు, మనం చేసే పనులకని.

కథ ముగింపు.......

*కథ చెప్పినవారు : పోలేని సుగుణమ్మ*

*వయస్సు : 60 సం॥లు*

*సేకరించిన వారు:*
**కె. శ్రీనిధి**
రూల్ నెంబర్ : 105822405097
బి.కామ్ కంప్యూటర్ అప్లికేషన్

# 23. నక్క దురాశ

అనగనగా ఒక అడవిలో పులి ఇంకా ఆవు ఉండేది. అవి రెండు మంచిగా కలిసి మెలిసి ఉండేవి. ఆవు గడ్డి తినేది, మాంసం దొరికిన చోటల్లా పులి తినేది. మళ్ళీ రెండు వచ్చి ఒకటే దగ్గర పడుకునేవి. వాళ్ళన్ని గమనిస్తున్నా నక్క బావ చూసి వాహ్ వాహ్.. ఈ ఆవు ఏంది, ఈ పులి ఏంది రెండు జంటకు ఉండుడు, కలిసి ఉండుడు ఏంది అని అసూయ పడ్డడు. ఎలాగైనా ఇద్దరికి పోటీ పెట్టాలె అని నక్కబావ మనుసులో అనుకున్నాడు ఇలా వాళ్ళ ఇద్దరికి గొడవ పెట్టేయాలి అని.. అప్పుడూ నక్క బావ పులితో ఆవుకు తెలియకుండా ఇలా అన్నాది పులి బావా! పులిబావ నిన్ను ఆవు కొమ్ములతో పొడిసి చంపుతది అంటా, పులికి తెలియకుండా ఆవుకి చెప్పింది, ఇలా నిన్ను పులిబావ కోరికి తింటడంట, అని నక్కబావ వారి ఇద్దరికి సిచ్చుపెట్టింది. ఇగా వారు మాట్లాడుకోడం లేదు ఒక్కరికి ఒకరు చూసుకోవడం లేదు. వారిని చూస్తున్నా నక్కబావ ఏంటి ఇంకా గొడవ పడుతలేరు అని ఇగ నక్కబావనే పులి తోకను కొరికింది. పులి పోయి ఆవు మీద పడిపోయింది. ఇగ వారు ఇద్దరు గొడవ పడ్డరు. ఆవు కొమ్ములతో పొడవడం, పులి గోరులతో గీక సాగింది.. రెండూ చాలా బలంగా ఉండేవి. ఇగ వారు ఇద్దరు గొడవతో ఇద్దరు మరణించారు. వారి మరణం చూసి నక్కబావ సంతోషంతో ఎగిరింది. నక్కబావ ఎగిరేది మిగిలిన నక్కలు చూసాయి. మిగితా నక్కలు అడుగాయి ఎందుకు ఎగురుతున్నావ్ అని, అపుడు నక్కబావ నా దగ్గర రెండు ఉన్నాయి తినడానికి ముందు ఏది తినాలి అని ఎగురుతున్న అని జవాబు చెప్పింది. మిగితా నక్కలు అంటాయి మేము ఉన్నాం కదా మేము కూడా తింటాం అని చెప్తాయి. తినడానికి నక్కబావ ఒప్పుకోలేదు. మీరు అందరూ నన్ను ఊరేగించాలి అపుడే మీరు దీన్ని తినొచ్చు అని నక్కబావా కండిషన్ పెట్టింది. మిగితా నక్కలు అందరు కలిసి నక్కబావ నాలుగు కాళ్లు కట్టి ఖోన్ ఖోన్ అంటూ ఊరేగించారు. పొరపాటున కింద పడిపోయాడు. ఒక మనిషి ఒచ్చి అయ్యో నక్క చచ్చిపోయింది

కదా అని అనుకుంటాడు. కాని నక్కబావ పడుకున్నాడు. అయితే మనిషి వాళ్ళ ఇంటికి తీసుకొని పోయి కాళ్ళు కట్లు విప్పుతాడు. కాళ్ళు కట్లు విప్పంగనే నక్కబావ చెంగుమని పారిపోయింది. మనిషి ఇంట్లో నుంచి బయిటికి వచ్చే లోపు నక్కబావ బయిటలేదు ఏంది నక్క చచ్చిపోయింది అనుకున్న కానీ బ్రతికే ఉందా అని అనుకున్నాడు. పోనీ లే అని మనిషి వదిలేస్తాడు. తిరిగి నక్కబావ నక్కల సామ్రాజ్యం వచ్చి చూస్తే అని నక్కలు కలిసి తింటున్నాయి. నేను లేకుండా తింటారా అని తిట్టుకుంది. చివరికి పులిని, ఆవునీ అన్ని నక్కలు కలిసి తిన్నాయి.

**నీతి :** దురాశ దుఃఖానికి చేటు

**ముగింపు :** తకథ చెప్పినందుకు మా అమ్మమ్మకి థాంక్స్, నా తమ్ముడుకి కూడా థాంక్స్ వాడు ప్రాజెక్ట్‌లో హెల్ప్ చేశాడు. నేను నా కుటుంబ సభ్యులు కలిసి మా విష్నూర్ ఊరుకి వెళ్ళాం. ఊరులో ఉండే వాతావరణం ఏంతో మధురంగా ఉ ంటుంది. చాలా ఎంజాయ్ చేశాను. మా అమ్మమ్మకి కథ చెప్పు అనగానే కథ చెప్పింది. చెట్టు కింద కూర్చొని కథ చెప్పింది. తను చాలా హ్యాపీగా ఫీల్ అయ్యింది. కథ నుండీ మనం నేర్చుకుంది ఏంటి అంటే ఎప్పుడు దురశా పడోద్దు పడితే దుక్కానికి చేటు అయితారు. నక్క లాగ ఎప్పుడూ దురశా పడోద్దు. నక్క వంకర బుద్ధి. ఈ కథ ద్వారా తెలుసుకున్నాను. బ్రతికిన అంత కాలం పది మందికి అన్నం పెట్టాలి, పుణ్యం తేచ్చుకోవాలి. అందరిలోని మంచినీ చూడడం నేర్చుకుంటే మనలోని మంచి కూడా పెరుగుతూంది. మా అధ్యాపకురాలు ఇలాంటి ప్రాజెక్ట్‌నీ అప్పగించినందుకు ధన్యవాదాలు. కొత్తగా అనిపించింది ప్రాజెక్ట్ ఆసక్తికరంగా ఉంది.

*చెప్పినవారు: వెంకటమ్మ*

*వయస్సు: 64 సం॥లు*

*విస్నూర్, వరంగల్*

*సేకరించినవారు :*
**ఆర్. పూజ**
B.com (BA)
క్రమ సంఖ్య: 105822538055

# 24. పల్లె ఎలుక -పట్నం ఎలుక

పల్లె ఎలుకను చూడాలని ఒక పట్నం ఎలుక ఊరికి వెళ్ళింది. పల్లె ఎలుక పొలంలో ఉండేది. తన దగ్గర ఉన్న శనగలు, గోధుమలు, వరి మొనగింజలు పట్నం ఎలుకకి పెట్టింది. పట్నం ఎలుక వాటిని తిని "మీరు ఈ పల్లెల్లో ఇలా గింజలు మాత్రమే తింటున్నారు. అందుకే నీవు టక్కుగా ఉన్నావు. పట్నంలో మేము ఎన్ని రకాలు తింటామో, ఎలా ఉంటామో చూద్దువు గాని రా!"అంటూ పిలిచింది.

ఒకరోజు పట్నం ఎలుకని చూడటానికి పల్లె ఎలుక వెళ్ళింది. ఒక ఇంటి వంట గట్టుమీద పాయసం ఉంది. ఆ పాయసాన్ని తినబోయయి ఇంతలో "మ్యావ్" అంటూ ఒక పిల్లి వాటి మీదకు దూకింది. అవి పొయ్యి వెనుక దాక్కున్నాయి.

అక్కడి నుంచి ఎలాగో తప్పించుకున్నాయి. ఇక ఆ పగలంతా అవి కలుగులోంచి బయటకు రాలేదు. రాత్రి అయింది. పట్నం ఎలుక మెల్లగా తలుపు సందులోంచి పల్లె ఎలుకని భోజనాల గదిలోకి తీసుకువెళ్ళింది. రకరకాల వంటలు బల్ల మీద ఉన్నాయి. అటువంటి విందు భోజనాన్ని పల్లె ఎలుక చూడలేదు."నువ్వు చెప్పింది నిజమే మా పల్లెలో ఇలాంటి భోజనాన్ని ఎప్పుడు తినలేదు అంది

ఎలుక ఇంతలో ఒక మనిషి వాటిని చూసి వెంట పడ్డాడు. దాంతో అవి తలుపు సందులోంచి అతి కష్టం మీద తప్పించుకున్నాయి. పొలంలో ఉన్న నా ఇళ్ళే నయం తినటానికి బ్రెడ్డు, జున్ను, వెన్న లేకపోయినా, ఇటువంటి భయం ఎప్పుడు ఉండదు" అంటూ తన పల్లెకు బయలుదేరి వెళ్ళింది పల్లె ఎలుక.

**నీతి:** మనకు ఉన్న దానితో సంతృప్తి పడాలి లేని దానికి ఆశపడితే కష్టాలు తప్పవు.

*చెప్పినవారు : లక్ష్మీనర్సమ్మ*
*వయస్సు: 70 సంllలు*
*పొచమ్మ పేట, నల్గొండ*

తేదీ:-06-09-2022

*సేకరించిన వారు:*

**ఎం.మహేశ్వరి**

B.A (EPP) 2ND YEAR, 3RD SEM

ROLL.NO.1058-22-111-024

# 25. కొంగ, జిత్తుల మారి నక్క

ఒక అడవిలో కొన్ని జంతువులు పక్షులు ఉండేవి అక్కడ ఒక చెరువులో కొంగ చేపలు ఏరుకొని తినేది. ఎవరైనా అడిగితే కాదనకుండా చేపలు పట్టి ఇచ్చేది. ఇలా అందరితో స్నేహంగా ఉండేది కొంగ.

పక్షులు జంతువులు అన్నీ కొంగను మెచ్చుకునేవి, ఒక నక్క మాత్రం పైకి స్నేహంగా నటిస్తూ లోలోపల కొంగపై అసూయ పెంచుకున్నది. దానిని ఎలాగైనా భంగపరచాలని అనుకున్నది నక్క. ఒకరోజు కొంగ వద్దకు వెళ్ళి రేపు మా ఇంటికి విందుకు పిలుస్తున్నాను కాదనకు మిత్రమా! అంటూ ప్రేమగా నటించింది నక్క

సరే మిత్రమా నీవు ఇంతగా పిలిస్తే కాదంటానా, అని ఒప్పుకున్నది కొంగ. మరుసటి రోజు కొంగ వెళ్ళేసరికి పాయసం, చేపల పులుసు కొన్ని రకాల వంటకాలు అన్నీ చేసి వెడల్పాటి పాత్రలో పోసి కొంగ కొరకు ఎదురు చూస్తున్నది నక్క.

కొంగను చూడగానే, రా మిత్రమా రా అంటూ ఆహారాన్ని చూపించింది. తిను అని చెప్పింది, కొంగ తినడం ప్రారంభించింది. కానీ కొంగకు వెడల్పాటి పాత్రలోని ఆహారం తినరాలేదు. అప్పుడు నక్క హేళనగా ఇలా తినాలి మిత్రమా చూడు అంటూ మొత్తం తినేసింది.

కొన్ని రోజుల తర్వాత నక్కకు బుద్ధి చెప్పాలని కొంగ నక్కను తన ఇంటికి విందుకు పిలిచింది. పొడవాటి పాత్రలో పాయసం పోసి తాగు మిత్రమా పాయసం చాలా బాగుంది అంటూ ఇలా తాగాలి చూడు నేను చూపిస్తాను అని తన ముక్కును పొడవాటి పాత్రలో పెట్టి పాయసం అంతా తాగేసింది కొంగ.

ఇంత రుచికరమైన పాయసం తాగలేక పోయావు మిత్రమా అంటూ హేళనగా నవ్వింది కొంగ.

నేను చేసిన దానికి సరిగా బుద్ధి చెప్పినది అనుకున్నది నక్క లోలోపల.

**ఈ కథలోని నీతి:** ఎదుటివారిని మోసం చేయాలనుకుంటే వారు కూడా మోసపోతారు.

*కథ చెప్పినవారు :*
*వయస్సు: 53 సం॥ లు*
*బూత్‌పూర్, మహబూబ్‌నగర్*

*సేకరించినవారు :*
**బి.పవిత్ర**
B.A, 2 ND YEAR

# 26. బ్రాహ్మడి మేక

అనగనగా ఒక ఊరిలో ఓ అమాయక బ్రాహ్మడు వుండేవాడు. ఆ బ్రాహ్మడు యజ్ఞంలో బలివ్వడానికి ఒక మేకను కొని తన ఇంటికి తీసుకుని వెళ్తుంటే ముగ్గురు దొంగలు చూసారు. ఆ మేకను ఎలాగైన దక్కించుకోవాలనుకున్నారు. ముగ్గురూ కలిసి ఒక పన్నాగమల్లారు. ఆ బ్రాహ్మడికి కనిపించకుండా ముగ్గురూ మూడు చోట్లకెళ్ళి నిలపడ్డారు.

మొదటి దొంగ, బ్రాహ్మడు వస్తుంటే చూసి ఎదురొచ్చాడు. వచ్చి, "ఆచార్యా, ఈ కుక్కను ఎక్కడికి తీసుకెళ్తున్నారు?" అనడిగాడు.

బ్రాహ్మడు "మూర్ఖుడా ! ఇది కుక్క కాదు, మేక" అని జవాబిచ్చాడు. "మేకను పట్టుకుని కుక్కంటాడేమిటి" అని ఆలోచిస్తూ తన దారిన కొనసాగాడు.

కొంత దూరమెళ్ళాక రెండవ దొంగ ఎదురై చాలా వినయమున్నట్టు నమస్కరించాడు. "ఓ బ్రాహ్మణా ! ఎందుకు కుక్కను మోస్తున్నారు?" అనడిగాడు. బ్రాహ్మడు చాలా ఆశ్చర్య పోయాడు. మేకను భుజాల మీంచి దించి చూసుకున్నాడు. "ఇది కుక్క కాదు, మేకనే. వీళ్ళిద్దరూ కుక్కంటున్నారేమిటి?" అని యోచనలో పడ్డాడు. దీర్ఘంగా ఆలోచిస్తూ మేకను మళ్ళీ భుజాల మీదకు ఎక్కించుకుని తన దారిన నడవడం మొదలుపెట్టాడు. కొంచెం దూరమెళ్ళాక మూడో దొంగ ఎదురయ్యాడు.

"అపచారం! అపచారం! ఈ నీచమైన కుక్కను మీరు మోయడమేమిటి? మీరు అశుద్ధమైపోయారు! " అన్నాడా దొంగ .

ఇంత మంది చెపుతుంటే అది మేక కాదు కుక్కే అయివుంటుందనుకుని ఆ బ్రాహ్మడు వెంటనే మేకను పక్కకు పడేసి శుద్ధి స్నానం చేద్దామని ఇంటి వైపుకు పరుగు తీసాడు. ఆ ముగ్గురు దొంగలు నవ్వుతూ మేకను సొంతం చేసుకున్నరు.

**నీతి:** ఎదుటి వారి మాటలు విని నీ నమ్మకాన్ని కోల్పోవద్దు.

*ధన్యవాదాలు: నాన్న గారికి*

*సేకరించినవారు :*
**బి.పవిత్ర**
B.A, 2 ND YEAR

# 27. నిజాయితీ

అనగనగా ఒక ఊరిలో కృష్ణయ్య అనే పేదవాడు ఉండేవాడు. అతను అడవిలో కట్టెలు కొట్టుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. ఒక రోజు ఆ ఊరికి సమీపంలో ఉన్న నది ఒడ్డున కట్టెలు కొడుతున్నా సమయంలో కృష్ణయ్య గొడ్డలి పట్టుతప్పి నదిలో పడిపోతుంది. తన జీవనాధారమైన గొడ్డలి నదిలో పడిపోయింది అని బాధపడుతూ నది ఒడ్డున కూర్చొని విచారిస్తూ ఉండిపోతాడు.

కృష్ణయ్య బాధపడడం చూసిన నదీదేవత కృష్ణయ్య ఎదుట ప్రత్యక్షమై ఏంటి కృష్ణయ్య అలా దిగులుగా ఉన్నావు అని ప్రశ్నిస్తుంది.

నేను రోజూ కట్టెలు కొట్టి వాటిని పట్టణంలో అమ్మితే గాని నాకు పూట గడవదు, ఇప్పుడు నాకు అన్నం పెట్టే నా గొడ్డలి నదిలో పడిపోయింది అని దిగులుగా సమాధానం చెపుతాడు. దీంతో నదీదేవత నదిలో నుంచి ఒక బంగారు గొడ్డలిని తీసి ఇదేనా కృష్ణయ్య నీ గొడ్డలి అని ప్రశ్నిస్తుంది. కాదు అని సమాధానం చెపుతాడు కృష్ణయ్య .

మళ్ళీ ఒక వెండి గొడ్డలిని తీసి ఇదేనా అని అడుగుతుంది. మళ్ళీ ఆ గొడ్డలి కూడా తనది కాదని చెప్తాడు కృష్ణయ్య. మళ్ళీ తను పోగొట్టుకున్న ఇనుప గొడ్డలిని చూపిస్తూ ఇదేనా నీ గొడ్డలి అని ప్రశ్నించగా తన గొడ్డలినీ చూసినా కృష్ణయ్య మిక్కిలి సంతోషించి అదే తన గొడ్డలి అని అంటాడు.

దీనితో నదీదేవత కృష్ణయ్య నిజాయితికి మెచ్చి కృష్ణయ్యకు ఆ మూడు గొడ్డళ్ళూ ఇచ్చి మాయమైపోతుంది.

**నీతి:** ఎప్పుడూ కూడా మనిషి నిజాయితీగా ఉండాలి. అలా ఉన్నప్పుడు, సహాయం చేయడానికి దేవతలు కూడా వెనుకాడరు.

*ధన్యవాదాలు: నాన్న గారికి*

**పొడుపు కథలు**

1. అన్నింటి కన్నా విలువైనది అందరికి అవసరమైనది ఏమిటి అది ?
2. తమ్ముడు కుంటుతూ మైలు నడిచే సరికి అన్న పరిగేత్తుతు పండెండు మైళ్ళు నడుస్తాడు ఏమిటి అది ?
3. ముల్లుకంచెలో మిటాయి పొట్లం ఏమిటి అది ?
4. అందమైన చిన్నది అందాల చిన్నది నువ్వు చూస్తే నిన్ను చూస్తుంది నేను చూస్తే నన్ను చూస్తుంది ఏమిటి అది ?
5. చాచుకొని సావిట్లో పడుకొనే ముసలమ్మ ముడుచుకొని మూలన నిలబడింది ఏమిటి అది?
6. కడుపులోన పిల్లలుకంటాం లోననిప్పులు, అరుపెమే ఉరుము, ఎరుపంటే భయం ఏమిటి అది?
7. కాటుక రంగు కమలము హంగు విప్పినా పొంగు, ముడిచిన క్రుంగు ఏమిటి అది?
8. రసం కానీ రసం ఏమి రసం ?

సమాధానాలు :

1. ప్రాణము
2. గడియారం ముల్లు
3. తేనే పట్టు
4. అద్దం
5. చాప
6. రైలు
7. గొడుగు
8. నీరసం

ధన్యవాదాలు.

*సేకరించిన వారు:*
**సి.హెచ్. ప్రత్యూష**
B.A (EPP) 2ND YEAR,
3rd SEM ROLL NO:-1058-22-111-081

# 28. ఏనుగు కుందేలు

ఒక అడవిలో ఏనుగు మరియు కుందేలు నివసిస్తున్నాయి. ఇద్దరు మంచి స్నేహితులు. ఇద్దరు కలిసి అడవిలో తిరుగుతూ ఉంటారు. వారిద్దరి స్నేహం గురించి అడవిలో అన్ని జంతువులకి తెలుసు.

ఒక రోజు వాతావరణం బాగుంది, ఆహ్లాదకరంగా ఉంది. ఆకుపచ్చ గడ్డి చాలా బాగుంది. కుందేలు మరియు ఏనుగు చాలా ఆహారం తిన్నాయి. రెండు విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, అవి సరదాగా ఒక ఆట ఆడదాం అని అనుకున్నాయి.

ఏనుగు మరియు కుందేలు ఏ ఆట ఆడాలో ఆలోచిస్తున్నాయి. మరియు ఆట ఆడటానికి ఒప్పుకున్నాయి. కానీ, పాత ఆట ఆడకూడదు, కొత్త ఆట ఆడాలి అని నిర్ణయించుకున్నాయి.

"పాత ఆటల కంటే ఒక మంచి కొత్త ఆట ఆడదాం నాకు ఒక ఆలోచన వచ్చింది". అని ఏనుగు కుందేలుతో చెప్పింది.

ఆట ఇలా ఉంటుంది "మొదట నేను కూర్చుంటాను, అప్పుడు నీవు నా పైన నుండి మరొక వైపు దూకాలి, ఆ తరువాత నీవు కూర్చోవాలి. అప్పుడు నేను నీ పైన నుండి మరొక వైపు దూకుతాను. కానీ ఈ ఆటలో, ఒకరినొకరు తాకవద్దు. నీవు నన్ను తాకకుండా మరొక వైపుకు దూకాలి." అని ఏనుగు ఆట యొక్క రూల్స్ చెప్పింది.

కుందేలు ఆట రూల్స్ వినగానే భయపడింది. కాని, స్నేహితుడికి ఆడాలని కోరిక ఉన్నందున, కుందేలు ఆట ఆడటానికి అంగీకరించింది.

మొదట ఏనుగు నేలమీద కూర్చుంది, కుందేలు పరిగెత్తుకుంటు వచ్చి ఏనుగు పైనుంచి మరొక వైపు తాకకుండా దూకింది. ఇప్పుడు ఏనుగు ఆడాల్సిన సమయం.

కుందేలు కూర్చుంది కాని, "ఒకవేళ ఏనుగు నాపైకి దూకితే నేను చనిపోతాను, నా జీవితం ఇంతటితో ముగుస్తుంది" అని భయపడుతుంది. ఏనుగు దూరం నుంచి పరిగెత్తుకుంటూ వచ్చింది. ఏనుగు పరుగెత్తటం వల్ల, కుడి ఎడమ వైపున ఉన్న కొబ్బరి చెట్లు కదులుతున్నాయి. అంతేకాకుండా కొబ్బరికాయలు పైనుండి విరిగి వాటిపై పడుతున్నాయి.

ఏనుగుకి ఏమీ అర్థం కాలేదు, అక్కడి నుండి పారిపోయింది. కుందేలు కూడా తన ప్రాణాలతో అక్కడి నుండి పారిపోయింది. ఏనుగు కంటే ఈ కొబ్బరికాయలు పడటం మంచిదని ఆలోచిస్తూ కుందేలు పారిపోతోంది.

"ఒకవేళ నా స్నేహితుడు ఇప్పుడు నాపై పడి ఉంటే, నేను చనిపోయి వుండే వాడిని, ఇలాంటి ఆటలు ఎప్పుడు ఆడకూడదు". అని కుందేలు ఊపిరి పీల్చుకుంది.

**నీతి:**

ప్రతి ఒక్కరికి నిజమైన స్నేహితుడు ఉండటం మంచిది, కానీ స్నేహితుడితో హాని కలిగించే ఆటలు ఎప్పుడు ఆడకూడదు.

మీ ప్రాణాలకు హాని కలిగించే, చావుకి దారి తీసే ఆటలు ఆడకండి లేదా పాల్గొనవద్దు.

స్నేహితులతో ఆటలు ఆడాలి కానీ, ఆటలను ఎంచుకునేటప్పుడు ఎల్లప్పుడూ సురక్షితంగా ఉండండి. మరియు మీరు ఇంటి నుండి దూరంగా ఉన్నప్పుడు ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండండి.

*కథ చెప్పిన వారు : మా నాన్నగారు*

*సేకరించువారు:*

**వై. పావని**

B.COM (BA)

క్రమ సంఖ్య: 105822548054

# 29. నెయ్యి - గులకరాళ్ళు

అనగనగా ఓ ఊళ్లో రాము అనే వ్యక్తి వాళ్ళ కుటుంబంతో నివసిస్తున్నాడు. అతని పేరు రాము. రాము ఒక రోజు దేవుని వద్దకు ఏడుస్తూ వచ్చాడు. ఏం జరిగింది, ఎందుకు ఏడుస్తున్నావు నాయనా! అని భగవంతుడు అడిగాడు. స్వామీ! మా న్నానగారు నిన్న మరణించారు అని వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పాడు. హయ్యో పాపం! అలాగా! ఏడిస్తే చనిపోయిన మీ తండ్రిగారు తిరిగిరాడు కదా! మరీ ఏడ్చి ఏం లాభం? ఏడవకు నాయనా! అవును స్వామీ ఎంత ఏడ్చిన పోయినవాడు తిరిగిరాడని తెలుసు. కానీ ఆయన ఏ లోకానికి వెళ్ళారో అని నాకు దిగులుగా ఉంది. మీరు ఏమైనా చేస్తారని అని మీ వద్దకు వచ్చాను స్వామీ! ఓ అలాగా! చనిపోయిన నీ తండ్రికోసం నేనేం చేయగలను? స్వామీ! దయతో మీరే ఏదో ఒకటి చేయండి. మీరెంతో దయగల వారు, శక్తివంతులు. ఖచ్చితంగా మీరే చెయ్యగలరు. ఆ పూజరులు, శాస్త్రుళ్ళు, పండితులు చనిపోయిన వారికి స్వర్గలోకాలు పూజించడానికి ఎన్నో కర్మకాండలు, అగ్నికార్యలు, చేస్తున్నారు. ఆ శాస్త్రులకన్నా మీరెంతో గొప్పవారు, సాక్షాత్తూ భగవంతులే. మీరు కూడా మా తండ్రిగారి కోసం ఏమైనా చేయించండి. నేను ఎంతో ఋణపడి ఉంటాను. అని వేడుకున్నాడు.

పాపం, తండ్రి పోయిన దుఃఖంతో రాము బాధతో ఉన్నాడు. అతనికి మాటలతో చెప్పలేము. అందుకని భగవంతుడు ఇలా చెప్పాడు. రాము నువ్వు వెళ్ళి రెండు మట్టికుండలు, నెయ్యి పట్టుకురా! పరుగు పరుగున వెళ్ళి రెండు కుండలు, నెయ్యి తెచ్చాడు. ఒక కుండను నెయ్యితో నింపు, ఒక కుండను గులకరాళ్ళతో నింపు అని చెప్పాడు. వెంటనే రాము ఒక దాన్ని నేయ్యితో నింపాడు. రెండవ కుండలో గులకరాళ్ళతో నింపాడు. ఆ రెండింటికీ మూతులు కట్టి ఆ చెరువులో పడి వెయ్యి అని చెప్పాడు. అతడు అలానే చేశాడు. ఆ రెండు కుండలు నీటి అడుగుకు చేరాయి. ఒక కర్రతో ఆ రెండు కుండలూ పగులగొట్టు అని భగవంతుడు ఆదేశించాడు.

భగవంతుడు మా తండ్రి కోసం ఏదో కార్యం చేస్తున్నాడని రాము ఎంతో సంతోషించి, కర్రతో నీటిలోని కుండలను పగులగొట్టాడు. ఒక కుండలోని నెయ్యి నీళ్ళపైకి తేలింది. రెండో కుండలోని రాళ్ళు నది అడుగు భాగానికి చేరాయి.

ఇక భగవంతుడు ఇలా చెప్పాడు. చూడు నాయనా! నేను చేయగలిగింది. చేశాను. ఇప్పుడు ఆ శాస్త్రులనో, పండితులనో పిలిచి ఆ గులకరాళ్ళను పైకి తేలేటట్లు, నెయ్యిని క్రిందకు మునిగేటట్లు పూజ చెయ్యమని చెప్పు. ఏం జరుగుతుందో చూద్దాం? అన్నాడు. ఆ యువకుడు ఏడుపు ముఖం పెట్టాడు. స్వామీ, అదెలా సాధ్యం! నెయ్యి నీటిపైన తేలుతుంది. రాళ్ళు మునుగుతాయి. ఇది ప్రకృతి ధర్మం కదా? నెయ్యి నీళ్ళకంటే తేలిక గనుక పైకి తేలుతుంది. ఏ మాయ చేసినా మునగదు. అలాగే రాళ్ళ నీళ్ళకంటే బరువు కాబట్టి ఏ కర్మకాండ చేసినా అవి పైకి తేలవు. ఇది ప్రకృతి ధర్మం

అప్పుడు భగవానుడు ఓ నాయనా! నీవు ప్రకృతిని ఇంత చక్కగా వివరించావు కదా! మరి మీ తండ్రి గులకరాళ్ళవంటి బరువైన దుష్కర్మలు చేసి ఉంటే అధోలోకాలకే వెళతాడు. ఒకవేళ మీ తండ్రి తేలికైన నెయ్యిలా, మంచి పనులు చేసి ఉంటే, స్వర్గలోకాలు వాటంతట అవే ప్రాప్తిస్తాయి. కనుక ప్రకృతి నియమం ప్రకారం, మంచి పనులు చేస్తే మనం దుఃఖం నుండి త్వరగా బయటపడతాం.

**ముగింపు:** నేను ఈ చిన్న కథ రాసినందుకు నాకు ఎంతో సంతోషకరంగా ఉంది. ఎందుకంటే నేను ఎంతో శ్రద్ధగా అమ్మమ్మలు, నాన్నమ్మల నుండి కథలు సేకరించి రాసినందుకు. మా మేడమ్ మాకు తరగతి గదిలో కథలు సేకరణ అనే అసైన్మెంట్ రాయమనప్పుడు నేను మా స్నేహితులు ఇలా అనుకున్నాము ఏంది మెడమ్ ఇట్ల చెపుతుంది నాన్నమ్మ, అమ్మమ్మ లకు ఫోన్ చేసి రాయమంటుంది, మా అమ్మమ్మకు ఏం గుర్తుందో ఏమో ఎట్లా రాయాలి అబ్బ అని ఆలోచనలో పడ్డాము. కానీ ఎప్పుడైతే మా నాన్నమ్మ కి ఫోన్ చేసి అడిగానో లేదో మా నాన్నమ్మ నాకు కథ చెప్పింది. ఎంతో సంతోషంగా ఎప్పుడో విన్న కథలను నాకోసం గుర్తు చేసుకొని నాకు చెప్పారు.

మాలోని టాలెంటునూ బయటకు తీసుకురావడానికి మమ్ముల్ని గొప్ప స్థాయిలో ఉండాలని మా అధ్యాపకురాలి కోరిక. మేము మా అధ్యాపకురాలు చెప్పినట్లుగా నడుచుకుంటాము అని కోరుతున్నాము.

*కథ చెప్పినవారు : బాలరాజు*

*వయస్సు: 42 సం॥లు*

*తారమతిపేట్, రంగారెడ్డి*

*సేకరించినవారు :*
**వి. రజిత**
B.Com computer's Application
క్రమ సంఖ్య: 120

# 30. ఆవు - పులి

అనగనగా ఒక అడవిలో పెద్దపులికి ఆకలి వేసి ఆహారం కోసం అడవంత కలయ తిరుగుతుంది ఇంతలో ఒక ఆవు చెలుకలో మేత మేయడం చూసి ఇక తనకు మంచి ఆహారం దొరికిందని ఆవు దగ్గరికి వచ్చి తినడానికి సిద్ధమవుతుంది.

అంతలో ఆ ఆవు తను చనిపోతే తన లేగ దూడకు ఎవరు పాలిస్తారు ఉదయం సరిగ్గా పాలు కూడా ఇవ్వకుండా మేతకు వచ్చాను అని మనసులో బాధని పులితో అంటూ అయ్యా నేను ఈ మధ్యనే ఒక దూడకి జన్మనిచ్చాను. నా పిల్ల ఇంకా నా పాలు తాగుతూనే ఉంది. అది పాలు తాగడానికి నాకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. నాపై దయవుంచి నా బిడ్డకు పాలిచ్చి రావడానికి అనుమతి ఇవ్వండి. తప్పకుండా తిరిగి వచ్చి నేను మీకు ఆహారం అవుతాను అని బ్రతిమిలాడుతది ఆవు మాటలు పులికేందుకో నమ్మబుద్ధి వేసి సరే నాకు బాగా ఆకలిగా ఉన్నా నీ మీద జాలితో నీకు అవకాశం ఇస్తున్నాను. వెళ్ళి త్వరగా రా అని చెప్పింది. తనకు అవకాశం ఇచ్చిన పులికి ధన్యవాదములు తెలిపి ఆవు తన దూడ వద్దకు వెళ్ళి దాని కడుపు నిండా పాలిచ్చి మంచి బుద్ధులు చెప్పి దానికి బాధ్యత తోటి పశువులకు అప్పగించి తిరిగి అడవిలో పులివున్న ప్రదేశానికి వచ్చింది. ఆవు నిజాయితీగా తన మాట మీద నిలబడి ప్రాణాలను కూడా లెక్కచేయకుండా తిరిగి రావడంతో పులి సంతోషించి పులి బాగా ఆకలితో ఉన్న, నిజాయితీని మెచ్చి నిన్ను తినకుండా వదిలి పెడుతున్నాను. వెళ్ళి నీ బిడ్డతో హాయిగా జీవించు అని దాన్ని విడిచిపెట్టింది. పులి దయ గుణానికి ఆవు కృతజ్ఞతలు తెలిపి తన పక్కకు పోయి తన బిడ్డతో హాయిగా జీవించసాగింది.

**నీతి :** మన నిజాయితీ మనల్ని కాపాడుతుంది. ఆవు తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పులికి మాట ఇచ్చింది. తన పసిబిడ్డ మొహం కూడా చూడకుండా నిజాయితీగా పులి దగ్గరికి వచ్చింది. పులి ఎంత ఆకలితో ఉన్న ఆవు మాటలు నమ్మి తన బిడ్డకి పాలిచ్చే రమ్మని చెప్పింది. ఆవు నిజాయితీగా ఉండటం వల్ల పులి తన బిడ్డ దగ్గరికి వెళ్ళి సంతోషంగా జీవించు అని చెప్పింది. మన నిజాయితీ మనల్ని కాపాడుతుంది అని నేను ఈ కథ ద్వారా తెలియజేస్తున్నాను..

నాకు ఈ అసైన్మెంట్ పని ఇచ్చిన మా తెలుగు అధ్యాపకురాలు ఏం. అలివేణీ గారికి ప్రత్యేక ధన్యవాదములు.

*కథ చెప్పిన వారు : మా నాన్నమ్మ*

సేకరించినవారు :
**కె. మంజుల**
బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్.
రోల్ నెంబర్ : 1058-22-405-010.

# 31. రామయ్య ఆవు

రామయ్య దగ్గర ఒక ఆవు వుండేది. అది దండిగా పాలు ఇచ్చేది. ఆవును ఎంతో శ్రద్ధగా మేత, కుడితి పెట్టి జాగ్రత్తగా చూసుకునేవాడు.

అంతేగాక ఆవును దైవస్వరూపంగా భావించి ప్రతి శుక్రవారం దానికి స్నానం చేయించి, పసుపు కుంకుమలతో పూజ చేసి, హారతి ఇచ్చేవాడు.

ఆవు కొన్నాళ్ళకు దూడను ఈనింది. రామయ్య ఎంతగానో సంతోషించాడు. పాల దిగుబడి మరింతగా పెరిగింది.

కానీ ఒకరోజు ఆ ఆవు తప్పిపోయింది. ఎంత వెతికినా దొరకలేదు. రామయ్య చాలా విచారించాడు. దూడ కూడా తల్లి కోసం దిగులుపడింది.

రామయ్య ఒక ఉపాయం ఆలోచించి ఆవు తప్పిపోయింది. దాన్ని తెచ్చి ఇచ్చిన వాళ్ళకు దూడను కూడా ఇచ్చేస్తాను" అని దండోరా వేయించాడు. దూడ కోసం ఆశపడిన గోపన్న అనే వ్యక్తి తన కోట్టంలో కట్టేసుకున్న ఆ ఆవును తీసుకుని రామయ్య దగ్గరికి వచ్చాడు.

“ఆవును తెచ్చాను, దూడను కూడా ఇస్తే తీసుకుపోతాను” అన్నాడు. దూడను గుర్తుపట్టిన ఆవు గోపన్నను ఒక తన్ను తన్ని దూడ దగ్గరికి పరుగెత్తింది. నడుము విరిగిన గోపన్న లబోదిబోమన్నాడు. రామయ్య తన ఆవు తనకు దక్కినందుకు, దూడకు తల్లికి దొరికినందుకు సంతోషించారు.

**కథ యొక్క నీతి:** మనం ఎప్పుడు ఏదీ ఉచితంగా ఆశించకూడదు. ఉన్నదాంతో సంతోషంగా జీవించాలి.

**ముగింపు :**

కథ చెప్పినందుకు మా నాన్నమ్మకు ధన్యవాదములు మరియు కథ చెప్పిన మా నాన్నమ్మ పేరు అచ్చమ్మ. తను మాతో చాలా సన్నిహితంగా ఉంటుంది. నానమ్మ చెప్పిన కథ చాలా బాగా నచ్చింది. మనం ఎప్పుడు ఎవరి నుంచి ఏమీ ఆశించకూడదు. ఉన్నదానితో జీవితం కొనసాగించాలి. మా నాన్నమ్మకు చాలా కృతజ్ఞత మరియు మా మేడం చెప్పిన పని పూర్తి చేశాను.

సేకరించిన వారు :
**టి. నిత్య నందిని**
బి.ఏ, 2వ సంవత్సరం
రోల్ నెంబర్:1058-22-111-088

# 32. ఆలస్యం అమృతం విషం

సమయం ఎంతో విలువైనది. ఏ సమయంలో చేయవలసిన పనిని ఆ సమయంలో చేయాలి. లేకుంటే అదృష్టం చేజారవచ్చు.

అనిత ఏడో తరగతి చదువుతుంది. చక్కగా చదువుతుంది, చక్కగా పాడుతుంది కూడా. కానీ ఆమెకు కొంచెం నిర్లక్ష్యం, బద్ధకం ఎక్కువ. ప్రతి పని వాయిదా వేస్తుంటుంది. “అలా చేయవద్దు “అని వాళ్ళ అమ్మ ఎన్నో సార్లు అనితను హెచ్చరించింది. కానీ అనిత నిర్లక్ష్యంతో ఆ మాటలు పట్టించుకునేది కాదు.

ఒకసారి ఆ ఊర్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అన్ని స్కూల్లో విద్యార్థులకు పాటలు, ఆటట పోటీలు పెట్టారు. అనిత పాటల పోటీలో పాల్గొంది. అందులో ఆమెకి మొదటి బహుమతి వచ్చింది.

కొన్ని రోజుల తర్వాత ఒకరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన సంస్థ నుండి అనితకు ఒక ఉత్తరం వచ్చింది. గత నెలలో జరిగిన పాటల పోటీలో మొదటి బహుమతి వచ్చినందుకు మరునాడు తమ కార్యాలయానికి వచ్చి బహుమతి తీసుకోవలసినదిగా రాశారు.

అనిత ఆ ఉత్తరాన్ని పెద్దగా పట్టించుకోలేదు. తర్వాత ఎప్పుడైనా వెళ్ళి బహుమతి తీసుకోవచ్చులే అనుకొని మరునాడు వెళ్ళకుండా నాలుగు రోజుల తర్వాత వెళ్ళింది. ఆ సంస్థ వారు బహుమతితో పాటు పట్టణంలో జరుగుతున్న పెద్ద సర్కస్ చూడడానికి రెండు టికెట్లు కూడా ఇచ్చారు. అయితే ఆ టికెట్టు అంతకు ముందు రోజు జరిగిన అట. అనిత అవి చూసుకొని ‘అయ్యో! కనీసం నిన్న వచ్చిన బాగుండేది కదా!’ అని బాధపడింది. ఈ సంఘటనతో అనితలో ఎంతో మార్పు వచ్చింది. నిర్లక్ష్యంగా ఉండకుండా, ఎప్పటి పని అప్పుడే పూర్తి చేయడం ప్రారంభించింది

**నీతి:** ఆలస్యం అమృతం విషం. ఏ పనిని అప్పటికప్పుడు చేసుకుంటేనే అది మంచిది ఆలస్యం చేసే కొద్దీ మనకి రావలసిన ఎన్నో గొప్ప అవకాశాలు కోల్పోతాము, అందుకని ఆలస్యం చేయకూడదు.

*సేకరించినవారు :*
**జి. మౌనిక**
B.Com CA
రోల్ నంబర్: 105822405068
తేది:21-09-2022

# 33. పులి చేతిలో గాజు

అనగనగా ఒక అడవిలో ఒక పులుండేది. ఆ పులి ముసలిదైపోయింది. దాని గోళ్ళు, పళ్ళు బలహీనంగా అయిపోయాయి. రోజు వేటాడడం కష్టమయిపోయింది. ఆకలితో బాధపడుతున్న పులి ఒక రోజు నదీ తీరాన బాగా మెరుస్తున్న ఒక బంగారపు గాజును చూసింది. వెంటనే వెళ్ళి ఆ గాజును తీసుకుంది.

ఇటూ అటూ చూస్తుంటే ఒక చెట్టుకింద కూర్చున్న మనిషి కనిపించాడు. ఆ మనిషిని చూస్తే పులికి నోరూరింది. దగ్గరకెళితే ఆ మనిషి పారిపోతాడన్న భయంతో కొంచెం దూరంగా నుంచుని ఆ మనిషిని పిలిచింది. మనిషి పులిని చూసిన వెంటనే పారిపోబోయాడు. కానీ ఆ పులి తన దగ్గరున్న గాజును చూపించి నీకిది కావాలా అనడిగింది. “నీ దగ్గరకొస్తే నువ్వు నన్ను తినేస్తావు, నేను రాను” అన్నాడు మనిషి.

“నిన్ను చూస్తే యువకుడిలా ఉన్నావు, బలంగా కనిపిస్తున్నావు – నీకు నేనంటే భయమెందుకు? నేను చూడు ఎంత ముసలిదాన్నయిపోయాను” అంది పులి. ఈ మాటవిని ధైర్యం తెచ్చుకున్న మనిషి గాజును సంపాదించుకుందామన్న దురాశతో పులి దగ్గరకు వెళ్ళాడు. వెంటనే పులి మనిషి మీదకు దూకి అతన్ని చంపి తినేసింది.

**నీతి :** నిజంగా దురాశ దు:ఖానికి చేటు.

*చెప్పినవారు: లక్ష్మీ*
*వయస్సు : 62 సం॥లు*
*మరముంగాల*
*జోగులాంబ గద్వాల్*

*సేకరించిన వారు:*
**పి. భవాని**
బీ.కామ్. బిజినెస్ ఎనలైస్టిక్స్
రోల్ నెంబర్: 1058-22-538-017
తేదీ:16-09-2022

# 34. వ్యాపారి

అనగనగా ఒక ఊరిలో కేశవయ్య అనే వ్యాపారి ఉండేవాడు. ఆయన దగ్గర ఓ ముసలి ఏనుగు ఉండేది. ఆ ఊర్లో పెళ్ళిళ్ళు తిరునాళ్ళు జరిగినప్పుడు ఊరేగింపుల కోసం దాన్ని అద్దకిస్తుండేవాడు. ఓసారి సోమయ్య అనే రైతు తన కొడుకు పెళ్ళి కోసం ఏనుగును అద్దెకు తీసుకున్నాడు. ఊరేగింపంతా బాగానే జరిగింది కానీ... ఆ తర్వాతే ఏనుగుకి సుస్తీ చేసింది. చూస్తుండగానే కుప్ప కూలి... చచ్చిపోయింది. సోమయ్య గబగబా వెళ్ళి కేశవయ్యకి విషయం చెప్పాడు. అది విని కేశవయ్య పెద్దపెట్టున ఏడవడం మొదలు పెట్టాడు. దాన్ని నేను గున్న ఏనుగు కొన్న, అదంటే నాకు ప్రాణం. నా ఏనుగుని నాకు తిరిగి ఇవ్వు లేదా నీ ఆస్తి మొత్తం రాసి ఇవ్వు! అన్నాడు. దానికి సోమయ్య కావాలంటే పరిహారంగా ఆ ఏనుగు ధరకి రెట్టింపు ఇస్తాను... దాని దహన సంస్కారాలు నేనే చేస్తాను..! అన్నాడు. కానీ అయినా కేశవయ్య ఒప్పుకోలేదు నా ఏనుగును నాకివ్వు అన్నాడు.. అని పట్టుబట్టాడు. దాంతో సోమయ్య ఆ ఊరి పెద్ద రామారావు వద్దకి వెళ్ళి తన గోడు వినిపించాడు. రామారావు ఆయనకు ఉపాయం చెప్పాడు. తర్వాతి రోజు కేశవయ్యని పిలిచాడు మీ వ్యాజ్యం ఇక్కడ తెగదు. నువ్వు వెళ్ళి సోమయ్యని పిలుచుకు రా... ముగ్గురం న్యాయస్థానానికి వెళ్దాం అన్నాడు.

కేశవయ్య సోమయ్య ఇంటికి వెళ్తే గుమ్మం తలుపు ఓరగా మూసి ఉంది. సోమయ్య! అని పిలుస్తూ తలుపుని నెట్టగానే దాని వెనుకున్న కుండల దొంతర ఒకటి దబ్బునా కింద పడింది. కుండలన్నీ పెంకులై పోయాయి. లోపల నుంచి వచ్చిన సోమయ్య జరిగింది చూసి అయ్యో... ఈ కుండలు మా నాన్న కాలంలో కొన్నవని వాటిని నేను ప్రాణంగా చూసుకుంటున్నా.. కేశవయ్య! నా కుండలన్ని ఉన్నవి ఉన్నట్టు తెచ్చి ఇవ్వు లేదా కోటి రూపాయలు ఇవ్వు! అన్నాడు. కుండలకి కోటి రూపాయల... ఇదేం న్యాయం! అన్నాడు కేశవయ్య. మరి ముసలి ఏనుగుకి ఆస్తి మొత్తం రాసి ఇవ్వాలి అనడం మాత్రం న్యాయమా.... కేశవయ్య! అంటూ అక్కడికి వచ్చాడు రామారావు. కేశవయ్యకి ఇదంతా ఆయన ఉపాయమేనని అర్థమైపోయింది. తన తప్పు ఒప్పుకొని. ఏనుగు ధర తీసుకొని వెళ్ళిపోయాడు.

సేకరించువారు
**ఎం.దీపిక**
BA.EPP, 2ND YEAR
క్రమ సంఖ్య: 105822111070
*తేది:21-09-2022*

# 35. చాణుక్యుని జ్ఞానోదయం

చాలా సంవత్సరాల క్రితం తక్షశిల అనే ఊరిలో చాణక్య అనబడే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతను మౌర్యుల సామ్రాజ్యాన్ని స్థాపించిన మహోన్నతుడు. ఈ సామ్రాజ్యం స్థాపించడానికి అతను చాలా కృషి చేసాడు. చాలా రాజ్యాలతో యుద్ధం చేసి, చంద్రగుప్తుడిని రాజు చేసాడు.

ఒక రోజు చంద్రగుప్తుడితో పాటలీపుత్ర నగరం మీద దాడి చేసి ఓడిపోయిన చాణక్యుడు నిరాశగా ఇంటికి బయలుదేరాడు. దారిలో అలసటనిపించి ఒక ఇంటి అరుగు మీద కూర్చున్నాడు. ఇంట్లో ఒక అవ్వ తన పిల్లలకు అన్నం పెడుతోంది. తింటున్న పిల్లల్లో ఒకడు హటాత్తుగా కెవ్వని కేక పెట్టాడు. హడలిపోయిన అవ్వ "యేమైంది బాబు!" అంటే ఆ బాలుడు "అన్నం వేడిగా వుంది, చెయ్యి కాలిందమ్మ" అన్నాడు.

అదే మరి, నువ్వూ చాణక్యుడిలానే వున్నావు," అంది అవ్వ. "ఎవరైన అన్నం మధ్యలో చేయి పెడతార? పక్కలనుంచి చిన్నగా తింటూ రావాలికానీ?"

ఇదంతా అరుగుమీంచి వింటున్న చాణక్యుడికి జ్ఞానోదయమయ్యింది. తాను చేసిన తప్పు తెలుసుకున్నాడు. బలవంతులైన నందులతో యుద్ధం చేసేటప్పుడు వాళ్ళకు బాగా పట్టు ఉన్న పాటలీపుత్ర మీద దాడి చేస్తే కలిగేది నిరాశే అని అర్థం చేసుకున్నాడు. ఆ తరువాత చంద్రగుప్తుడితో కలిసి చుట్టు పక్కలున్న చిన్న చిన్న రాజ్యాలను ఆక్రమిస్తూ నెమ్మదిగా పాటలీపుత్ర మీద యుద్ధం ప్రకటించి విజయాన్ని సాధించాడు.

ఈ సంఘటన భారత దేశ చరిత్రనే మార్చేసింది.

*చెప్పినవారు: నాగమణి*
*వయస్సు: 55 సం॥లు*
*కొనన్‌పల్లి, మహబూబ్‌నగర్*

*సేకరించిన వారు:*
**ఎస్. హర్షిణి**
క్రమ సం: 1058-22-401-016
గ్రూప్ : బీకాం జనరల్
తేది:21-09-2022

# 36. తండ్రి - కొడుకు

ఓ యువకుడైన తండ్రి తన చిట్టిబాబును వొళ్ళో కూర్చోపెట్టుకుని ఆడిస్తున్నాడు. ఇంతలో ఎక్కడినుండో ఓ కాకివచ్చి ఎదురింటి పెంకులపై వాలింది. బాబు తండ్రిని 'నాన్నా అదేమిటి'? అని అడిగాడు తండ్రి అది 'కాకి' అని చెప్పాడు. కొడుకు తండ్రిని మళ్ళీ అడిగాడు, నాన్నా 'అదేమిటి? తండ్రి మళ్ళీ అడిగాడు నాన్నా, అది ఏమిటి? తండ్రి మళ్ళీ చెప్పాడు. అది కాకి, కొడుకు పదేపదే అడగసాగాడు. అదేమిటి? అదేమిటి? అని. తండ్రి ఓపిగ్గా మళ్ళీమళ్ళీ అది కాకి అని బదులిస్తూ ఉండేవాడు. కొన్నేళ్ళు గడిచాయి. బాబు పెరిగి పెద్దవాడయ్యాడు. తండ్రేమో ముసలివాడయ్యాడు. ఓ రోజు తండ్రి చాపమీద కూర్చున్నాడు. ఎవరో అతని కొడుకును చూడాలని వచ్చినట్లుంది. తండ్రి కొడుకును అడిగాడు యెవరు బాబు వచ్చింది? కొడుకు వచ్చినతని పేరు చెప్పాడు. కొంతసేపటికి మరొకరు వచ్చారు. ఎవరు వచ్చారు? అని తండ్రి అడిగాడు. విసుగ్గా కొడుకు బదులిచ్చాడు. మీరు ఓచోట ఊరకే పడివుండకూడదూ? పని పాట లేదు కాని, ఎవరు వచ్చారు? ఎవరు పోయారు? అంటూ దినమంతా ఆరాలు తీస్తుంటారు? తండ్రి గట్టిగా నిట్టూర్చాడు. చేత్తో తలపట్టుకొన్నాడు. ఎంతో బాధతో మెల్లమెల్లగా కొడుకుతో ఇలా అన్నాడు నేను నిన్ను ఓసారి అడిగితే ఇంతగా విరుచుకు పడుతున్నావే? ఇదేమిటి? ఇదేమిటి? అని నీవు వందలాదిసార్లు వేధించేవాడివే! నేను నిన్నెప్పుడైన కసురుకొన్నానా? నేను నీకు ఓపిగ్గా బాబు అది కాకి అని చెప్పేవాడిని తల్లితండ్రులను కసిరేవారు మంచివాళ్ళు కాదు. మిమ్మల్ని పెంచి పెద్ద చేయడంలో మీ అమ్మానాన్నలు ఎన్ని కష్టాలు పడ్డారో, మిమ్మల్ని ఎంతగా ప్రేమించారో, ఓసారి ఆలోచించండి.

**నీతి:** సహనానికి మించిన సంపద లేదు.

*సేకరించువారు:*
**ఎన్. సంగీత**
B.Com computers,
రూల్ నంబర్: 105822405126.
*తేదీ: 22-09-2022*

# 37. తెలివి తక్కువ తనం

ఒక రాబందు ఒక చిన్న మేక పిల్లను తన రెండు కాళ్ళతో పట్టుకొని ఆకాశంలోకి వెళ్ళడం ఒక గ్రద్ద చూసింది. నిజం చెప్పాలి అంటే గ్రద్దకు రాబందుకున్నంత బలం ఉండదు. కానీ గ్రద్ద నేను కూడా రాబందు లాగ నా ఆహారాన్ని నేనే తెచ్చుకుంటాను అనుకుంది, వెంటనే ప్రక్కన ఒక గొర్రెల మంద ఉంది దానిలో ఒక గొర్రె మీద వెళ్ళి వాలింది, అంతలో అక్కడికి గొర్రెల కాపరి వచ్చాడు, అతనిని చూసి గ్రద్ద ఎగిరిపోవాలి అనుకుంది కానీ అప్పటికే దాని రెండు కాళ్ళు గొర్రె బొచ్చు లో ఇరుక్కు పోయాయి.

అది ఎగరలేక పోయింది, గొర్రెల కాపరి దానిని తీసుకొని తన పిల్లలు ఆడుకోవడానికి ఇంటికి తీసుకు వెళ్ళాడు. ఆ విధంగా గ్రద్ద తనని తానూ ఎక్కువ అంచనా వేసి ప్రాణం మీదకు తెచ్చుకుంది.

**నీతి:** ఎవరి బలం ఎంతో వారికి ఖచ్చితంగా తెలిసి ఉండాలి.

నాకు ఈ అసైన్మెంట్ పని ఇచ్చిన మా తెలుగు అధ్యాపకురాలు ఎం. అలివేణీ గారికి ప్రత్యేక ధన్యవాదములు.

చెప్పినవారు: *కిష్టమ్మ*
*వయస్సు: 60 సం॥లు*
*వట్టివల్లి, నాగర్ కర్నూల్*

# 38. హరిచంద్ర మహారాజు

అనగనగా ఒక రాజు ఆ రాజు పేరు హరిచంద్ర మహారాజు. అతని భార్య పేరు సత్యవతి అతని కుమారుడు లోహితంగుడు ఆ రాజు చాలా మంచివాడు. అతని ముందుకు ఎవరు సహాయం కోసం వచ్చిన లేదు అని అనకుండా ఇచ్చేవాడు అది గమనించిన విశ్వామిత్ర అనే ఒక ముని అతణ్ణి పరిశీలించడానికి వచ్చాడు. అతను రాజుతో ఇలా అన్నాడు. ఓ రాజు నువ్వు ఎవరు సహాయం కోసం వచ్చిన లేదు అనడం లేదంట కదా! ఇచ్చే పంపుతుంటివి కదా! అంటాడు అప్పుడు రాజు ఏమి కావాలి అని అడుగుతాడు అప్పుడు ఒక పందెం వేసుకుందాం అందులో నువ్వు గెలిస్తే నువ్వు ఇచ్చింది తీసుకొని వెళ్ళిపోతాను అదే నేను గెలిస్తే నేను అడిగింది ఇవ్వాలి ఇస్తాను అని మాట ఇవ్వమాంటాడు. అప్పుడు ఆ రాజు మాట ఇచ్చేస్తాడు అప్పుడు అతను నీ దగ్గర ఉన్న ధనం ధాన్యాలు పోస్తే ఈ చుట్టుప్రక్కల ఉన్న పొరుగు గ్రామాల వరకు వెళ్ళాలి.

అలా వెళ్ళలేకపోతే నువ్వు నీ భార్య పిల్లలని వేలంలో అమ్మేసి నువ్వు వెళ్ళి కాష్టాల గడ్డ దగ్గర వుండాలి. నువ్వు నీ వాళ్ళని చూడకూడదు. నువ్వు ఎక్కడ వున్నది వాళ్ళకి తెలియకూడదు. అప్పుడు రాజు వెళ్తాడు. అదే మూడో గ్రామం దగ్గరా అంటే ఇనించి కొంచం దూరంలో ఆ ముని మాయ ఎలుకలతో ఆపేస్తాడు. రాజు ఓడిపోయి తను ఇచ్చిన మాట ప్రకారం తన భార్యనీ పిల్లలని రాజ్యాన్ని అమ్మేసి వెళ్ళిపోతాడు. తన భార్య పిల్లలు అక్కడ పక్క రాజ్యంలో వున్న యువ రాణి కింద పనికి వుంచిపోతాడు. తన తల్లికి లోహితంగుడు సహాయం చేయపోయాడు. తన తల్లి రోజు మొత్తం కష్టపడుతుంది నీళ్ళు తోడి తనకు సహయం చేయాలి అనుకొని బాయి నుండి నీళ్ళు తోడుతుంటే ఆ బకెట్ జారి బావిలో పడిపోతుంది అందుకు ఆ యజమాని ఆ పిల్లవాడిని బాగా కొడుతుంది. తన బిడ్డను ఓదార్చి పిల్లలు అందరూ టేకు ఆకుల కోసం వెళ్తుంటే నువ్వు వేళ్ళు అని పంపిస్తుంది.. అప్పుడు అతను వెళ్ళతాడు. అందరూ సాయంత్రం ఇంటికి వచ్చేస్తారు. పిల్లలని అడిగితే నీ బిడ్డకు పాము కరిచింది అంటారు తను అప్పుడే తన యజమాని అడగగా పని పూర్తిచేసి వెళ్ళు అంటాడు అప్పుడు ఆ

పని అయ్యేసరికి రాత్రి 12 అవుతుంది అప్పుడు తన బిడ్డను వేతుకుంటూ వెళ్తుంది. ఒక చెట్టు కాడ తన బిడ్డ కన్పిస్తాడు అప్పటికే చనిపోతాడు. ఆతనిని తీసుకొని అక్కడ ఉన్న శవాల గడ్డకి వెళ్ళి కాల్చమంటుంది. అందుకు నాకు 5 రూపాయలు, పావుశెరు బియ్యం కావాలి. అంటాడు అప్పుడు నా దగ్గర ఏమి లేవు అంటుంది. అప్పుడు నీ మెడలో తాళి వుంది కదా అంటాడు. అంటే అప్పట్లో భార్య తాళిబొట్టు భర్తకి మాత్రమే కనిపించేది అది గమనించి తన భర్తను గుర్తుపట్టి మన బిడ్డ చనిపోయాడు అని ఏడుస్తుంటారు. వాళ్ళు జరిగింది తమ తప్పే అని బాధపడతారు కానీ ఆ మునినీ నిందించరు అందుకు ఆ ముని ఆయనను మెచ్చి అక్కడ ప్రత్యేకమైన ఆ రాజు రాజ్యాన్ని తన కొడుకుకి ఇచ్చి కలకాలం చల్లగా వుండండి అని అక్కడనుంచి వెళ్ళిపోతాడు.

*సేకరించిన వారు:*

**చిర్ర బోయిన మమత**

బిఎస్సి (ఎంఎస్సిఎస్)

హాల్‌టికెట్ నెంబర్:1058-22-467-020

# 39. చులకన

ఒక ఊరిలో ఒక ఆమె నీళ్ళు పోసుకుంది. వాళ్ల ఇంటి ముందు ఉండే కుక్క కూడా నీళ్ళు పోసుకుంది. ఒకరోజు ఆమె పాయసం వండుకుంది. పాయసం వండుకొని తిన్నది. ఆ కుక్క వచ్చి ఇంటి ముందు పండుకుంది. ఇంటిముందు పండుకొని ఊకే చూస్తుంది. చూస్తుంటే ఊకే చూసి చూసి పాయసం తిన్నది అంట ఇంట్లో నీళ్ళు కడిగి పోసుకుంది అంట. అయ్యో దీనికి పాడువాడ ఒక్క మెతుకు అన్నా పడదాయే కింద. నేను (కుక్క) నాకి అన్న పోదును నా బుద్ధి తీరు అనుకున్నది కుక్క. వస్తానంటే వెల్ల గొట్టింది. వెళ్లగొట్టి నాక నా కడుపులో పిల్లలు దాని కడుపులో పడాలి. దాని కడుపులో పిల్లలు నా కడుపులో పడాలి అని శాపం పెట్టింది కుక్క. శాపం పెట్టి వెళ్ళిపోయింది కుక్క. ఒక్కరోజు రెండు రోజులు మూడు రోజులు నాలుగు రోజులు అయినా తర్వాత కుక్క ఈనింది మనిషి నీల్లాడింది. కుక్కపిల్లలు మనిషికి పుట్టినయి, మనిషి పిల్లలు కుక్కకు పుట్టినయి. అయిన తర్వాత కుక్క వీటిని ఎట్లా సాధాలి అని ఆలోచన పెట్టుకుంది. బట్టలు లేవాయే ఏం లేవాయె ఎలా సాదాలో అని ఆలోచన పెట్టుకొని ఒక ఆమె చిన్న పిల్ల తల్లి ఊర్లో ఉండేది.

ఆమె పిల్లల గుడ్డలు, అంగీలు, కుల్లలు ఉతికి ఆరవేసింది. కుక్క ఆడ పడుకొని చూసి చూసి అంగీలు కుల్లలు వేసుకొని పోయి వాళ్ళ పిల్లలకి పెట్టుకుంది. కుల్లలు కట్టుకుంది అంగీలు తొడుక్కుంది ఇంకో కాడికి పోయి నూనె పావు తెచ్చింది. అది నాలికతో మాడకు రాసింది. మాడకు రాసుకుని చిన్నగా చిన్నగా పెద్ద అయినారు. పెద్దయినాక ఎవరో అడవి మీదికి షికార్‌కి వెళ్తే షికారుకి పోయిన వాళ్ళు వీళ్ళు అడవి మీదికి పోయినారు. మనం అడవి మీదికి షికారుకి వెళ్తే మన కంటే పెద్ద స్థాయి వాళ్ళు షికారుకి వచ్చారు. ఈ పిల్ల ముద్దుగా ఉందిరా, ముద్దుగా ఉందిరా ఈ

పిల్లని పెళ్లి చేసుకోవాలిరా అని ఆలోచన చేసుకున్నారు. పోతే షికార్ పట్టకుండా ఒక పిల్లని నువ్వు చేసుకోరా ఇంకో పిల్లని నేను చేసుకుంటా అంటూ పెళ్లి చేసుకున్నారు. ఈ కుక్క వాసన పట్టుకుంటూ పట్టుకుంటూ కొద్దిరోజులకి పెద్ద బిడ్డ ఇంటికి వెళ్ళింది. ఎక్కడిది కుక్క అంటూ కట్టేతో కొట్టింది, తర్వాత చిన్న బిడ్డ ఇంటికి వాసన పట్టుకుంటూ వెళ్ళింది. మా అమ్మ వచ్చిందని కూర అన్నంపెట్టి బస్తా వేసి పడుకోబెట్టింది. చిన్న బిడ్డ ఇంటి దగ్గర నాలుగైదు రోజులు ఉన్నది. ఆ తర్వాత పెద్ద బిడ్డ ఇంటికి పోయింది. పెద్ద బిడ్డ ముడ్లు విరగొట్టింది. కుక్క ముడ్లు ఈడ్చుకుంటూ ఈడ్చుకుంటూ చిన్న బిడ్డ ఇంటికి వెళ్ళింది. అయ్యో ఎక్కడ పాడైపోయినవే ఎవరి కొట్టినరే అంటూ చిన్న బిడ్డ వేడి నీళ్ళు బాగా పెట్టి కడిగి, అన్నం పెట్టి , బస్తా వేసి పండుకోపెట్టింది. నొప్పులు ఊటగా కావడం వల్ల చనిపోయింది కుక్క. అయ్యో మమ్మల్ని సాదే ఏందీ ఇట్లా అవ్వడం అని అక్కడ బొంద పెట్టింది. బొంద పెట్టిన కొన్ని రోజులకి అక్కడ బొంద పెట్టిన మా అమ్మని ఎట్లా ఉందో ఏమో చూసి రావాలి అంటూ వెళ్ళింది చిన్న బిడ్డ. బొంద దగ్గరికి వెళ్ళిన తర్వాత అక్కడ అన్ని ముత్యాలు పగడాలు అన్నీ కుప్పలయినాయి. ఇక్కడ మా అమ్మా ముత్యాలు పగడాలు ఉన్నాయి అని కొంగులో పోసుకొని ఇంటికి వచ్చింది. అక్క కంటే చెల్లె సంసారం గొప్పగా అయింది. మా చెల్లికి ఆయాల తినడానికి బువ్వనే లేదాయే చాలా బాగుంది కదా లచ్చుమమ్మోరు అంటూ ఎక్కడ పోయినవే, ఎక్కడ దొంగతనం చేసినవే అని అంటుంది అక్క. మన కన్న వాళ్ళు ఉన్నందుకు పెంచి పెద్ద చేసింది. మనం అడవిలో కెళ్ళి పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయినము. ఒక రోజు వస్తే బువ్వ పెట్టి పండుకో పెట్టుకున్న నాలుగైదు రోజుల ఉంది. మళ్ళి పోయింది అయినా నేను అనుకున్న ఎక్కడ పోయిందోనని. మా ఇంటికొస్తే నేను ఎక్కడిది అని కొట్టిన నువ్వే కొట్టినవానే ముడ్లన్నీ ఇడ్చాక పోయినయ్ మా ఇంటికొస్తే ఉడికి నీళ్ళు పెట్టి కడిగి అన్నం పెట్టి బస్తా వేసి పండుకో పెట్టుకున్నాం. అలా మూడు రోజులు బతికి, చనిపోయింది. చనిపోయిన తర్వాత బొంద పెట్టి వచ్చిన కొన్ని రోజులకి ఎక్కడ పాయెనో అనే చూడడానికి వెళ్లిన అక్కడ అమ్మ దగ్గర ముత్యాలు పగడాలు కుప్పలు అయి ఉన్నాయి. ఆ కుప్పల అన్ని కొంగులో వేసుకుని ఇంటికి వచ్చి కుండలో వేసుకున్న తర్వాత ధనం ధాన్యం దానితోపాటు వచ్చింది. అమ్మ ఇంత పనికి వచ్చింది అని ఒక కుక్కని బాగా కొట్టి ఇంట్లోనే బొంద పెట్టుకుంది. ఇంటి పక్క వాళ్ళు అందరూ కుక్కని బొంద పెట్టుకోవడం

వల్ల వాసన వచ్చిందని బాగా కొట్టారు. ఊర్లో వారందరూ వచ్చి బాగా మాటలని కూతలు తిట్టారు. అయ్యో ఇట్లయి పాయనే అని, అయ్యలారా కుక్క వస్తే రానియ్యలే గాని, ఇయ్యాల మంది కుక్కని తెచ్చుకుంటే వాసన రాదా అని అందరూ తిట్టారు. నిన్ను కన్న అమ్మని నువ్వు అలా చేసావు నీ కన్నా చిన్నది ఆలోచించి, అన్నం పెట్టి బస్తా వేసి, అన్ని శుభ్రంగా చేసుకుంది. నువ్వు వట్టిగానైన ఒకనాడు కూడా అన్నం వేస్తే ఏమైందని అందరూ తిట్టారు. అలా దాని సంసారం లోపలికి పోయింది. దీని సంసారం మించిపోయింది.

**నీతి:** ఎప్పుడైనా ఎవరైనా జంతువులను కూడా చులకనగా చూడొద్దు.

**సేకరించిన విధానం:** నేను మా అమ్మమ్మ దగ్గర నుండి ఈ కథను సేకరించాను. మా అమ్మమ్మ పేరు అవిలమ్మ. గ్రామం కడపర్తి. జిల్లా నల్గొండ.

*కథ చెప్పినవారు : అవిలమ్మ*
*వయస్సు: 62 సం॥లు*
*కడపర్తి, నల్గొండ*

సేకరించిన వారు:
**గౌతమి**
బీఎస్సీ (MScs)
1058-22-467-027

# 40. ఎత్తుకు పై ఎత్తు

ఒక పెద్ద చెరువు ఉండెనంట. పెద్ద చెరువు ఉంటే ఆ చెరువుల పాములు, కప్పలు, రొయ్యలు అన్ని ఉంటాయి కదా ఈ చెరువు పొట్టల ఒక నేరేడు చెట్టు మొలిచింది. నేరేడు చెట్టు పెద్దగయ్యి పండ్లు రాలుతుండే ఐతే పెద్ద మొసలి చెరువు కట్టకు నేరేడుచెట్టుకు బొయ్యారం పెట్టింది ఆ చెట్టుపైన ఒక కోతి ఉండే అది నేరేడు చెట్టు ఎక్కుతూ, దిగుతూ ఉండేది. మంచిగా పండ్లు తింటూ ఉండేది, కిందకు దిగి కూసునేది, ఇగ అది మొసలి చూసింది. ఒకనాడు నాకు చెట్టు దగ్గర వోతే కోతి పండ్లు పెడుతది అని ఆలోచన చేసింది. అప్పుడు మొసలి చెట్టు దగ్గరకు వచ్చి కోతి కోతి నాకు నేరేడు పండ్లు పెట్టవా అన్నది. అంటే తెంపి తెంపి కిందా ఏస్తే మస్తు పొట్టనిండ తినలే, రోజు దాని బొయ్యారంకు అది పోవాలె మొసలి ఒకనాడు ఏంజేసే, నేరేడు పండ్లే ఇంత రుచిగా ఉన్నవి, దాని గుండె ఎంత రుచిగా ఉంటదో దాని గుండె తింటే నా పానం సమాధానం అయితది అని మొసలి పొట్టల ఆలోచన పుట్టే. పుడితే కోతి యదార్థంగా రోజు పండ్లు పెడితే అప్పుడు ఏంజేసే మొసలి మా బొయ్యరంకు వస్తావా, ఒకనాడు అంటే ఎందుకు రాను నేను వస్తా అని కోతి అంటే గట్టిగా ఈ రోజే రావాలే అని మొసలి అంటే ఆ... వస్త అని అన్నది కోతి ముందల ముందల కోతి పోవలే, ఎనకల ముసలి రావాలే. ఎట్ల ఐతే కోతికి అనుమానం పుట్టి, ఔను, మొసలి నువ్వు నన్ను ఎందుకు మీ బొయ్యరంకు పిలిచినావు కదా మరి ఎందుకు యెనకాల వస్తున్నావు. అసలు నువ్వు నాకు ఒకటి జెప్పు. నువ్వు నన్ను ఎందుకు పిలుస్తున్నావు. ఏంది చెప్పు, అప్పుడే నేను వస్త అన్నది. నువ్వు నాకు రోజు నేరేడు పండ్లు పెడతావు కదా. నీవు పెట్టే నేరేడు పండ్లే అంత రుసిగ ఉన్నాయి కదా. ఇగ నీ గుండె ఇంకెంత రూసిగ ఉంటాదో అని నీ గుండె తిందము అని నిన్ను మా బొయ్యరంకు రమ్మని చెప్పిన హో.. ఔనా... ఐతే నేను నా గుండెను చెట్టు మీద

పెట్టివచ్చిన పోయి తీస్కొని వస్త అన్నది. అని కోతి చెట్టు కాడికి పోయి అమ్మో నేను రోజు పాపం అని పండ్లు పెడ్తుంటే నా గుండె తినాలని చూస్తదా. ఆ మొసలి రేపు రాని చెప్తా అని అనుకుంది. ఐతే తెల్లారి మొసలి వచ్చి కోతి పండ్లు పెట్టు తిందము అన్నది. ఐతే పండ్లు లేవు ఏం లేవు నాకే సరిపోతలేవు అని చెప్పిందంటా కోతి. ఐతే ఇగ మొసలి దాని బొయ్యారంకు పోయింది. ఇగ కోతి పండ్లు తినుకుంటూ చెట్టు మీద ఉంది

**నీతి:** నమ్మిన వారిని మోసం చేయరాదు.

*కథ చెప్పినవారు : పారిజాతం*
*వయస్సు: 65 సం॥లు*
*బోధన్, నిజామాబాద్*

సేకరించినవారు :

**ఆర్. జాగృతి**

B.A (EPP)

*ద్వితీయ సంవత్సరం, 3rd సెమిస్టర్*

*క్రమ సంఖ్య : 1058-22-111-012*

# 41. కోతి- డప్పు

కోతి పోయి శిమచింతా చెట్టు ఎక్కింది ఆట శిమచింతా చెట్టు ఎక్కంగనే తోకకు ముళ్లు ఈరిగింది అట ముళ్లు ఈరగ్గనే మంగలాయన కాడికి పోయింది అట. ముళ్లు తీయమని మంగలోని కాడికి పోంగనే కత్తితోని ముళ్లు తీయబోయేసరికి తోక తెగింది, తోక తెగే సరికి నాకూ నా తోక అన్న ఇయి, కత్తి, అన్న ఇయి అని అంటది, ఐతే కత్తి ఇచ్చిండు.

ఆ కత్తి తీసుకుని పోతుంటే పోతుంటే, కుమ్మరి ఆయన కుండలు చేస్తుంటే ఆయన కాడికి పోయి ఏహె స్వల్ప తోని కాదు సరిశేది కత్తితోని సరవలే కుండ నున్నగా వస్తది అని అన్నది అనంగానే నా కాడా కత్తి లేదు అని కుమ్మరి ఆయన అంటడు. అనంగనే కోతి నా కాడా కత్తి ఉంది అని ఇచ్చింది. ఇయంగానే కత్తి తోని కుండ సరిశిండు కుండా సరిశే సరికి కత్తి ఇరిగింది, కత్తి ఇరగంగనే కోతి నాకూ నా కత్తి అన్న ఇయి, కుండ అన్న ఇయి అని అంటది,కత్తి అన్న ఇయి కుండా అన్న ఇయి అని అంటది,అన్నగనే కుండ ఇచ్చిడు.

కుండ ఇయంగనే పోత  పోత ఉంటే అట్లా పోత ఉంటే ఒక ఆయన మామిడి చెట్టుకి నీళ్ళు పోస్తూండు అట, ఆయన కాడికి పోయి బింద తోటి నీళ్లు పోస్తే పండ్లు రుచి ఉండయి తీయగా ఉంటాయి కుండ తోటి పొయ్యి అని కోతి అన్నది. అనంగానే నా కాడ కుండ లేదు అని ఆయన అంటాడు, అనగానే నా కాడా కుండ ఉంది అని అంటది కోతి. నేనూ ఇస్తా పట్టు అని కుండ ఇస్తాది. ఇగ ఆయన ఆ కుండ తోటి రెండు ఓ మూడో కుండల నీళ్లు పోయాంగనే కుండ పగులుతది. కుండ పగలంగానే కుండ అన్న ఇయి పండు అన్న ఇయి  అని అంటది. అనగానే పండు ఇస్తాడు.

పండు ఇయంగానే పోత ఉంది, పోతుంటే ఒక ఆమె సాకలి మూట ఏసుకొని పిల్లని చేతులో పట్టుకొని పోతా ఉందంట. ఆ పిల్ల ఆ పండు చూసి పండు పండు

అని ఏడుస్తుందంట. ఏడుస్తుంటే కొనియ్యరాదు అని కోతి అన్నది అట, అని అంటే నా కడా లేదు అయ్యా పండు అని అన్నది  అట. నా కడా ఉంది అని అన్నది  అట. కోతి. అనంగనే ఆ కోతి పండు ఇచ్చిందట. పండు ఇయ్యంగనే ఆ పండు తిన్నది అట ఆ పిల్ల. పండు తినేదాకా చూసిందట. చూసినంక నాకూ నా పండు అన్న ఇయి, పిల్లనన్న ఇయి అని అంటది, అనగానే నా దగ్గర పండు లేదు అయ్యా పిల్ల పండు తిన్నది ఇగ పిల్లనే తీసుకో అని అన్నది అట.

ఇగ ఆ పిల్లని తీసుకోని పోత ఉంది అట పోంగ పోంగా నూనె గానుగ తిప్పుతున్నారట. గానుగను గొడ్ల తోటి తిప్పుతారు, ఇది పిల్ల తోటి తిప్పితే మంచిగా నూనె ఉంటది, గొడ్ల తోటి తిప్పితే మంచిగ ఉండదు అని అన్నది అట కోతి. అనంగనే మాకు పిల్ల లేదు కద అయ్యా  అని ఆల్లు అన్నరు అటా అనంగనే నేను ఇస్తా పట్టు పిల్లని అని ఇగ కోతి ఇచ్చింది అట. ఇచ్చినంక ఆ పిల్ల రెండు సుట్లు మూడు సుట్లు తీరగ్గనే ఆ పిల్ల సనిపోయింది. ఆ పిల్ల సనిపోయినంక మరి నాకూ నూనె అన్న పోయి పిల్లను అన్న ఇయి అని ఈ కోతి అంటాది అట అనంగనే మాకు పిల్లలు లేరు అని ఆళ్లు అన్నారు అట అనంగనే నూనె పోశ్రు అట.

ఆ నూనె తీసుకోని  పోంగా పోంగా పోంగా ఒక పెద్దరాసి పెద్దమ్మ పిండి పిసుకుతూ అప్పలు చేస్తుందట. నీళ్లు అద్దుకుంట చేస్తుంది అట. అంటే నువ్వు నీళ్లు అద్దుకుంట అప్పలు చేస్తే మంచి రుచి ఉండవు. అప్పలు చేస్తే నూనె తోటి అద్దలే అని అన్నాది అట కోతి అంటే మాకు నూనె లేదు అని ఆ పెద్దరాసి పెద్దమ్మ అన్నది అట అనంగనే నా కాడా ఉంది నేను పోస్తా పటు అని కోతి అనంగనే ఆ నూనె పోషిందట.

ఈ నూనె పోశినంన పెద్దరాసి పెద్దమ్మ అప్పలు చేసిందట. నూనె అపోయిందాకా చూసింది అట కోతి అయిపోయినంక నాకూ నా నూనె అన్న పోయి అప్ప అన్న ఇయి అని అంటది. కోతి నూనె లేదు అని అప్ప ఇచ్చిందట.

ఆ అప్ప తీసుకోని ఇగ పోత పోత  ఊర్ల ఒక మాదిగ ఆయన దప్పు చాటింపు చాటిస్తూంటే ఆ దప్పు చూసి చూసి కోతి ఆ దప్పు బాగ మోగుత లేదు నా అప్ప తోటి కొట్టు మంచిగా మొగుతాది అని కోతి అన్నది అనంగనే అప్ప లేదు అని ఆ మాదిగ ఆయన అన్నాడు అట. ఆయన అట్లా అంటే నా కాడా ఉంది పట్టు అని ఇచ్చింది కోతి ఈయగానే రెండు మూడు దెబ్బలు వేయగానే అప్ప ఇరిగి పోయింది అట, అప్ప ఇరిగి పోయింది సుడంగనే ఆ కోతి నాకూ అప్ప అన్న  ఇయి, దప్పు అన్న ఇయ్యి,

అప్ప అన్న ఇయి డప్పు అన్న ఇయి అని అంటాది కోతి అనంగనే డప్పు ఇచ్చిడు అట డప్పు ఇయంగనే ఇగ ఆ నించి ఇగ ఆ డప్పు తీసుకోని ఊరు అంతా ఇది అంత పదం పాడుకుంట తిరుగుతుంది అట ఎగురుకుంట ఆ బజార్ల పొంటి తిరుగుకుంట పాటలు పాడుతుంది అట ఏమని అంటే

తోక పోయి కత్తి వచ్చె ధాం ధాం ధాం...

కత్తి పోయి కుండ వచ్చె ధాం ధాం ధాం...

కుండ పోయి పండు వచ్చె ధాం ధాం ధాం....

పండు పోయి పిల్ల వచ్చె ధాం ధాం ధాం...

పిల్ల పోయి నూనె వచ్చె ధాం ధాం ధాం...

నూనె పోయి అప్ప వచ్చె ధాం ధాం ధాం...

అప్ప పోయి డప్పు వచ్చె ధాం ధాం ధాం...

అని అట్లా పాడింది. అట్లా పాడుకుంట పోయి బాయిల పడి సచ్చి పోయిందంట.

**నీతి :** ఈ కథలో కోతి ఒక దాని తర్వాత ఒకటి చాలా సంపాదించి కానీ చివర్లో దానికి ఏ సంతోషం లేకుండా పోయింది. అలాగే మనిషి జీవితంలో కూడ అత్యాశతో ఎన్నో సంపాదించాలి, ఎంతో సుఖంగా ఉండాలి అన్నా ఆశతో...

*కథ చెప్పినవారు : సాలమ్మ*
*వయస్సు : 75 సం॥లు*
సూర్యాపేట

*సేకరించినవారు :*

**పఠాన్ షాఫియ**

BBA 2nd year (3rd sem)

క్రమ సంఖ్య : 1058-22-684-047

# 42. రాజులు మారెనో, గుర్రాలు ఎగిరెనో

అనగనగా ఒక రాజుగారు తన రాజ్య పర్యటన చేస్తూ ఒక గుర్రాల బజారులోకి వెళ్ళారు. బజారులోని గుర్రాల వ్యాపారస్తులందరూ రాజుగారికి గుర్రాలు అమ్మాలని ప్రయత్నాలు మొదలెట్టారు. ఒకరిని మించి ఒకరు వారి వారి గుర్రాలను పొగడడం మొదలెట్టారు.

"నా గుర్రం మీరు చెప్పినట్టు చేస్తుంది" అని ఒకరంటే, "నా గుర్రం చాలా వేగంగా పరిగెడుతుంది" అని ఒకరు, "అసలు నా గుర్రానికి భయమే తెలీదు" అని మరింకొకరు గొప్పగా చెప్పుకున్నారు. ఒక వ్యాపారస్తుడు మరీ అతికి పోయి, "నా గుర్రం ఎగరగలదు" అన్నాడు.

వెంటనే రాజు గారు ఆ గుర్రాన్ని కొని, తనతో రాజమహలుకి తీసుకుని వెళ్ళారు.

మొర్నాడు సేనాధిపతిని పిలిచి, "ఈ గుర్రం ఎగురుతుంది" అని చెప్పారు. సేనాధిపతి ఆశ్చర్యపోయి, గుర్రాన్ని ఎగిరించే ప్రయత్నం చేసారు. కాని గుర్రం ఎలా ఎగురుతుంది? ఎగర లేదు.

రాజు గారు, "అదేంటి, నిన్న మరి నాతో వ్యాపారస్తుడు అలా చెప్పాడు, అతన్ని పిలవండి" అని ఆదేశించారు.

వ్యాపారస్తుడిని రాజుగారి ముందర నిలపెట్టారు. రాజుగారు, "నిన్న నీ గుర్రం ఎగురుతుంది అన్నావు కదా, ఏది ఒకసారి ఎగిరించి చూపించు" అన్నారు.

"మహారాజా! గుర్రం ఎగురుతుంది, అంటే నా ఉద్దేశ్యం అంత వేగంగా పరిగేడుతుందని" అని వ్యాపారస్తుడు చెప్పాడు.

రాజుగారికి చాలా కోపం వచ్చింది. "ఇతని తల నరికేయండి!" అని ఆదేశించారు.

ఆ తర్వాత ముఖ్యమంత్రిని పిలిచారు. "ముఖ్య మంత్రి! నాకు ఈ గుర్రం ఎగిరితే చూడాలని ఉంది! ఈ పని మీరే చేయాలి!" అన్నారు.

ముఖ్యమంత్రి ఆశ్చర్యపోయి, "మహారాజా! గుర్రం ఎలా ఎగురుతుంది, ఆ వ్యాపారస్తుడు అబద్ధం చెప్పానని ఒప్పుకున్నాడు కదా!" అన్నారు.

మహారాజు వెంటనే, "ఇతని తల నరికేయండి!" అని ఆదేశించారు.

ఇలా ఒక్కొక్కరినీ పిలవడం, వాళ్ళను గుర్రం ఎగిరించి చూపించమనడం వారు అదెలా సాధ్యం అని అడిగితే వారి తల తీసేయడం, కొన్ని రోజులు ఇలా గడిచాయి.

మొత్తానికి ఒక రోజు ఒక సభికుడిని పిలిచె, రాజు గారు గుర్రాన్ని ఎగిరించమని ఆజ్ఞాపించారు.

సభికుడు తల వంచి, "అలాగే మహారాజా! నాకు ఒక సంవత్సరం గడువు ఇవ్వండి, నేను ప్రయత్నం చేస్తాను!" అని ఒప్పుకున్నాడు.

రాజు గారు సంతోషించి, ఒక సంవత్సరం గడువు ఇవ్వడానికి ఒప్పుకున్నారు.

సభికులు, రాజ్యంలో వున్న వారందరూ ఆశ్చర్యపోయారు. "ఎలా ఒప్పుకున్నావు? అసలు గుర్రం ఎలా ఎగురుతుంది? నీ దెగ్గర ఏమైనా ఉపాయముందా?" అని రక రకాల ప్రశ్నలు అడిగారు. సభికుడు చిరునవ్వుతో తప్పించుకుని ఇంటికి చేరుకున్నాడు.

ఊరంతా నిప్పులా పాకిపోయిన ఈ వార్త ఇంట్లో ఉన్న అతని భార్యకి కూడా తెలిసింది. ఆందోళనగా అతను ఇంటికి వచ్చే దాకా గుమ్మం మీద కాపు కాసింది. ఇంటికి భర్త రాగానే విన్నది నిజమేనా అని అడిగింది.

సభికుడు నిజమే కానీ కంగారు పడద్దు అని భార్యను ఇలా ఓదార్చాడు – "మూర్ఖుల మనసులో ఒకటి పడితే అది సాధించాలన్న పట్టుదల బలంగా మొదలవుతుంది. వారితో వాదించడం కష్టం. మహారాజు గారి మనసులో ఈ విషయం అలాగే బలంగా పడిపోయింది. వారిని కాదన్న వారి తలలు నరికించేసారూ. నన్ను అడిగిన వెంటనే నేను కూడా కుదరదు అంటే నా తల కూడా వెంటనే తెగేది.

ఒక సంవత్సరం గడువు అడిగితే వెంటనే ముందరున్న ప్రమాదం తొలిగింది కదా! ఆ పయిన చూద్దాం! యాడాదిలో ఏమైనా కావచ్చు. రాజు గారు ఈ విషయం మరిచిపోవచ్చు! లేదా పట్టుదల తగ్గవచ్చు! భవిష్యత్తు ఎవరు చూసారు? రాజులు మారెనో, గుర్రాలు ఎగిరెనో!"

*కథ చెప్పినవారు : పఠాన్ గౌసియా*
*వయస్సు: 40 సం॥లు, గుంటూరు*

*సేకరించిన వారు:*
**బి. సంహిత**
Class: BSC (MSCs), 2nd year
Roll No: 1058-22-467-043

# 43. పేదరాజు కుటుంబం

అనగనగా ఒక పేదరాజు ఉండేవాడు, ఆ రాజుకి భార్య ఒక కొడుకు ఒక కూతురు ఉండేవాళ్ళు వాళ్ళ కుటుంబం సంతోషంగా ఉండే సమయంలో, ఆ రాజు భార్యకు రోగం వచ్చి మరణించింది. ఆమె మరణించే సమయంలో వాళ్ళ కొడుకుకు కూతురికి తల్లి లేని లోటు తీర్చాలని మాట తీసుకుంది. అయితే ఆ పేదరాజు పిల్లలకి తల్లి లేని లోటు తీర్చడం కోసం, మొదటి భార్య చనిపోయాక రెండో భార్యని పెళ్ళి చేసుకున్నాడు.

అయితే రెండో భార్యకు మొదటి భార్య పిల్లలు అంటే ఇష్టం లేదు. తనకంటూ సొంత సంతానం ఉండాలని పేదరాజు లేని సమయంలో పిల్లలకు విషం పెట్టాలి అని అనుకున్నది. ఆమె విషం  కలుపుతూ ఉండగా పేదరాజు కొడుకు చూస్తాడు. అయితే పేదరాజు కొడుకు వాళ్ళ నాన్నకి విషయం ఎలాగైనా చెప్పాలని తన చెల్లితో అడవిలోకి పారిపోతారు.

దారి మధ్యలో పిల్లలకు భయం వేసి ఆగిపోతారు. అప్పుడు శివుడు మారువేషంలో వచ్చి వారికి మూడు పిడికిలి  మట్టి ఇస్తాడు. ఏదైనా ఆపద వచ్చినప్పుడు ఈ మట్టిని వాటిపై చల్లమని మారువేషంలో ఉన్న శివుడు ఆ పిల్లలకి చెప్తాడు. ఆ పిల్లలు ఆ మట్టిని తీసుకొని మళ్ళీ ప్రయాణిస్తారు. కొంచెం ముందుకు వెళ్ళినాక పెద్ద పాము కనిపిస్తుంది. అప్పుడు ఆ పిల్లలు ఆ మట్టిని ఆ పాము పై చల్లుతారు. మళ్ళీ కొంచెం ముందుకు ప్రయాణించాక పెద్దపులి కనిపిస్తుంది. అయితే పిల్లవాడు ఆ పులితో పోట్లాటకి వెళ్తాడు, అప్పుడు వాళ్ళ చెల్లి ఆ పులిపై ఆ మట్టిని చల్లుతుంది అలాగే వాళ్ళ అన్న గాయాలపై కూడా మట్టిని చల్లుతుంది. అప్పుడు ఆ గాయాలు పూర్తిగా మానిపోతాయి. ఆ పిల్లలు ఇంకా కొంచెం ముందుకు వెళ్ళినాక పెద్ద నది

ఎదురైతది. అప్పుడు ఆ పిల్లలు ఆ మట్టిని నదిలో చల్లుతారు. అప్పుడు నది పిల్లలకి వెళ్ళాడానికి దారిని ఇస్తోంది. ఆ నది దాటాక, కొంచెం ముందుకు వెళ్ళాక వాళ్ళ నాన్న వారికి కనిపిస్తాడు. ఆ పిల్లవాడు ఆ పేదరాజుతో జరిగిన విషయం మొత్తం చెప్తాడు. అప్పుడు రాజు చాలా బాధపడి వాళ్ళ భార్యకి బుద్ధి చెప్పి ఆ భార్యను ఇంట్లో నుంచి పంపిస్తాడు.

పేదరాజు తన పిల్లలతో సంతోషకరమైన జీవితాన్ని కొనసాగిస్తాడు.

ధన్యవాదాలు...

*కథ చెప్పినవారు : కావ్య*
*వయస్సు: 40 సం॥లు*
*నల్గొండ*

*తేదీ: 5-09-2022*
*సేకరించినవారు :*
**గాడిగా యోగితా**
బీకామ్ (కంప్యూటర్ అప్లికేషన్స్)
క్రమ సంఖ్య : 60

# 44. కలిసి వచ్చిన అదృష్టం

రాజేష్ అనే ఒక వ్యక్తికి కొత్తగా పెళ్ళవుతుంది. తన భార్య పేరు జానకి, జానకీని కొత్తగా ఇంటికి కాపురానికి తీసుకొచ్చాడు. ఈ రాజేష్‌కు ఒక చిన్న ఉద్యోగం ఉన్నది ఆ వచ్చిన డబ్బులన్నీ ఈయన ఊరికే తాగడానికి దుబారా ఖర్చు చేయడం అలవాటు చేసుకున్నాడు. జానకి ఎంత చెప్పినా రాజేష్ మాత్రం మాట వినలేదు. అయితే ఒకరోజు ఆ జానకి ఎదురింటి కనకం. తను చేయించుకున్న నెక్లెస్‌ను చూపించడానికి జానకి ఇంటికి వచ్చింది. ఆ తర్వాత జానకి తన భర్తను నాకు అలాంటి నెక్లెస్ కావాలని పట్టుపట్టింది. కాని జానకి ఆశ మాత్రం నెరవేరలేదు. ఆ తర్వాత పొరుగురిలో ఒక పెళ్ళి ఉంది అని జానకి రాజేష్ వెళ్దామని బయలుదేరారు. అయితే జానకి మెడ బోసిగా ఉందని ఎదురింటి కనకం నెక్లెస్ తీసుకొనివచ్చి వేసుకుంటానని తన భర్తకు చెప్పింది. అయితే అప్పుడు రాజేష్ పరుల సొమ్ము పాము వంటిది. వాళ్ళ సొమ్ము మనకు బరువు మళ్ళీ జాగ్రత్తగా వెనక్కి ఇచ్చేయాలి అని మరీ మరీ చెప్పారు. అయితే రాజేష్ జానకి ఇద్దరూ పక్క ఊరికి బయలుదేరారు. అక్కడ దొంగల భయం ఎక్కువగా అని వీరు విన్నారు. వాళ్ళు అనుకున్నట్టుగానే దొంగల గుంపుగా వచ్చి రాజేష్‌ని అలాగే జానకిని బెదిరించి వాళ్ళ దగ్గరున్న డబ్బును కనకం నెక్లెసును దొంగిలించుకొనిపోయారు. అప్పుడు ఇద్దరి గుండె గుబేలుమన్నది. ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉండిపోయారు  ఆ తర్వాత జానకిని రాజేష్ ఆ నెక్లెస్ విషయంలో మరీ మరీ తిట్టాడు. ఇగ పెళ్ళికి వెళ్ళకుండా వెనక్కి తిరిగి వచ్చేశారు. ఆ తర్వాత జానకి కనకం ఇంటికి వెళ్ళి జరిగిందంతా చెప్పింది, చెప్పిన తరువాత అప్పుడు కనకం నవ్వుకొని నీకు ఇచ్చింది బంగారు నగ కాదు గిల్టు నగ అని చెప్పగానే జానకి కుదుటపడింది. కానీ ఈ విషయాన్ని జానకీ రాజేష్‌కు చెప్పలేదు.

అప్పటినుంచి కష్టకాలంలో ఉన్న రాజేష్ త్రాగడం మానేసి పొదుపుగా ఆరు నెలలు తిరిగే సరికి నెక్లెస్ చేయించాడు. ఆ తర్వాత జానకి మనకు కనకం, బంగారు నగలు ఇవ్వలేదు గిల్టు నగ ఇచ్చింది అని చెప్పింది. అప్పుడు ఇద్దరు సంతోషంగా ఉన్నారు. ఆ తర్వాత రాజేష్‌కి పొదుపు విషయం తెలిసింది. పొదుపుగా ఉంటే ఎంతటి కష్టమైనా సాధించవచ్చు అని మనసులో అనుకున్నాడు. త్రాగుడు కూడా పూర్తిగా మానివేశాడు

నీతి : పొదుపు ఉంటే ఎంతటి కష్టమైన సాధించవచ్చు.

*కథ చెప్పినవారు : వడ్డేపల్లి రాములమ్మ*
*వయస్సు: 60 సం॥లు*
*టేకులపల్లి, నల్గొండ*

*సేకరించినవారు :*

**పి. లహరిత**

BCOM (CA)

క్రమ సంఖ్య : 1058-22-405-005

# 45. నల్లి - పేను

మందవిసర్పణ్ అనే పేను ఒకటుండేది. అది రాజుగారి మంచములో దూరి జీవిస్తోంది. రాజు మంచి నిదురలో ఉండగా అతని తల మీదకెక్కి రక్తము పీల్చి తాగుతుండేది. ఒకరోజు పిండీకము అనే నల్లి ఒకటి ఆ మంచము మీదకు వచ్చింది.

అది ఎలా వచ్చిందో ఎవరికి తెలియదు. పేను ఆ నల్లికి మర్యాదలు చేసి 'ఇలా ఎందుకు వచ్చావు? అని అడిగింది.

"పేను బావా! నేను ఎందరి రక్తాన్నో పిల్చాను. అయితే రాజుగారి రక్తము చాలా రుచిగా ఉంటుందని విన్నాను. ఆయన రోజు పంచభక్ష పరమాన్నాలతో భోజనము చేస్తాడు కదా! అటువంటి రాజుల రక్తము మంచి రుచిగా ఉంటుందని ఎవరో చెప్పగా విన్నాను. అప్పటి నుంచి రాజుగారి రక్తము తాగాలనిపించింది. నువ్వు ఎంత కాలము నుంచో రాజుగారి రక్తము తాగుతూ ఉన్నావు. నాకు కూడా ఆ అవకాశము కల్పించు" అంది నల్లి పేనుతో.

నల్లి ఆ విధంగా ప్రాధేయపడి అడుగుతుంటే పేను కాదనలేక పోయింది. 'అలాగే! కాని జాగ్రత్తగా నడుచుకోవాలి. రాజుగారికి ఏ మాత్రము నిద్రాభంగము కాకూడదు. రక్తము త్రాగటంలో జాగ్రత్త. అందుకు కొన్ని జాగ్రత్తలు చెప్పింది పేను. సరే! అంది నల్లి.

ఆ రోజు రాత్రి రాజుగారు మస్తుగా భోజనము చేసి మంచము మీద పడుకున్నాడు. హాయిగా నిద్రకు ఉపక్రమించాడు. రాజుగారికి బాగా నిద్ర పట్టకముందే నల్లి గట్టిగా కుట్టింది. రక్తాన్ని పీల్చసాగింది. రాజుకు వెంటనే మెలకువ వచ్చింది. భటులను రమ్మని అరిచాడు.

"ఓరేయ్! నన్ను ఏదో కుట్టిందిరా! అదేమిటో వెతకండి" అన్నాడు. భటులు మంచము అంతా వెతికారు. తలగడ కింద నక్కిన పేనుని చూసారు. ఇదే మన

రాజుగారిని కుట్టి ఉంటుంది అని ఆ పేనుని చంపివేసారు. నల్లి తప్పించుపోయింది.

ఈ కథను చెప్పి, కాబట్టి ఎదుట వారి స్వభావము గ్రహించకుండా దగ్గరకు చేరనివ్వకూడదు అన్నాడు దమనకుడు.

"అయితే సంజీవకుడి శక్తి ఏమిటి? అతను నాకంటే గట్టివాడా? నాకు ఎలా హాని చేయగలడు? అని అడిగాడు పింగళకుడు.

"ఏ శక్తి లేకపోతే అతను మీతో వివాదానికి సిద్ధపడడు. అవునుకదా! అతని వెనక రాజద్రోహులు అయిన తాటక, పాటకులు ఉన్నారు. వాళ్ళు కుట్రలు చేయటములో మహా ఘనులు ఏదో ఒక ఉపాయము ఆలోచించండి. వాళ్ళు ఉ పాయాలు ఆలోచించటములో అఖండులు" అన్నాడు దమనకుడు,

"సరే! రేపు సంజీవకుని వద్దకు పోయి ఆ వివరాలు అన్ని తెలుసుకొని రా"! అని అన్నాడు పింగళకుడు.

"చిత్తము" అంటూ దమనకుడు ఎంతో విచారము నటిస్తూ సంజీవకుడి వద్దకు వెళ్ళాడు. దమనకుడిని చూడగానే ఎంతో ఆదరముగా ఆహ్వానించాడు సంజీవకుడు.

"దమనకా! ఎందుకు విచారంగా ఉన్నావు. నీవారందరూ క్షేమమా?" అని అడిగాడు సంజీవకుడు.

"నా క్షేమానికి ఏమీ ప్రమాదము లేదు. ఆ ప్రమాదము మీకు కలుగబోతుందనే నా విచారము" అని అన్నాడు దమనకుడు.

"నాకు ప్రమాదమా? ఎవరి వల్ల నాకు ప్రమాదము". అని ఆశ్చర్యంగా చూసాడు.

సంజీవకుడా! నీవు మంత్రివైనప్పటి నుండి పింగళకుడు నిన్ను చంపి తినాలని చూస్తున్నాడు. సంజీవకుడు ఉలిక్కిపడ్డాడు. "నన్ను ప్రాణముతో సమానముగా చూసుకుంటున్న పింగళకుడు "నన్ను చంపాలనుకున్నాడా! నేను నమ్మను" అన్నాడు సంజీవకుడు.

నువ్వు పిచ్చివాడివి సంజీవక! ఎద్దు–మొద్దు' అనే సామెతను నిజము చేస్తున్నావు. నదినీరు నిర్మలంగా ఉండటం చూసి అక్కడ లోతు ఉండదు అని అనుకునేవాడు ఎంత మూర్ఖుడో. రాజు చూపే అభిమానము నిజము అని నమ్మేవాడు కూడా అంతే! రాజుల సేవలో సుఖపడిన వాడేలేదు. "రాజులకు స్నేహము చేయటము ఎంత తేలికో, ప్రాణము తీయడం కూడా అంతే తేలిక"! అన్నాడు దమనకుడు.

"నేను నిర్దోషినే! నా మీద ఆయనకు పగ ఎందుకు? అని అడిగాడు సంజీవకుడు "అదా! నీవు రాజ్యద్రోహులైన తాటక, పాటకులతో చేతులు కలిపి తన రాజ్యాన్నే అపహరించడానికి కుట్ర పన్నుతున్నట్లు పింగళకుడికి తెలిసిందట దానితో ఆగ్రహించి నిన్ను చంపాలని నిశ్చయించుకున్నాడు అని వివరించాడు దమనకుడు.

అంటే, చెప్పుడు మాటలువిని రాజు ఈ నిశ్చయానికి వచ్చాడా? గుణవంతుడితో మెలిగే వాడు గుణవంతుడే అవుతాడు. దుష్టులతో చేరిన వాడు సముద్రంలో కలిసిన నదీజలంలాగా చెడిపోతాడు. మాయోపాయాలతో జీవించేవారు సింహము, కాకి, నక్క, పులిలాగా పెద్ద, చిన్న భేదము మరచి మంచి వారికి కూడా హాని చేస్తారు" అని చెప్పాడు సంజీవకుడు. ఆ కథ ఏమిటో చెప్పు అన్నాడు దమనకుడు. సంజీవకుడు చెప్పటం ఆరంభించాడు.

**ముగింపు:**

ఈ కథలో ప్రతి మనిషి ఎవరిని నమ్మకూడదు, ఎందుకంటే ఎవరు ఎలాంటివారో తెలియదు. ఎవరు ఎలాంటివారో మనం అంచనా వేయలేము. కాబట్టి మనమే మనకు ధైర్యం, ఎందుకంటే మన విజయమే మనకు సాటి. కాబట్టి మన విజయమే మనకు దారిని చూపిస్తుంది.

*కథ చెప్పినవారు : మా అమ్మమ్మ*

*సేకరించిన వారు:*
**పి. శ్రావణి**
BA Epp 2nd Year
క్రమసంఖ్య : 105822111038
తేదీ : 20/09/2022

# 46. అమ్మ మాట

జల జల పారే నది ఒడ్డున ఉన్న ఒక చెట్టుపై ఒక పక్షి గూడు కట్టుకుని తన చిన్న చిన్న ముగ్గురు పిల్లలతో సంతోషంగా కాలం గడుపుతున్నాయి. ఒకనాడు ఆ పక్షి తన పిల్లల మేత కోసం వెళ్ళి తిరిగి వచ్చే సమయానికి మూడు పిల్లలు ఒక పిల్ల గూడి నుండి తల బయటకు పెట్టి బయట ప్రపంచం చూస్తుంది అంతలో తల్లి వచ్చి ఆ పిల్లను ఇంకెప్పుడు బయటకు చూడకూడదు పొరపాటున కింద పడి పోవచ్చు లేక మన శత్రువులు వచ్చి ఎత్తుకెళ్ళవచ్చు. మీరు పెద్ద అయిన తర్వాత నాలాగా బయటకు వెళ్ళొచ్చు అని ముద్దుగా మందలించింది. మరునాటి ఉదయం ఆ పక్షి మేతకు వెళ్ళింది అమ్మ మాట లెక్క చేయకుండా పక్క చివరకు వచ్చి బయటకు ఆదమరచి చూస్తున్నాయి. ఆ సమయంలో పెద్ద గాలి వేయడంతో పట్టు తప్పి కాలు జారి నదిలో పడి కొట్టుకొని పోయి ప్రాణాలు వదిలాయి.

**నీతి:** పెద్దల మాట వినకపోతే ఆపదలు తప్పవు.

నాకు ఈ అసైన్‌మెంట్ పని ఇచ్చిన మా తెలుగు అధ్యాపకురాలు ఎం. అలివేణి గారికి ప్రత్యేక ధన్యవాదములు.

*కథ చెప్పినవారు : గంగమ్మ*
*వయస్సు:65 సం॥లు*
*అనంతారం, భువనగిరి*

*సేకరించిన వారు:*

పేరు: **బాతుక సుష్మ**

గ్రూపు: బిఎస్సి (ఎంఎస్సిఎస్)

రోల్ నెంబర్: 1058-22-467-053

# 47. పాపం- పుణ్యం

ఒక తల్లికి ఒక కొడుకు ఒక బిడ్డ. కొడుకు పెళ్ళి అయింది. బిడ్డ పెళ్ళి కూడా అయ్యింది. బిడ్డని ఒక ఊరికి ఇచ్చింది. కొడుకు రాజ్యానికి రాజు అయితే అత్తా కోడళ్ళకి అసలు పడేది కాదు. ఊకే గొడవలు పెట్టుకునేవాళ్ళు, వాళ్ళ అత్త ముసలావిడ అయింది. అత్త గురించి కోడలు ఏమి పట్టించుకునేది కాదు. గయ్యాళి కోడలు. అయితే ముసలావిడ వాళ్ళ కూతురు దగ్గరికి ఉందామని పోయింది. కొన్ని రోజులపాటు అక్కడే ఉన్నది. ఎన్ని రోజులు ఉంట నా బిడ్డ కాడ అని కొడుకుని పిలిపించుకుంది. కొడుకు ఎడ్ల బండి కట్టుకొని అమ్మని తీసుకొస్తానని చెల్లి ఇంటికి వచ్చిండు. తీసుకొని వస్తుండగా మధ్యలో ఒక పెద్ద మర్రి చెట్టు మరియు దాని పక్కనే పెద్ద బాయి ఉంది. మర్రి చెట్టు కాడికి రాంగనే రాజు వాళ్ళ అమ్మకి దూప అయ్యింది. ఎట్ల రా రాజా దూప అయితుంది.ఇక్కడ మొత్తం అడవి ఉంది అని అంటుంది. అప్పుడు రాజు నువ్వు ఈడనే ఉండు నేను నీళ్ళు తెస్తా అమ్మ అని చెప్పి పోయిండు కొడుకు. కూర్చోబెట్టి పోయినంక అక్కడి నుంచి గాలి దేవుడు, వానదేవుడు, అగ్నిదేవుడు ముగ్గురు వచ్చింద్రు. పెద్దమ్మ నువ్వు ఎక్కడికి పొయ్యి వస్తున్నావ్ అని అడిగినారు. నా బిడ్డ కాడికి పోయి వస్తున్న, నా కొడుకు తీసుకొస్తున్నడు, ఈడికి రాంగనే ధూప అయ్యింది , నా కొడుకు నీళ్ళు తేవడానికి పోయిండు అని చెప్పింది. అప్పుడు వానదేవుడు మంచోడా , గాలి దేవుడు మంచోడా అగ్నిదేవుడు మంచోడా ఎవరు మంచోళ్ళు అని ఆ ముగ్గురు దేవుళ్ళు ఆ పెద్దమషిని అడిగారు. అప్పుడు ఆమె ఇలా అన్నది గాలి లేంది మనము బ్రతకలేము. అగ్ని లేంది బతకలేము. వాన లేంది బతక లేము. వాన ఉంటేనే కదా పంటలు పండించుకుని మనం బ్రతకగలం అని చెప్తుంది. ఆమె సమాధానాలను మెచ్చి ఆ ముగ్గురు దేవుళ్ళు ఆమెను బంగారు బొమ్మని చేసి పోయారు. అప్పుడు ఆ రాజు నీళ్ళు తీసుకొని వచ్చి అమ్మ నీళ్ళు తాగు అంటే అమ్మ బంగారు బొమ్మ అయ్యింది. బంగారు బొమ్మ నీళ్ళు ఎట్లా తాగుతుంది. ఊరి

బయటికి  అమ్మని తీసుకుని వచ్చిండు  మా అమ్మని దేవుళ్ళు బంగారు బొమ్మని చేసి పోయింద్రు నా భార్యని నివాళి, డబ్బులు ఆరంభ జలు తీసుకొని రమ్మను అని  ఒక ఆయనకు చెప్పి పంపిండు. అప్పుడు రాజు భార్య సాటలేమో డప్పులాగా, గంప లేమో ఆరంభ జలలాగా కొట్టుకుంటూ తీసుకొని వచ్చింది. అప్పుడు రాజు మా అమ్మ అంటే దీనికి ఇంత చులకనా, దీనికింత అహంకారమా అని అనుకొని  అట్లనే ఆ చప్పుళ్ళతోటే ఆ బంగారు  బొమ్మని ఇంట్ల  పెట్టుకున్నాడు. మా అమ్మని కూడా తీసుకుంటా ఇక్కడికి మీ అమ్మ లాగా  మా అమ్మ కూడా బంగారు బొమ్మ అయితది. మావోళ్ళు చాలా పేదోల్లు దీని మూలంగా ధనవంతులు అయ్యే అవకాశం ఉంది అని చెప్తుంది. రాజు సరే  తీసుకొచ్చు కొమ్మని  చెప్తే రప్పిచుంకుంది. కొద్ది రోజులు అయిన తర్వాత మీ ఇంటి కాడ  తోలి వస్తా అని తీసుకొని పోతుండగా, వాళ్ళ అమ్మకి దూప అయినట్లుగానే అదే స్థలంలో ఈమెకి కూడా దూప అయ్యింది. రాజు నీళ్ళు తేవడానికి వెళ్ళిండు. మళ్ళీ గాలి దేవుడు, వానదేవుడు, అగ్నిదేవుడు ముగ్గురు దేవుళ్ళు వచ్చారు. ఈమని కూడ రాజు యొక్క అమ్మని అడిగినట్టుగానే వానదేవుడు మంచోడా గాలి దేవుడు మంచోడా అగ్నిదేవుడు మంచోడా అని అడిగినారు. అప్పుడు రాజుగారి అత్త ఎందుకయ్యా వాన పాడుగాను సలి  పెట్టి చచ్చిపోతాం. ఎండ పాడుగాను ఎండకాలం  తుకతుక  ఉడక పోస్తోంది.  గాలి పాడుగాను గాలొచ్చి గుడిసెలన్ని లేచి పోతాయి  అని అంటది. ఆ సమాధానాలను విని ఆ ముగ్గురు దేవుళ్ళు ఆ ఆమెను  గాడిదిని  చేసి  వెళ్ళిపోతారు. రాజు గారి అమ్మ బంగారు బొమ్మ అయింది రాజు గారి అత్తేమో  గాడిద అయింది. మీ అమ్మ కూడా బంగారు బొమ్మ అయ్యిందని  ఒక అతనితో చెప్పి పంపితే  సంతోషంతో రాజు భార్య డబ్బులు నివాళి తీసుకొని వచ్చింది. తీరా చూసే వరకు  కర్రే గాడిది. బిడ్డను చూసి  గాడిది నవ్వింది. రాజు తగిన  శాస్తి అయ్యింది అనుకున్నాడు. ఎవరి పాపం వాళ్ళది ఎవరి పుణ్యం వాళ్ళది.

**నీతి:** పుణ్యం చేసిన వాళ్ళకి మంచి జరుగుతుంది.  పాపం చేసిన వాళ్ళకి చెడు జరుగుతుంది.

**ముగింపు:** ఈ కథ ద్వారా నేను నేర్చుకున్నది ఏమంటే ఎవరిని చులకనగా చూడొద్దు మరియు ఎవరికి  చెడు చేయొద్దు. ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత ఇచ్చి మాట్లాడాలి అని  నేర్చుకున్నాను.

*కథ చెప్పినవారు : అంజమ్మ*
*గ్రామం: చందనపల్లి, జి: నల్గొండ*

*సేకరించిన వారు:*

**బి. అంజలి**

B. COM (CA),

ROLL NO : 64

# 48. అన్నదమ్ములు

కుటుంబం విడిపోయింది. కాని అన్నదమ్ముల మధ్య ప్రేమ అనురాగాలు తగ్గలేదు. నాకు పిల్లలు లేరు. నా భార్య నేను ఉన్న దాంతో సర్దుకోగలం. అన్న కుటుంబానికి కష్టం అనే భావన లక్ష్మణడికి ఉండేది. అందుకని పంట చేతికొచ్చిన ప్రతిసారి ఎవరు లేని సమయంలో చూసి పది బ్యాగ్‌ల ధాన్యాన్ని ( రైస్ ) కొన్ని అన్న దానిలో వెసే వాడు . రాముడు ఒక రోజు నా తమ్ముడుకి పిల్లలు లేరు. వాడికి వయస్సు పెరిగింది. బ్రతుకు భారంగా అయ్యితుంది అని ఆలోచించె వాడు. రాముడు. అంతే కాదు పంట చేతికి రాగానే తమ్ముడుకి తెలియకుండా అతడి బియ్యం బ్యాగ్‌లో వేసే వాడు ఇలా ఒకరికి తెలియకుండా ఒకరు ఎదుటి వారి బియ్యం బ్యాగ్‌లో వేసేవారు. అలా కొన్ని రోజులు గడిచాయి. ఒకసారి అన్నా తమ్ముడు ఇద్దరు ఒకే సారి బియ్యం వేసే సమయంలో ఒకరికి ఒకరు ఎదురు పడ్డారు. కొన్ని రోజులుగా జరుగుతున్న. ఈ విషయం ఇద్దరు తెలుసుకొని ఆశ్చర్యపోయారు. ఎంతో సంతోషించారు. వారి ప్రేమకు ఎవరు అడ్డుకాదు అని నిరూపించారు.

**ముగింపు :** ఈ కథను బట్టి మనం తెలుసుకున్న విషయం ఏంటి అంటే ఎంత మంది మధ్యలో వచ్చినా అన్నదమ్ముల్ల అనుబంధాన్ని మాత్రం ఎవరు విడదీయలేరు.

రక్త సంబధం కన్నా ఏ బంధం సరిరాదు. ఈ కథ నుంచి నాకు ఒక మంచి అనుబంధం ఎలా ఉండాలో తెలిసింది.

*చెప్పినవారు: వెంకటమ్మ*

*వయస్సు: 60 సం॥లు*

*లద్దునూరు, జనగామ*

*సేకరించిన వారు:*
**ఆర్. చంద్రిక**
B.COM (CA)
క్రమ సంఖ్య- 105822405061

**సందర్భం:** మా తెలుగు అధ్యాపకురాలు మాలో ఉన్న ఆలోచనలు పెంపొందించడానికి మా చదువులో భాగంగా (అసైన్మెంట్) మా అమ్మమ్మ నాన్నమ్మలకు వచ్చే ఎటువంటి కథలైన చిన్నప్పుడు పిల్లలని నిద్రపుచ్చే ముందు లేదా ఖాళీ సమయంలో ప్రయాణాలలో చెప్పే కథలు.

దీని వలన ఈ కథలు ఇక్కడే ఆగకుండా వచ్చే తరాలకు ఉపయోగపడటం కోసం మా అధ్యాపకురాలి ఉద్దేశం.

# 49. అమరలింగడు

అనగనగా ఒక అమరలింగడు ఉండేవాడు. అతనికి అమ్మ మాత్రమే ఉండేది, నాన్న ఉండేవాడు కాదు. పండగ దగ్గరిలో ఉన్నపుడు ఒక రోజు పిల్లలందరు ఆడుకుంటుంటే, పిల్లలు అమరలింగడు నీకు ఎవరూ లేరు అని ఎక్కిరించారు, నీకు అక్క, బావ ఎవరూ లేరు అని అన్నారు. తర్వాత అతను అమ్మ దెగ్గర్కి వచ్చి మనకి ఎవరూ లేరా, మనం ఇద్దరమేన? అని ప్రశ్నించాడు. అప్పుడు అమ్మ చెప్పింది, నాన్న లేరు, అక్క, బావ చాలా దూరంగా ఉంటారు అని చెప్పింది. తెల్లవారితే సంక్రాంతి పండగ రాగా తోటి పిల్లలందరు మా అక్క, బావ వస్తున్నారు మా అక్క, బావ వస్తున్నారు అని ఎగతాలి చేస్తుంటే, అమరలింగడుకి కోపం వచ్చింది. అప్పుడు వాళ్ళ అమ్మ దెగ్గర్కి వెళ్ళి అసలు అక్క, బావ ఎక్కడ ఉంటారు అని పట్టుపట్టి కూర్చున్నాడు. అప్పుడు వాళ్ళ అమ్మ చాలా దూరంగా ఉన్నారు అని చెప్పి, వాళ్ళు కైలాసంలో ఉంటారు అని చెప్పింది. అక్కడ నివసించే శివ పార్వతులే నీ అక్క, బావ అని చెప్పి, భోజనం చేసి పడుకున్నారు. మరుసటి రోజు తల్లి లేచి చూసేసరికి అమరలింగడు కనిపించక పోయెసరికి, ఎక్కడికి వెళ్ళాడో అని చుట్టు ప్రక్కల వెతికి చూడగా, ఒక

బాలుడు ఆ తల్లి దెగ్గర్కి వచ్చి అమరలింగడు, ఆ అడవి వైపుగా వెలుతుండగ నేను చూసానని చెప్పాడు.

అమరలింగడు ఆ అడవిలో అక్క, బావ అక్క, బావ అని కలవరిస్తూ ముందుకు సాగుతున్నాడు. అలా వెళుతూ.. వెళుతూ..మరుసటి రోజూ కైలాసానికి చేరుకున్నాడు. అలా తన అక్కా, బావ అయిన శివ పార్వతులను కలుసుకొని వాళ్ళ పాదాలకు నమస్కరించి, వాళ్ళని హత్తుకొని, పండగకి రమ్మని ప్రాదేయపడతాడు. సరే నువ్వు ఇంటికి క్షేమంగా వెళ్ళు మేము పండగ కి వస్తాము, అమరలింగడు తిరిగి ఇంటికి వస్తాడు. వచ్చాక అమ్మతో చెప్తాడు. అమ్మా అక్క, బావ పండగకి ఇంటికి ఒస్తున్నారు. అమ్మ పిండి వంటలు చెయు అక్క, బావ వస్తున్నారు, అప్పుడు అమ్మ అంటుంది ఇప్పటి దాకా నువ్వు ఎక్కడకి వెళ్ళిపోయావ్ రా? అప్పుడు అమరలింగడు అంటాడు అక్క, బావలను పిలవడానికి వెళ్ళాను అని చెప్పాడు. ఇక తెల్లవారగ శివ, పార్వతులు రానే వచ్చారు. రండి బావ, రండి అక్క అని కుర్చొబెట్టాడు. అప్పుడు అమరలింగడుని చూసి వెక్కిరించిన పిల్లలందరు తన అక్క బావలను చూసి ఇతనికి అందరు ఉన్నారు అని అనుకున్నారు. కాసేపటికి అమరలింగడు తను తన అక్కగా అనుకుంటున్న పార్వతమ్మతో ఇలా అంటాడు, అక్క నీకు ఏమేమి పిండివంటలు కావాలో చెప్పు అమ్మ చేసి పెడుతుంది. అప్పుడు పార్వతమ్మ ఏమి వొద్దు తమ్ముడు అని, తన ముందు అన్ని రకాల పిండి వంటలను ప్రత్యక్ష పరుస్తుంది. వాటిల్లో పంచభక్ష పర్వాన్నాలు కూడా ఉన్నాయి. తరవాత శివ పార్వతులు భోజనం చేసి వాళ్ళకు బట్టలు పెట్టి ఆశిర్వదించారు, వెల్లి వస్తామ్ తమ్ముడు అని చెప్పి వెల్తుండగ, అమరలింగడు అప్పుడప్పుడు ఇలా పండగలకి వస్తు ఉండండి అని చెప్పసాగాడు. శివ పార్వతులు తిరిగి కైలాసానికి చేరుకున్నారు.

**నీతి:** అనుకుంటే దేనినైన సాధించవచ్చు.

*కథ చెప్పినవారు : అమ్మమ్మ- నాగమణి*
*వయస్సు: 60 సంllలు*
*మచిలీపట్నం (పెడన), కృష్ణ జిల్లా, ఆంధ్రప్రదేశ్*

*సేకరించినవారు :*

**P. Anitha**

Roll number: 1058-22-111-049

BA (EPP) 2nd year

# 50. రాజు-జుట్టులేని ఐదుగురు భార్యలు

అనగనగా ఒక ధర్మపురం అనే రాజ్యం ఉండేది. ఆ రాజ్యానికి మహీంద్రా అనే రాజు ఉన్నాడు. అతనికి ఐదుగురు భార్యలు, వాళ్ళలో మొదటి భార్యకు ఒక వెంట్రుక మాత్రమే ఉంటుంది. రెండవ భార్యకి రెండు వెంట్రుకలు, మూడవ భార్యకి మూడు వెంట్రుకలు, నాలుగో భార్యకి నాలుగు వెంట్రుకలు, ఐదోవ భార్యకి ఐదు వెంట్రుకలు. కానీ రాజుకి ఐదవ భార్య అంటే చాలా ఇష్టం. ముందు నాలుగు భార్యలను పట్టించుకునే వారు కాదు. కానీ మొదటి భార్యకు రాజుగారు అంటే చాలా ఇష్టం. మహీంద్రా రాజు గారికి మొదటి భార్య అంటే అసలు గిట్టదు. ఒకరోజు ముందు నలుగురు భార్యలు వెళ్ళి మేము కూడా మీ భార్యలమే మమ్మల్ని కూడా పట్టించుకోండి అని అందులో ఒకరు అంటారు. అప్పుడు రాజు ఆలోచించి కొంత సొమ్మును వాళ్ళ ముందల పెడతాడు. తీసుకొని ఎక్కడికైనా వెళ్ళి బాగా బతకండి అని చెప్తాడు. మొదటి భార్య తప్ప మిగతా ముగ్గురు ఆ సొమ్మును తీసుకొని వెళ్ళిపోతారు.

మొదటి భార్య మాత్రం నాకు సొమ్ము వద్దు మీరు కావాలి అని అంటుంది, నేను మీతోనే ఉంటాను అని అంటుంది. అందుకు రాజు ఒప్పుకోరు. ఏడ్చుకుంటూ చనిపోదామని అక్కడి నుంచి వెళ్ళిపోతుంది. అలా వెళ్తుండగా ఒక వృద్ధురాలు ఎదురవుతుంది, అప్పుడు ఆమెని ఆపి ఏమైంది ఎందుకు ఏడుస్తున్నావు అని అడుగుతుంది. ఆమె జరిగింది చెప్తుంది. వృద్ధురాలు ఇలా చెప్తుంది ఇదే దారి గుండా వెళ్ళు నీకు ఒక వృద్ధాశ్రమం కనిపిస్తుంది. అక్కడ సాధువు ఉంటాడు, అతన్ని కలువు నీకు అంతా మంచి జరుగుతుంది అని వృద్ధురాలు చెబుతుంది. మొదటి భార్య సరే అని అక్కడి నుండి వెళ్తుంది. అలా వెళ్తుండగా ఒక గులాబీ మొక్క ఎదురైంది, ఎండిపోవడం చూసి నీళ్ళు పోసి వెళ్తుంది. అలా కొంచెం ముందుకు వెళ్ళగా, ఒక

ముసలామె నీరసంగా కూర్చుని ఉండడం గమనిస్తుంది. ముసలావిడకి కొద్దిగా అన్నం వండి ఆమెకి పెట్టి అక్కడి నుండి ముందుకివెళ్తుంది. అలా కొద్ది దూరం వెళ్ళగా అక్కడ ఒక ముసలి తాత దెబ్బలు తగిలి పడి ఉంటాడు. ఆమె ఆ తాతని లేపి, తన చీరను చింపి ఆ తాత తలకి కట్టు కట్టి, చెట్టు కింద కూర్చోబెట్టి వెళ్తుంది. కొంచెం దూరం వెళ్ళగా ఆశ్రమం దగ్గరికి చేరుకుంటుంది. అక్కడ ఒక సారి చెట్టు కింద కూర్చుని ఉంటాడు. సాధు దగ్గరికి వెళ్ళి జరిగింది చేప్తుంది ఆయన నదిలోకి వెళ్లి 3 సార్లు మునగమనగా, 3 సార్లు మునుగుతుంది. జుట్టు మొత్తం వస్తుంది.

పువ్వు పూస్తుంది, ఆ పువ్వు తీసుకొని తలలో పెట్టుకుని రాజ్యానికి వస్తుంది. అప్పుడు ఆ రాజు ఆమెను చూసి ఇంత అందమైన భార్యను వెళ్ళిపోమన్నానా అని అనుకోని, ఆమెను రాజ్యానికి ఆహ్వానిస్తాడు. అప్పటినుండి ఐదోవ భార్యని పట్టించుకోడు. అప్పటినుంచి ఐదో భార్య మొదటి భార్యని చూసి ఈర్ష్యతో కోపంతో ఉంటుంది. ఆమె ఇంత అందంగా ఎలా తయారయింది అని ఆలోచిస్తుంది ఐదవ భార్య. ఏమైనా ఆమె ఇంత అందంగా ఎలా తయారయిందో తెలుసుకోవాలని కూడా ఏడ్చుకుంటూ వెళ్ళిపోతుంది. ఐదో భార్యకి కూడా ఒక ముసలావిడ ఎదురై మొదటి భార్యతో చెప్పిన విధంగానే చెప్పింది. ఐదో భార్యకు ఆ ముసలావిడ చెప్పింది నేను వినాలా అని పొగరుతో అక్కడి నుండి వెళ్ళిపోయింది. అలా వెళుతుండగా ఒక ఎండిపోయిన మొక్క కనిపిస్తుంది, దాని చూసి పీకి వెళ్ళిపోతుంది. ముందుకు వెళు తుండగా ఒక ముసలావిడ నీరసముగా కనిపిస్తుంది.

ముసలావిడకి సహాయం చేయకుండా ఆమె పక్కకు నెట్టి, ఆమె సామాన్లు విసిరేసి వెళ్తుంది. అలా నడుస్తుండగా ఒక ముసలి చాకలి కనిపిస్తాడు, అతని సామాన్లు అన్ని కింద పడేసి ముందుకు వెళ్తుంది. అక్కడి నుండి కొద్ది దూరం వెళ్ళాక సాధువు ఆశ్రమం కనిపిస్తుంది. చెట్టు కింద సాధువును చూసి సాధువు దగ్గరికి వెళ్ళి జరిగింది చెప్తుంది. ఆయన నదిలోకి వెళ్ళి మూడుసార్లు మునగమని చెప్తాడు. అలాగే స్వామి అని చెప్తూ నది దగ్గరికి వెళ్తుంది. ఆయన చెప్పినట్లు మూడుసార్లు మునుగుతుంది, జుట్టు మొత్తం వస్తుంది. అయితే మొదటి భార్య కన్నా ఎక్కువ జుట్టు రావాలని అత్యాశతో ఇంకోసారి మునుగుతుంది. కొత్త జుట్టు రాక ఉన్నా ఐదు వెంట్రుకలు కూడా ఊడిపోయాయి. స్వామి దగ్గరికి వచ్చి విషయం చెప్తుంది. చూడమ్మా నేను చెప్పింది మూడు సార్లు మాత్రమే మునగమన్నాను, కానీ నీకు ఉన్న అత్యాశతో ఉన్న

వాటిని కూడా పోగొట్టుకున్నవ్, దాన్ని ఫలితం అనుభవించు అని అక్కడి నుండి వెళ్ళిపో అని అంటాడు. ఆమె ఎడ్చుకుంటు అక్కడ్నుంచి వెళ్ళిపోతుంది. అలా నడుస్తుండగా ముసలి చాకలి దగ్గరికీ వస్తోంది. చాకలి ఇలా అంటాడు నాకు సహాయం చెయ్యకుండా నా సామాన్లు విసిరి పడేస్తావా అనీ ఇస్త్రిరి పెట్టెతో వాత పెడతాడు. ఇంకొంచెం దూరం వెళ్ళగా, ముసలివ్వ దగ్గరికి వస్తుంది ముసలివ్వ కూడా తిట్టుతుంది. మొక్కకున్న గులాబీ పువ్వులు తెంపుదామని అనుకుంటుంది, నీ గులాబీ పువ్వు కొన్న ముళ్ళు గుచ్చుకోవడంతో అక్కడి నుండి ఏడ్చుకుంటూ వెళ్ళిపోతుంది. అత్యాశతో తనకున్న జుట్టును కూడా పోగొట్టుకుంది.

**నీతి:** మానవునికి గర్వంతో పాటు అత్యాశ కూడా పనికిరాదు.

సేకరించిన వారు:

**జి భారతి**

క్రమ సంఖ్య: 1058-22-405-164

గ్రూపు: బీకాం కంప్యూటర్స్

# 51. స్నేహమే బహుమతి

**సందర్భం:**

మా తెలుగు అధ్యాపకురాలు మాలో ఉన్న సృజనాత్మకతను పెంపొందించడం కోసం మాకు అసైన్మెంట్‌లో భాగంగా, మా అమ్మమ్మ, నానమ్మలకు వచ్చే అటువంటి చిన్న, చిన్న కథలు, అంటే పిల్లల్ని పడుకోబెట్టే సమయంలో కానీ, ఖాళీగా ఉన్న సమయంలో కానీ, ఏదైనా సందర్భంలో కథలు చెప్తూ ఉంటారు కదా! ఆ కథలను మీరు మీ అమ్మమ్మల, నానమ్మల నుండి సేకరించి, వాళ్ళు చెప్పేటప్పుడు ఫోన్‌లో వీడియో రికార్డ్ చేసి, వాళ్ళు చెప్పిన మాటలను మనం మాట్లాడుకునే భాషలో కొన్ని పదాలను మార్చి మన పుస్తకాల్లో రాసుకొని, దాన్ని తప్పులు లేకుండా మైక్రోసాఫ్ట్ వర్డ్‌లో టైప్ చేసి పిడిఎఫ్ రూపంలో మా అధ్యాపకురాలికి సమర్పించడం చేయమన్నారు. ఎందుకంటే అమ్మమ్మ నానమ్మల నోటికి వచ్చే కథలను వాళ్ళతోనే కనుమరుగై పోకుండా, వాటిని సేకరించి, పుస్తకాలు అచ్చు వేసి ఉండడం వల్ల వచ్చే తరాల వాళ్ళకి మనం అందించలుగుతాము కాబట్టి ఆ ఆలోచనలో భాగంగా మా అధ్యాపకురాలు వలన మేము అమ్మమ్మ , నానమ్మల ద్వారా కథలను సేకరించాము వాటిని అచ్చు వేయడం జరుగుతుంది. దసరా సెలవుల్లో నేను నా కుటుంబం కలిసి మా ఊరికి వెళ్ళాను. అమ్మమ్మ మమ్మల్ని చూసి సంతోషించింది . మర్నాడు నేను మా మామయ్య కొడుకుకి చెప్పాను అమ్మమ్మతో కథ చెప్పించుకుందాం అని వాడు సరే అక్క అన్నాడు. అప్పుడు నేను వాడు కలిసి అమ్మమ్మ దగ్గరికి వెళ్ళి కథ చెప్పించుకున్నాం, కథ పేరు స్నేహమే బహుమతి.

ఇక్కడి నుండి కథ ప్రారంభం..

విషయం: స్నేహం చేయడం ఒక గొప్ప అనుభూతి స్నేహం అనే అనుభూతిని పాలుపంచుకునే వారిని స్నేహితులు అని అంటారు.

* * *

సింగమల అనే అడవిని కంటి అనే సింహం పాలిస్తూ ఉండేది. దానికి నక్క, కాకి అనుచరులుగా ఉండేవి. ఓ రోజు కాకి ఎగురుకుంటూ వచ్చి 'మన అడవికి దూరంగా ఉన్న ఎడారిలో ఒంటెను చూశాను. దాన్ని వేటాడగలిగితే మనకు వారం పాటు ఆహారానికి సమస్య రాదు!' అని చెప్పి సింహాన్ని, నక్కని బయల్దేరేలా చేసింది. కానీ ఎడారిలోకి అడుగుపెట్టగానే అక్కడి వేడికి సింహం, నక్కల కాళ్ళు కాలి నడవలేక పోయాయి. దాంతో కాకి ఒంటె దగ్గరికి కెళ్ళి 'మిత్రమా! నువ్వు మా రాజు సింహాన్ని మంత్రి అడవిలో దించగలవా !' అని అడిగింది. ఒప్పుకున్నా ఒంటే సింహాన్ని, నక్కని మోసుకుంటూ వాళ్ళ స్థావరానికి తెచ్చింది. దాని మంచితనం సింహానికి బాగా నచ్చింది దాంతో 'మిత్రమా! నువ్వు కూడా మాతోపాటు ఇక్కడే ఉండు!' అని అంది ఒంటెతో. సింహం ఉన్నపలంగా తీసుకున్న ఈ నిర్ణయం నక్కకి, కాకికి బొత్తిగా నచ్చలేదు. అవి ఓ  ఉపాయం పన్నాయి. 'మహారాజా! కాళ్ళు కాలడం వల్ల మీరు ఇప్పట్లో వేటాడలేరు. మీరు ఆకలితో ఉండటం మేము చూడలేము. కాబట్టి మమ్మల్ని తినండి!' అన్నాయి. అది ఒంటె 'వాళ్ళని వద్దులే రాజా! నన్ను చంపితే మీ ముగ్గురికి వారం పాటు ఆహారం కాగలను అంటూ ముందుకు వచ్చింది .నక్క ,  కాకి ఆ మాట కోసమే ఇలా అలా నాటక మాడాయి అని సింహానికి అర్థమైపోయింది. దాంతో 'సరే ఒక్కొక్కరుగా వరుసగా రండి ముందు చిన్న జీవితో మొదలుపెడతాను. కాకి నువ్వు రా ముందు అంది ఆ మాటకి కాకి తుర్ర మంటే నక్కేమో పరుగు లగించింది ఒంటె,  సింహం మాత్రం అప్పటి నుంచి మంచి స్నేహితులుగా ఉండిపోయారు.

**ముగింపు:**

స్నేహితులు అంటే మనలాగానే ఆలోచించి మనలను బాగా అర్థం చేసుకునే వ్యక్తులు స్నేహానికి విభేదాలు ఉండవు నిజమైన స్నేహం స్వచ్ఛమైనది అవి ఎలా అంటే స్వార్థపూరిత ఆలోచనలకు తావు ఉండదు.

**అభిప్రాయం:** ఈ అసైన్మెంట్ ద్వారా మేము స్నేహం గురించి ఎన్నో విషయాలు తెలుసుకున్నాము అది స్నేహం అనేది మన జీవితంలో ఒక గొప్ప అనుభూతి.

**ముగింపు:**

ఈ అసైన్మెంట్ ఇచ్చినందుకు మా తెలుగు ఉపాధ్యాయురాలికి మా హృదయపూర్వక ధన్యవాదాలు.

# 52. మేడారం జాతర ఆవిర్భావం - చరిత్ర సమ్మక్క సారలమ్మ సమ్మక్క సారలమ్మ జాతర

సమ్మక్క యొక్క అసాధారణ శక్తుల గురించి అనేక కథలు ఉన్నాయి. సమ్మక్క మరియు సారలమ్మల పురాణ కథ గురించి చెప్పే గిరిజన కథ మనకు ఉంది. ఈ కథ 13వ శతాబ్దానికి చెందినది. కొంతమంది గిరిజన పురుషులు వేటకు వెళ్ళారు, లోతైన అడవిలో వారు ఒక నవజాత శిశువును కనుగొన్నారు మరియు ఒక మహిళ అక్కడ ఆమె పేరు సమ్మక్క అని అలాగే పులుల మధ్య ఒక గొప్ప సౌమ్య ఆటను విడుదల చేసింది. సమ్మక్కను వారి నివాసానికి తీసుకువెళ్ళారు. సంఘం అధిపతి ఆమెను దత్తత తీసుకోవాలని నిర్ణయించుకున్నారు మరియు వారు ఆమెను ప్రధాన నాయకురాలిగా పెంచారు (సమ్మక్క తరువాత ఈ ప్రాంతంలోని సమూహానికి సావోయిర్ అయ్యింది). ఆమె కాకతీయుల సామంత సంస్థ నాయకుడు పగిడిద్దరాజును వివాహం చేసుకుంది (ఆయన క్రీ.శ. 1000 మరియు క్రీ.శ. 1380 మధ్య కాలంలో వరంగల్ నగరం నుండి ఆంధ్ర దేశాన్ని పరిపాలించాడు).

పగిడిద్ద రాజు మరియు సమ్మక్క రాజ్యంలో వారు గిరిజనులందరినీ రక్షించారు.

సమ్మక్కకు ముగ్గురు పిల్లలు: 1. సారక్క 2. జంపన్న 3. నాగమ్మ

కాకతీయ పాలకుల పాలనలో రాజు పగిడిద్ద రాజు రాజ్యాన్ని రక్షించేవాడు మరియు కాలక్రమేణా సారక్క గోవిందరాజును వివాహం చేసుకున్నారు ఈ సమయంలో అంతా బాగానే ఉంది.

కానీ ప్రతాపరుద్రుని పాలనలో అతను కోయ తెగ వారు చెల్లించలేని పన్నులు విధించాడు. ఈ విషయం చూసి రాజు పగిడిద్ద రాజు కాకతీయులపై యుద్ధం ప్రకటించి, యుద్ధానికి సరైన పరికరాలు లేకున చాలా ధైర్యంగా యుద్ధం చేసాడు, చాలా మంది గిరిజనులు యుద్ధంలో ఉన్నారు, కానీ దురదృష్టవశాత్తు పగిడిద్ద రాజు మరియు చాలా మంది గిరిజనులు కూడా కాకతీయ సైన్యం చేత చంపబడ్డారు.

సమ్మక్క తనతో పాటు యుద్ధాన్ని చేపట్టింది 1. సారక్క, 2. గోవిందరాజు (సారక్క భర్త), 3. జంపన్న, 4. నాగమ్మ

వీరంతా ఆదివాసీ సైన్యంతో యుద్ధానికి దిగి సమ్మక్క చాలా ధైర్యంగా పోరాడింది, కాకతీయ సైన్యం చాలా ఆశ్చర్యపోయింది, వీర సమ్మక్క కొడుకు కావడంతో జంపన్న తన చివరి శ్వాస వరకు పోరాడి తీవ్రంగా గాయపడి శరీరమంతా రక్తం కారుతోంది. "సంపెంగ వాగు"లో పడింది, దీనికి "జంపన్నవాగు" అని పేరు పెట్టారు, సారక్క మరియు గోవిందరాజు కూడా యుద్ధంలో మరణించారు, సమ్మక్క తన ప్రియమైన వారందరి మరణవార్త విని "భద్రకాళి" లాగా మరియు బాధతో హృదయంలో దుఃఖం ఆమె కాకతీయ సైన్యంతో చాలా గట్టిగా పోరాడింది ఆ విధంగా కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు "సారె"తో శాంతికి పిలుపునిచ్చినా సమ్మక్క శాంతించలేదు మరియు ధైర్యంగా పోరాడింది కాని అకస్మాత్తుగా కాకతీయ సైన్యానికి చెందిన ఒక సైనికుడు ఆమెను వెనుక నుండి ఖడ్గంతో పొడిచాడు, సమ్మక్క అతనిని తిరిగి చంపి వేసింది.

గాయాన్ని గుడ్డతో కప్పాధి, తిరిగి పోరాడటానికి వెళ్ళి సైన్యంలోని అందరినీ ఒంటరిగా చంపింది, ఆపై ఆమె తన గుర్రం ద్వారా చిలకలగుట్ట వైపుకు వెళ్ళి అదృశ్యమైంది, గిరిజనులు ఆమెను వెతకగా, అక్కడ కొన్ని గాజులతో "కుంకుమ బర్ని" కనిపించింది. ఆ స్థలంలోనే సమ్మక్క చిన్నప్పుడు దొరికింది

అప్పటి నుండి కోయ తెగ వారు సమ్మక్క "ఆదిపరాశక్తి" అని నమ్ముతారు మరియు. ఆమె తమను రక్షించడానికి వచ్చింది. సమ్మక్క చిలకలగుట్టకు వెళ్తుందని కూడా నమ్ముతారు ఎందుకంటే ఆమె రక్తపు చుక్కలు నేలపై పడితే ఆ ప్రదేశం ఎప్పటికీ నిర్మానుష్యంగా ఉంటుంది. ఈ విధంగా సమ్మక్క మర్మమైన దేవుడు మళ్ళీ కనిపించలేదు, ఆ సంఘటన తర్వాత కోయ తెగకు దేవుడుగా మారిన సంఘటన ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి "మాఘ శుద్ధ పూర్ణిమ" నాడు గిరిజన పూజారులు ఆ "కుంకుమ బర్ని"ని మైదానానికి తీసుకువస్తారు మరియు కన్నెబోయిన పల్లి నుండి సారక్కను కూడా తీసుకువస్తారు అడవిలో పొరుగు (గ్రామం) సాయంత్రం మరియు గద్దెపై ఉంచారు. వారు 3 రోజులు పూజించబడతారు మరియు నాల్గవ రోజున, ఈ చివరి రోజున, దేవతలను తిరిగి అడవిలోకి అమ్మవారి మూలస్థానాలకు తీసుకువెళ్తారు. ఈ వేడుకను "వనప్రవేశం" అంటారు.

సమ్మక్క జాతర నాలుగు రోజులు సాగుతుంది: 1వ రోజు :- మాఘ శుద్ధ పౌర్ణమి (బుధవారం)

కన్నెపల్లి నుంచి మేడారం వరకు సారక్క విగ్రహాన్ని తీసుకెళ్తారు. పగిడిద్ద రాజు విగ్రహాన్ని పూనుగొండ్ల నుంచి మేడారం వరకు తీసుకువెళ్తారు

2వ రోజు : గురువారం

సమ్మక్క విగ్రహం మరియు కుంకుమ పేటికను చిలకలగుట్ట (కుంకుమ పేటికను ఉంచే కొండ.)పై కోయ తెగలు సుదీర్ఘ రహస్య పూజల తర్వాత (సాధారణంగా అర్ధరాత్రి) మేడారం వరకు తీసుకువెళ్తారు (కుంకుమ పేటికను ఉంచే కొండ.) గోవింద రాజు విగ్రహాన్ని కొండాయి నుండి మేడారం వరకు తీసుకువెళ్తారు.

3వ రోజు : శుక్రవారం (జాతర శిఖరాగ్ర రోజు) (ఆది పరాశక్తిని ఆరాధించే రోజుగా నమ్ముతారు)

సమ్మక్క మరియు సారక్క వారి భార్తలు వరుసగా పగిడిద్ద రాజు మరియు గోవింద రాజులను పూజిస్తారు. భక్తులు జంపన్న వాగులో స్నానమాచరించి సమ్మక్క సారక్కలకు నైవేద్యంగా సమర్పించే ముందు బెల్లంతో తూకం వేస్తారు.

4వ రోజు : శనివారం

జాతర "తల్లుల వనప్రవేశం" (అడవిలోకి ప్రవేశం)తో ముగుస్తుంది. కుంకుమ పేటికను తిరిగి చిలకలగుట్టకు తీసుకువెళ్ళి తదుపరి జాతర వరకు అక్కడే ఉంచుతారు.

**ముగింపు**: ఈ అసైన్మెంట్లో నేను చాలా విషయాలు నేర్చుకున్నాను, ఈ పనిలో నేను సమ్మక్క దేవత గురించి చాలా విషయాలు తెలుసుకున్నాను, తను కేవలం దేవత మాత్రమే కాకుండా నేటి మహిళలకు స్ఫూర్తిని కలిగి ఉండాలి మరియు కోయ తెగకు గొప్ప నాయకులు, స్త్రీలు పురుషుల కంటే తక్కువ కాదని నిరూపించారు.

*సేకరించిన వారు:*
**వి. అమూల్య**
బి.కాం, బి.ఎ బిజినెస్ అనలిటిక్స్
రూల్ నంబర్: 1058-22-538-059

# 53. అన్నా చెల్లెలు

**సేకరించిన విధానం :** నేను మా నానమ్మ నీ కథ అడిగే అప్పుడు మా నానమ్మ ఎందుకు ఏంటీ అని ఒక మాట కూడా అడగకుండా అన్నా చెల్లెలు కథ చెప్తా అని నాకు ఎంతో చక్కగా కథనీ చెప్పింది.

వునంగ వునంగా ఓ రాజు ఉండే అంట. హ రాజుకి ఒక కొడుకు ఒక బిడ్డ అంట అయితే ఇంక అయిన వేట మార్గం పోతాడు. అయితే వేటమార్గం పోతే భార్యకి లెస్స జ్వరం వస్తది. జ్వరం వస్తే పండుకొని ఉంటది. ఏం తినకుండా గూట్లో పిట్ట పిల్లల్లానీ చేస్తది అవీ కిందపడ్డాయి. అవీ కిందా పడంక చచ్చిపోయినయ్ సచ్చిపోతే వాటిని చూసి ఏడ్వడం మొదలు పెట్టింది. నా పిల్లలు కూడా రేపు నేను చచ్చిపోతే నా పిల్లలు ఎంత అవస్థ పడతారు. ఏంటీ కథ అనీ ఆమె ఏడుస్తది ఏడుస్తే ఇంక లెస్స జ్వరంలోనే అమ్మే పాణం పోతది.

పాణం పోతే రాజు వచ్చే వరకు పెండ్లాం పాణం పోతది. పోతే ఈ పిల్లల తల్లి మీద పడి ఊకే ఏడుస్తుంటే... ఇంకా రాజు వచ్చి అయ్యో ఎట్లాయే ఏం కథ అయ్యో ఇట్లా అయ్యే అని బాధ పడతాడు.

ఇంక పిల్లలు పెద్దగా అయితరు ఇంక పోయి తండ్రి పడుకొనే మంచం మీద అన్న చెల్లి పోయి పడుకుంటారు. ఇంక పడుకున్నాక ఏం చేస్తదంటే మరదలు ఇంగో పిల్లలు గట్ల పండ్రిరు అని పాములోడి కాడికి పోయి చిన్న పాముని తెస్తది.

చిన్న పాముపిల్లని తెచ్చి నీళ్ళలో వేస్తది. కానీ బడికి పోతరు కానీ నీళ్ళలో వేస్తే ఆ పిల్లకి దూపయ్యి నీళ్ళు గట్టా గట్ట అని నీళ్ళు తాగుతారు.

తాగే వరకల్ల వీళ్ళకు ఇద్దరూ అన్న చెల్లికి మంచిగా లేదు ఆల్లని తీస్కపొయ్యి అడవిలో ఇడిచి వస్తనే నేను ఉంట లేకుంటే నేను ఉండను అని అంటుంది. అన్న

తర్వాత రాజు ఏం చేస్తడు.. అయితే ఏం అయ్యే పట్టు అని పిల్లలకి పెండ కడతది రాజుకేమో మంచి భోజనాలు కడ్తది.

కట్టినంగ పోతారు పోంగ పోంగా నయనా మాకు ఆకలి అయితుంది దూప అయితుంది ఏడ కూర్చోవాలి ఏడ తినాలి అని పిల్లలు అంటారు తండ్రి తోని అన్నంక ఇంక సరే నాయిన కూర్చుందాం పా అనీ ఒక బాయి వస్తది.

హ బాయి సాట్టుకి పోతారు బాయి సాటుకి పోయి చెట్టు నీడకి కూర్చొని తిందం అనే వరకూ అంత పెండ అయినది, పిల్లలది ఏమో భక్ష భోజనాలు అయితే డాడీ ఇట్ల పట్టు అనే సరికి మూతి కడ పెట్టే వరకు పెండ అయితది.

అయ్యో రామా నాకు తినే ప్రాప్తం లేదు ఏమో అనీ చెప్పి నీళ్ళు తాగీ ఇంక అట్లే ఒరుగుతరు. పిల్లలు బాగా నిద్రపోతారు నిద్రపోయినంక ఒక మొద్దు తెచ్చి ఇద్దరి నడ్డిమన పండ పెడతాడు. పండ పెట్టి మీద శాల్వ కప్పి ఇంక ఆయిన ఇంటి తొవ్వ పడతడు.

ఇంక పిల్లలకు మేల్కు వచ్చి అయ్యో నాయన మొద్దు అయిండు అని చెప్పి ఏడుస్తారు ఏడ్చినకా గంధం చెక్కలను తెచ్చి ఇత్త మొద్దుని కాలపెడతరు కాల పెట్టీ అన్న మనం ఎటు పోదాం ఏంటి కథ అని ఏడ పోయి ఎట్లా బతుకుదం అని వొలపోస్కుంట పోతారు.

పోయినాక ఇంక సరే అని పోదాంప అనీ పోంగ పోంగా తంబళ పెద్దమ్మ వస్తది తంబళ పెద్దమ్మ వచ్చినాక అవ్వా అవ్వా నువ్వు ఏ పని చెప్పిన వింటాం ఏ పనీ చెప్పిన చేస్తాం పెద్దమ్మ మాకో పనీ చెప్పు అన్ని ముసలామెని పిల్లలు అడుగుతారు. సరే నాయిన ఉండుర్రి అని చెప్పి ఇద్దర్కి పిలుచుకొని ఇంట్లో ఉంచుతది ఇంట్లో ఉంచుతే మరి ఏం చేయాలి పెద్దమ్మ అని చెప్పి పిలగాడు అడుగుతాడు. అడిగేది ఏంది నాయిన పసులని కొట్టుకుపోయి మేపుకు రాపో అని పెద్దమ్మ చెప్తది చెప్పినక ఈ పిల్ల చేసేది. ఈ పిల్ల చేస్తుంటే ముసలామె చూస్తది ఇంక చూస్తే కడుపు అమ్మేకి జెర కనపడ్డది అన్నమాట.

ఇంక అయినాక...

అయితే ఓ రోజు పిల్ల స్నానం చేసి పడుకుంటాది. పడుకొని ఉంటే నొట్లంగ వచ్చి ఉట్టి మీద పెట్టిన పాలు తాగుతది పాము.

తాగినాక వాళ్ళ అన్న కనిపెడతాడు ఏంది రా పాలు ఉట్టిలో పెట్టినవి మాయం అయితునయ్యి అని యెక్కడ పోతున్నాయి ఏంటీ కథ అనీ పన్నెండు ఇంటికి గోడ సాటుకి నిలపడి చూస్తాడు.

చెల్లి పడుకొని ఉంటది చెల్లెలు పడుకొని ఉంటే నొట్లొంగ పాము వచ్చి అట్లే ఇంగ ఉట్టికి ఎక్కి పాలు తాగుతుంటది తాగినాకా దిగేటప్పుడు గొడ్డలి తీస్కొని ఏడికి ఆడికి నర్కుతాడు. దానిని వాళ్ళ చెల్లి చూడక తొలిగానే నరికి వో దాంట్ల తిస్కపోయి లాస్ట్ అర్రలో పోస్తాడు. పోసినక మంచిగా మల్లెపూలు అయితయి. అయినాక నాకు కడుపంత వుతగనే వుంది అని హో ముసలామెతో నీ చెప్తది పెద్దమ్మ పెద్దమ్మ నాకు కడుపంత వుత్తదే ఉంది ఏం అయింది ఏం అయింది ఇట్ల అయ్యే అంటే ఏమో బిడ్డా! నీకే తెల్వాలి మాకు తెల్వదు అని ముసలామె అంటది. అన్నాక ఇంక అన్న ఏం చెప్తాడు అంటే అన్నీ చూడు కానీ ఒక్క లాస్ట్ అర్ర చూడకు అని చెప్తాడు.

హో.. హ.. మా అన్న ఎందుకు చెప్పిండు అని మూస్కుంట తీర్చుకుంట వస్తది అయితే లాస్ట్ అర్ర వస్తది. అర్ర వచ్చే వరకు తలుపు తీసే వరకు మంచి పూల వాసన వస్తది.

బస్తోడు మా అన్న ఎందుకు నాకు అబద్దాలు చెప్పి అని చూడు కాని ఈ ఒక్కటి చూడొద్దు అనే మా అన్న అని హ... పూలు తెంపుక పోతాది. తెంపుక పోయి పూల దండ కుచ్చుతది. ఒకటి మెడకి ఒకటి చేతుకి. వస్తడు ఇంక వస్తే చేతులు కడుకోనియ్యదు తిననియ్యదు, పోయి పూల దండ మెడకి వేస్తది. చేతికి కడతది, కట్టేసరికి పాము అయితడు.

పోంగ పోంగ పోయి పెద్ద అడవిలో ఒ పెద్ద పుట్ట ఉంటది హ పుట్టల పోయి పడతాడు.

పడే వరకల అన్న నిన్ను చూడపోతి ఇట్ల అయితది అని నాక్ తెల్వదు అని ఇంక మీద పడ్తుంటే, అడవికి అన్నదమ్ములు అటు మార్గం పోయి వస్తుంటారు.

వస్తుంటే.. ఈ అడవిలో ఎవరబ్బా ఏడుస్తున్నారు అని అన్న అంటే పా.. చూద్దాం పా.. అంటే ఏంది ఎం అయింది అమ్మ ఎందుకు అట్లా ఏడుస్తున్నావు అని అంటే మ అన్న పాము అయ్యి ఇల్ల పడ్డడు. పుట్టల అందుకే ఏడుస్తున్న నాకు ఎవరు లేరు అని ఏడుస్తది. ఆ పిల్ల ఏడిస్తే.. ఇంక ఆ రాజు ఏం చేస్తాడంటే పాముల వాడిని

పిలుస్తాడు. పాములవాడు పాము బయటకు వచ్చే వరకు నాదస్వరం వినిపిస్తాడు. పాము బయటకు రాగానే రాజు పూల దండలు తెంపేస్తాడు. చేతిది మెడది తెంపి వేసాక మంచిగా అయితాడు. మంచిగా అయినాక రాజూ మా చెల్లిని పెళ్ళి చేస్కో అని అన్న అడుగుతాడు. సరే మంచిది అని చేసుకుంటా అని అంటాడు ఇంక పెళ్ళి చేసి వాళ్లని అక్కడ పంపించి ఈ ముసలమ్మ కాడనే ఉంటాడు ఆయిన.

**కథ యొక్క నీతి:** ఎవరు తీసుకున్న గొయ్యిల వాళ్ళే పడతారు. ఎవరికి అయితే చెడు చేద్దాం అనుకుంటామో వాళ్ళకి అంత చెడు జరుగుతది .....

**కథ రాయడం వల్ల ఉపయోగం:** ఎవరికి హాని చేయకూడదు చేస్తే మళ్ళీ మనకే హాని జరుగుతది.

**అనుభవం:** కథ వినడం వల్ల ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను.....

*చెప్పినవారు: శాంతమ్మ*

*వయస్సు: 70 సం॥లు*

*కల్వకుర్తి, మహబూబ్‌నగర్*

సేకరించినవారు :
**ఎన్ .సాయి తరుణి**
BBA (3rd sem)
క్రమ సంఖ్య: 105822684072

# 54. గుణపాఠమే సరైన బహుమతి!

***సేకరణ విధానం:***

మా తెలుగు అధ్యాపకురాలు సృజనాత్మకతను పెంపొందించడం కోసం మాకు అసైన్‌మెంట్ల భాగంగా, మా అమ్మమ్మ నానమ్మలకు వచ్చే అటువంటి చిన్న, చిన్న కథలను, word లో టైప్ చేసి PDF చేసి పెట్టమన్నారు మా అధ్యాపకురాలు. చిన్న పిల్లల్ని పడుకోపెట్టే సమయంలో కాని; ఖాళీ సమయంలో కానీ, ఏదైనా సందర్భంలో కథలు చెపుతూ ఉంటారు కదా! ఆ కథలను మీరు మీ అమ్మమ్మ, నాన్నమ్మలో నుండి సేకరించి, వాళ్ళు చెప్పేటప్పుడు ఫోన్లో రికార్డ్ చేసి, వాళ్ళు చెప్పిన మాటలను వాళ్ళ భాషలోనే మన పుస్తకాల్లో రాసుకొని, దాన్ని తప్పు ఒప్పులు లేకుండా microsoft word లో టైప్ చేసి PDF అధ్యాపకురాలికి submit చేయమన్నారు. ఎందుకంటే అమ్మమ్మ నాన్నమ్మలకు నోటికి వచ్చే రకంగా కథలను వాళ్ళతోనే కనుమరుగైపోకుండా, వాటిని సేకరించి, పుస్తకాల్లో అచ్చు వేసి ఉంచడం వల్ల వచ్చే తరాలకు కూడా మనం అందజేయగలుగుతాము కాబట్టి ఆలోచనలో భాగంగా మా అధ్యాపకురాలు వలన మేము అమ్మమ్మ, నాన్నమ్మల ద్వారా కథలను సేకరించి వాటిని అచ్చు వేయిద్దామన్నారు. మా నాన్నమ్మ నాకు వేరే కథ చెప్పింది కానీ నాకు ఆ కథ నచ్చలేదు కనుక, మళ్ళీ మా నానమ్మ గారిని ఇంకొక కథ చెప్పమని అడిగాను. అప్పుడే ఈ “గుణపాఠమే సరైన బహుమతి “అనే కథ చెప్పారు.

ఒక ఎద్దు మేత కోసమని అడవికి వచ్చింది. అక్కడ దానికి బక్కచిక్కిన నాగుపాము కనిపించింది. ఎంతో ఓపిక చేసుకుని అది..' వృషభరాజా బాగున్నారా?' అని ఎద్దును పలకరించింది. 'పర్వాలేదు. నాగరాజా! మీరేంటి ఇంత ' నీరసంగా ఉన్నారు' ప్రేమగా అడిగింది ఎద్దు. 'సరైన ఆహారం దొరకక ఇలా తయారయ్యా'

అని బాధపడింది. 'నాగరాజా.. నాకూ ఇక్కడ మేత దండిగా దొరకడం లేదు. ఆ కనబడే ఏరు దాటి వెళ్ళాలనుకుంటున్నా. అక్కడ బోలెడన్ని కప్పలు ఒడ్డునే ఉంటాయి. నా కొమ్ములకు చుట్టుకుని కూర్చుంటే... నేను తీసుకువెళతా. వచ్చేటప్పుడు మళ్ళీ ఇక్కడే దించుతా. 'సరేనా?' అంది ఎద్దు. పాము అలాగే చేసింది. రెండూ ఏరు దాటి ఇవతలి వైపు వచ్చాయి. కుప్పలు తెప్పలుగా ఉన్న కప్పలను చూసి సర్పానికి నోరూరింది. అప్పటికప్పుడే ఓ రెండింటిని మింగేసింది. ఇలా ఓ పదిరోజులు గడిచే సరికి పాము బాగా బలం పుంజుకుంది. గర్వమూ పెరిగింది. ఎప్పుడన్నా ఎద్దు రావడం కాస్త ఆలస్యమైతే చాలు 'ఇప్పటి దాకా ఎక్కడ తిరుగుతున్నావు' అని మండిపడుతోంది. అలాగే సాయంత్రం తిరిగి వచ్చేటప్పుడు 'కాసేపు ఉండు. పోదాంలే!' అంటూ చిరుబుర్రులాడుతోంది. ఏ మాత్రం ఎదురు చెప్పినా కాటు వేయడానికి కూడా అది వెనకాడదని ఎద్దుకు అర్థమైంది. ఎలాగైనా దానికి బుద్ధి చెప్పాలనుకుంది మనసులో. ఓ రోజు పొద్దున్నే వచ్చి... 'నాగరాజా.... ఎన్నాళ్ళు కప్పలతో పొట్ట నింపుకుంటారు. మా ఊళ్ళో గురవయ్య కోడి పదిగుడ్లు పెట్టింది. నిన్ను వాళ్ళింటికి తీసుకెళ్తా. అతడికి ఎలాగూ కళ్ళు కనిపించవు కాబట్టి నువ్వు హాయిగా వాటిని తినవచ్చు' అంది. 'భలే... "లే' అనుకుని బయలుదేరింది పాము. నిజానికి అతడు గుడ్డివాడు కాదు. కేవలం మెల్లకన్ను అంతే. పాము గంప దగ్గరకు రావడం చూశాడు. దొడ్డుకర్రతో దాన్ని చావగొట్టాడు. పీడ విరగడైంది. విష జంతువులకు సాయం చేస్తే ఎప్పటికైనా ముప్పే' అనుకుంటూ ఎద్దు అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

**నీతి:** "విష జంతువులకు సాయం చేస్తే ఎప్పటికైనా ముప్పే". "చెడు మనుషులైనా, చెడు జంతువులైనా వారికి సాయం చేస్తే ఎప్పటికైనా మనకి ముప్పు తప్పదు".

**ముగింపు :** నేను ఈ చిన్న కథ రాసినందుకు నాకు ఎంతో సంతోషకరంగా ఉంది. ఎందుకంటే నేను ఎంతో శ్రద్ధగా అమ్మమ్మలు, నాన్నమ్మల నుండి కథలు సేకరించి రాసినందుకు మా మెడమ్ మాకు తరగతి గదిలో కథలు సేకరణ అనే అసైన్మెంట్ రాయమనప్పుడు నేను మా స్నేహితులు ఇలా అనుకున్నాము ఏంది మెడమ్ ఇట్ల చెపుతుంది నాన్నమ్మ, అమ్మమ్మలకు ఫోన్ చేసి రాయమంటుంది, మా అమ్మమ్మకు ఏం గుర్తుందో ఏమో ఎట్లా రాయాలి అబ్బ అని ఆలోచనలో పడ్డాము. కానీ ఎప్పుడైతే మా నాన్నమ్మకి ఫోన్ చేసి అడిగానో లేదో మా నాన్నమ్మ నాకు కథ చెప్పింది. ఎంతో

సంతోషంగా ఎప్పుడో విన్న కథలను నాకోసం గుర్తు చేసుకొని నాకు చెప్పారు. అమ్మమ్మ నాన్నమ్మలకు నోటికి వచ్చే రకంగా కథలను వాళ్ళతోనే కనుమరుగైపోకుండా, వాటిని సేకరించి, పుస్తకాల్లో అచ్చు వేసి ఉంచడం వల్ల వచ్చే తరాలకు కూడా మనం అందజేయగలుగుతాము అనే మా అధ్యాపకురాలి గొప్ప ఆలోచనతో ఈ ప్రాజెక్టును చేసాము.

మా లోని టాలెంటును బయటకు తీసుకురావడానికి మముల్ని గొప్ప స్థాయిలో ఉండాలని మా అధ్యాపకురాలి కోరిక మేము మా అధ్యాపకురాలు చెప్పినట్లుగా నడుచుకుంటాము అని కోరుతున్నాము. నాకు ఈ అసైన్మెంట్ పని ఇచ్చిన మా తెలుగు అధ్యాపకురాలు ఎం. అలివేణి గారికి నేను మనస్పూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నాను.

*చెప్పినవారు: అరుణమ్మ*
*వయస్సు: 67 సంII లు*
*మహబూబ్‌నగర్*

*సేకరించినవారు :*

**జే. స్నేహ**

BBA 2nd year

క్రమ సంఖ్య: 1058-22-684-040

తేదీ: 19-09-2022

# 55. ఇద్దరు యువరాజులు

విజేయుడు, అజేయుడు అనే యువరాజులు ఇద్దరూ ఆశ్రమంలో గురువు గారి వద్ద విద్యాభ్యాసం పూర్తిచేసేవారు. వారిని తిరిగి రాజ్యానికి పంపేలోపు ఓ చిన్న పరీక్ష పెట్టాలనుకున్నారు గురువు గారు. ఇద్దరిని పిలిపించి.... 'నాయనా, మన ఆశ్రమానికి 70 క్రోసుల దూరంలో కొన్ని ఆటవిక జాతుల వారి గుహలున్నాయి. వాటిలో అమూల్యమైన మరకథమణి ఉంది. దాన్ని ఎవరు తొందరగా తీసుకొస్తారో వారే ఈ పరీక్షలో విజేత' అనిచెప్పారు. దాంతో యువరాజులిద్దరూ గుహలను వెతుక్కుంటూ బయలుదేరారు. దారిలో వారికి ఒక వ్యక్తి తీవ్రగాయాలతో కనిపించాడు. ఆగితే ఆలస్యం అయిపోతుందని అజేయుడు ముందుకు వెళ్లిపోయాడు.

కానీ విజేయుడు మాత్రం ఆగి, అతడికి సపర్యలు చేసి, ఎవరో ఏంటో అని అనుకున్నాడు. కాస్త స్థిమితపడి ఆ వ్యక్తీ వెళ్లిపోయాక విజేయుడు మళ్ళీ బయల్దేరాడు కొంతదూరం వెళ్ళాక అతడికి అజేయుడు ఆటవిక తెగల చేతిలో బంధీగా కనిపించాడు. వెంటనే విజేయుడు వారితో స్నేహంగా మాట్లాడి ఆజేయుడిని విడిపించాడు. అంతేకాదు ... వారు విజేయుడిని గుహల వద్దకు తీసుకెళ్లి మరకతమణి కూడా ఇప్పించారు. ఇదంతా ఎలా సాధ్యమైందో అజేయుడికి అర్థం కాలేదు.

అదే విషయం అడిగాడు. అప్పుడు విజేయుడు... 'దారిలో గాయాలతో కనిపించిన వ్యక్తి వీరి చేతిలో దాడికి గుర్తేనవాడే. వల్లెలా ప్రవర్తిస్తారో అతడే నాకు చెప్పాడు. దాన్ని బట్టి వారిని నా మాటలతో ఆకట్టుకున్నాను. వాళ్ళ ద్వారానే మణిని కూడా సంపాదించాను' అని చెప్పాడు. పగ వారికి సాయం చేస్తే అది మనకూ మంచేనన్న విషయం అపుడే అజేయుడికి అర్థమైంది.

చెప్పినవారు*: యాదమ్మ*

*వయసు: 60*

సేకరించినవారు :
**పి.నవ్య**
BBA 2nd year
క్రమ సంఖ్య: 1058-22-684-096
తేదీ: 19-09-2022

# 56. అలవాటు ! ...

ఒకప్పుడు అవంతి రాజ్యాన్ని రణవర్మ పాలిస్తుండేవాడు. ఆయన మంచివాడే కానీ మహాకోపిష్టి. ఎదుటివాళ్లని అకారణంగా శిక్షించి ఆ తర్వాత తీరిగ్గా పశ్చాత్తాపడే వాడు. రణవర్మ ప్రతినెలా మొదటి రోజు రాత్రి మారువేషంలో దేశాటనకి వెళుతుండే వాడు. ఓ రోజు అలా వెళుతుండగా ఆయనకి తిమ్మన్న అనే యువకుడు ఎదురయ్యాడు. అతన్ని ఆపి 'మీ రాజుగారి పాలన ఎలా ఉంది?' అని అడిగాడు. దానికి తిమ్మన్న 'ఏం చెప్పను 'రాజు ఎంత మంచివాడైనా తన కోపం కారణంగా ప్రజల్ని కష్టాలపాలు చేస్తున్నాడు...' అంటూ బాధపడ్డాడు. రాజుకి ఆ మాటతో కోపం తల కెక్కింది. తను మారువేషంలో ఉన్న విషయం కూడా మరచిపోయి "మూర్ఖుడా నా ఎదుటే నా గురించి అంత మాటంటావా, నీలాంటివాళ్లని గుర్తించాలనే ప్రతినెలా రోజు ఇలా మారువేషంలో వస్తున్నాను....." అంటూ గొంతు పట్టుకున్నాడు. దాంతో తిమ్మన్న పై ప్రాణాలు పైనే పోయాయి. కానీ ఆ పరిస్థితిలోనూ అతని బుర్ర పాదరసంలా పనిచేసి... పెద్దగా నవ్వడం ప్రారంభించాడు. రణవర్మ ఎందుకలా... నవ్వుతున్నావ్!" అని అడిగాడు. 'మహరాజా! మీకు ప్రతినెలా మొదటి రోజు దేశాటన చేసే అలవాటున్నట్టే నాకూ ఆ రోజంతా అబద్ధాలాడే అలవాటుంది. కాబట్టి తమరి గురించి అలా చెప్పాను. నిజం చెప్పాలంటే... మీకన్నా గొప్పగా పాలించే వారు ఎవరూ లేరు!' అన్నాడు. రాజుకి అప్పటికి కోపం తగ్గడమేకాదు... అతన్ని సమయస్ఫూర్తి నచ్చింది. ఒకింత పశ్చాత్తాపంతో నువ్వు మొదట చెప్పిందే నిజం తిమ్మా!" అన్నాడు. ఆ తర్వాతి రోజు నుంచే తిమ్మన్నని రాజు సలహాదారుగా చేర్చుకున్నాడు. తిమ్మన్న తన తెలివైన సలహాలతో రాజు చికాకుని తగ్గించి.... ఆయనపై ఉన్న 'కోపిష్టి' ముద్రను పోగొట్టాడు.

*కథచెప్పినవారు: పి.విక్రాంతి*
*వయస్సు: 51*
*గ్రామం: పులిమాడుగు గ్రామం, ఆదిలాబాద్ జిల్లా*

*సేకరించువారు:*
**జే.నిష్కిత**
బి.కామ్. కంప్యుటర్ అప్లికేషన్స్

# 57. కోతి-ముల్లు

అనగనగా ఒక కోతి ఉంటది. ఆ కోతి చెట్టుపైన ఎక్కుతది. ఎక్కినంక ఒకరూపాయి కనపడతది. అ రూపాయి దొరికితే తీసుకొని చెట్టు ఎక్కుతది. అట్లకెని ఒక చెన్గలైన వస్తాడు. చెన్గలైనను చూసి కోతి చెనెగలు కొంటుంది. ఆ చెనెగలు తినంగ ఒక చెనెగ కింద పడతది. చెనెగ గురించి కిందికి దిగితే తోకకు ముల్లు గుచ్చుకుంటది. అట్లకెని ఒక మంగలాయన వస్తాడు. మంగలాయన వస్తే ఆ తోకకు ముల్లు తీయి అంటే తోక కత్తిరిస్తడు. ఆ తోక కత్తిరిస్తే నాకు కత్తన్నయి, నాకు కత్తెరన్న ఇయి అని అడుగుతుంది. అతను కత్తెర ఇచ్చిపోతాడు. అట్లకెని ఆడ ఒక అమె కట్టెలు కొడతది. కట్టెలు కొడుతుంటే ఆ కట్టెలామె దగ్గరకు పొయి అమ్మా ఈ కత్తి తీసుకొని కట్టెలు కొట్టు అంటే అమె కత్తి తీసుకొని కట్టెలు కొడుతుంటే కత్తి విరిగిపోతది. కత్తి విరిగిపోతే నాకత్తన్న ఇయి, కట్టెలన్న ఇయి అని అంటే కట్టెలు ఇస్తుంది. ఆయితే అ కట్టెలు తీసుకొని అట్లకెని అడవిలకెని పోతుంటే ఒక అమె పూరీలు చేస్తాది. పూరీలామె కట్టెలు తీసుకొని పూరీలు చేస్తూంటే కట్టెలు అన్ని అయిపోతాయి అయితే నా కట్టెలన్న ఇయి, నీ పూరీలన్న ఇయి అన్ని అడిగితే అమె పూరీలు ఇస్తది. అ పూరీ తీసుకొని పోతుంటే ఒకపిల్ల ఆకలికి ఏడుస్తోంది. పిల్ల ఏడుస్తుంటే కోతి పోయి పూరీలు ఇస్తది. పూరీ ఇస్తే అ పూరీ తిన్నంకా నా పూరన్న ఇయి, పిల్లనన్న ఇయి అన్ని అడిగితే అమె పిల్లని ఇస్తది. అ పిల్లని తీసుకొని బావిగడ్డ మీద కుర్చుంటది. బావిగడ్డ మీద కూర్చుని తోకపోయి కత్తి వచ్చే డాం డాం డాం, కత్తిపోయి కట్టెలు వచ్చే డాం డాం డాం, కట్టెలు పోయి పూరీ వచ్చే డాం డాం డాం, పూరీలు పోయి పిల్ల వచ్చే డాం డాం  డాం.

*కథచెప్పినవారు:*
*భారతిబాయి (నాయనమ్మ)*
*వయసు: 64*